




# చత్రపతి శివాజీ

# ఛత్రపతి శివాజీ

(కథల సంపుటి)

★

జాగృతి ప్రచురణ

విజయవాడ - 2

# ఆ ము ఖ ము

మన హిందుభూమి పుణ్యభూమి, కర్మభూమి. సాక్షాత్తు భగవానుడు అవతరించి, పునీతమొనర్చిన దివ్యభూమి. ఈ భారతి పాత్రిళ్ళలో అనేకానేక పుణ్యమూర్తులు పెరిగి పెద్ద వారై తమ జీవితమే ధర్మంగా - ధర్మ ప్రతిష్ఠాపనే తమ జీవనలక్ష్యంగా జీవించారు. కాని కాలక్రమంలో ఆత్మ విస్మృతికి హిందుజాతి లోనయింది. తత్ఫలితంగా ఎవరైనా కర్తవ్యపరాయణుడైన ధీమంతుడీ ధరణిలో జన్మించితే చాలు, అతనిని వెంటనే అవతారపురుషుల్లో జమకట్టి ఆయన నెత్తిన దైవత్వాన్నిరుద్దడం జరుగుతోంది. దైవగుణాలను మానవులమైన మనం అలవరచుకోలేమనే భ్రమతో ఆ యా పురుషులలోని సద్గుణాలను అనుకరించడం మానివేయటం గూడా కనబడుతోంది. ఇదియే మన జాతిని సర్వోచ్చ శిఖరాగ్రాలనుండి, జగద్గురుత్వ స్థానాన్నుండి పతనం చేసింది. ఈ స్థితి మారాలి. లేకుంటే ఈ జాతికింక మోక్షంలేదు. కర్తవ్యము విస్మరించినవానికి కడకు అధఃపతనమే మిగిలేది. ఈ ఆత్మ విస్మృతిని పోగొట్టి కర్తవ్యమార్గంలో జాతిని నడిపించే ప్రయత్నం ఈనాడు ఈ హిందుభూమిలో జరుగుతోంది. అచిరకాలంలో అది విజయాన్ని సాధించాలి.

మానవుడు ముఖ్యంగా జ్ఞానజీవి. తన జ్ఞానం సాధనంగా వ్యక్తి నిజమైన మానవుడుగా, కర్తవ్యపరాయణుడుగా, రూపొంది,సాధనమార్గంలో పయనిస్తూ దివినుండి దివ్యత్వాన్ని భువికి దింపగలిగే మార్గాన్ని ప్రవచించింది హిందూధర్మం.

ఈ ధర్మంలో ప్రభవించిన ప్రతివ్యక్తి, తదనుగుణంగా తన జీవితాన్ని తీర్చిదిద్దుకొనుటకు ప్రయత్నిస్తూవుంటాడు. ఆ కృషిలో విజయం సాధించాలంటే, వానికి సాకారమైన మూర్తి యొకటి ఆదర్శంగా కనులముందుండాలి. ఆ మూర్తి సంశయాల కతీతమై, దోషరహితమై, స్ఫూర్తిప్రదమై వుండాలి. ఆత్మ విస్మృతిలో అలమటించే నేటి హిందుజాతికి అట్టి ఆదర్శ మూర్తి ఛత్రపతి శివాజీ మహారాజు కాగలడు. సమర్థ రామదాసస్వామి గూడ 'శివాజీ స్వరూపాన్నే ధ్యానించండి, శివాజీ ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని ప్రబోధించారు. శివాజీని ఆదర్శంగా స్వీకరిస్తే మన హిందుత్వాన్ని రక్షించటానికి ఆయన చూపిన పరాక్రమం, ఆయన చేసిన సాహస కృత్యాలు గుర్తుకువస్తాయి. నేల కొరగిన హిందూధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలలో ఎగురవేసి – 'హిందూ పద పాదుశాహి' నెలకొల్పటమేగాక మృతప్రాయమైయున్న హిందుత్వంలో అమృతాన్ని నింపి ప్రాణ ప్రతిష్ఠ చేశాడు.

మన అదృష్టవశాత్తు ఇంతవర కాయనను పూర్తిగా అవతారమూర్తుల శ్రేణిలోనికి నెట్టలేదు. ఒక గుడి కట్టి లోన బెట్టి తాళంవేయలేదు. అట్లా జరగకముందే శివాజీ జీవితము-లక్ష్యములు, మన హిందూజాతికి సరిగా నవగాహన యగునట్లు చేయు యత్నములలో నిది యొక అల్పప్రక్రియ.

శివాజీని గురించి వినని హిందువు డుండడు. ఆతని సాహస గాథలు వినినప్పుడు పులకించని హిందుత్వాభిమాని యుండడు. కాని ఆతనిని కొండ ఎలుకయని, దోపిడీ దొంగయని, మోటు మనిషియని స్వప్రయోజనపరులైన విదేశీయ

చరిత్రకారులు వ్యాఖ్యానించుటను వినినప్పుడు ఎందరో హిందువులు కించపడుటగలదు. తమ రక్తములను పొంగింప చేయజాలిన ఒక మహావ్యక్తి యిట్లు చులకనగా వర్ణింప బడుట వారిని బాధించుట సహజమే. కాని శివాజీ జీవితమును గుఱించి సరియైన పరిజ్ఞానమున్నచో వారి హృదయములు గర్వముతో ఆనందించగలవు.

శివాజీ జీవితమును గుఱించిన పుస్తకములు మన యాంధ్రదేశమున చాల యరుదు. ఈ మధ్య కాలమున మహా రాష్ట్రములో ననేక పరిశోధనలను జరిపి శివాజీ జీవిత సంగ్రహము-అధికారికముగా గ్రథనము చేయబడినది. అట్టి పరిశోధనా వ్యాసములను ఆధారము చేసుకొని శివాజీ యొక్క జీవితమును - ఆయన యొక్క అతిసామాన్య బాల్య మును - సాహసోపేతమైన యౌవనము - అం దాయన ప్రదర్శించిన ధైర్యము - రాజనీతిజ్ఞత - చతురతలు - ఆయన తనతోటివారిలో రగుల్కొల్పిన స్వాభిమానపూర్ణ దేశభక్తి త్యాగ భావములను - ప్రస్ఫుటముగా వ్యక్తము చేయజాలిన కొన్ని ఘట్టములు ఈ పుస్తకమునందు శ్రీ శ్రీరామ్ శ్రీపాద సాతేగారిచే వర్ణింపబడినవి.

— ప్రకాశకులు

# స్వరాజ్య స్థాపన

దక్షిణ భారతములోని మహారాష్ట్ర ప్రాంతమున పదు నాల్గవ శతాబ్దమున నొక హిందూ సామ్రాజ్య ముండెడిది. దేవగిరి దానికి రాజధాని. యాదవులు స్థాపించిన ఈ హిందూ సామ్రాజ్యమును ఢిల్లీ సుల్తానగు ఖిల్జీ నాశనము చేసెను (24-3-1307). తదనంతరము, మహారాష్ట్ర ప్రాంతమున మూడువందల ఏబది సంవత్సరముల వరకు మరల హిందూ రాజ్యమే లేకపోయెను. పదునేడవ శతాబ్దపు తొలిభాగమున దక్షిణ భారతమును బహమనీ వంశస్థులగు ఐదుగురు సుల్తానులు పాలించిరి నాడు మహారాష్ట్రములో నెందరో హిందూ వీరులు గలరు. వారు బహమనీ సుల్తానులవద్దగాని, ఢిల్లీని పాలించు మొగలు పాదుషాలవద్దగాని కొలువు చేయుచూ జీవించుచుండెడివారు. వారికి శౌర్య సాహసములు మెండు. కాని దేశభక్తి మాత్రము శూన్య మనవచ్చును. స్వలాభము, కీర్తి ప్రతిష్ఠలకొఱకు వారు సుల్తానులను సేవించుచుండిరి. వారు ఆసుల్తానుల అధికారము నిలబెట్టుటలో తమ ప్రాణములను గూడ త్యజించెడివారు.

ఆ రోజులలో ఔరంగాబాదునకు సమీపమునందు "వేరూడ్" అను గ్రామము గలదు. అందు మాలోజీరావు అను హిందూ సర్దారు దుండెను. అతడు మిక్కిలి పరాక్రమవంతుడు. అహ్మద్ నగర సుల్తానగు నిజాం షాహీవద్ద నాతడు కొలువు చేసెడివాడు. స్వీయ శక్తియుక్తులతో, కొలదికాలములోనే వారివద్దనుండి అతడు 'పూనా' జాగీరును సంపాదించెను. మాలోజీరావ్ ఉత్తముడు, దైవభక్తుడు. తన జాగీరులోని ప్రజలను కన్నబిడ్డలవలె జూచుకొనెడివాడు. తాను కొలువుచేయుచున్న నిజాంషాహి పక్షమున నిలచి మొగలులతో యుద్ధముచేయుచు అతడు చనిపోయెను. (క్రీ. శ. 1605)

మాలోజీరావ్ చనిపోవునాటికి, అతనికి ఇద్దరు కుమారులు. పెద్దవాడైన శహాజీకి ఐదు సంవత్సరములు. చిన్నవాడైన షరీఫ్‌జీకి మూడు సంవత్సరముల వయస్సు. తండ్రిని కోల్పోయిన ఆ బిడ్డ లిద్దరినీ మాలోజీరావు తమ్ముడగు విఠోజీ పెంచి పెద్దజేసెను. ఆనాడు నిజాంషాహి వద్ద కొలువు చేయుచున్న లఖూజీరావ్ జాధవ్ అను నొక సరదారుని కుమార్తెయగు జిజియాబాయితో శహాజీకి వివాహము జరిగెను. చిన్నతనముననే అత్తవారింటికి వచ్చిన జిజియాబాయికి, తన చుట్టుప్రక్కల నున్న దేశ పరిస్థితి బాగుగా నవగతమయ్యెను. మహమ్మదీయులు హిందువులకు పవిత్రములైన గోవులను నడివీధులలో చంపెడివారు. దేవాలయములను, దేవతా విగ్రహములను పగులగొట్టెడివారు. సుల్తానుల వద్ద నుద్యోగము చేసెడి హిందువులుకూడ తోటిహిందువుల ఆస్తులను దోచెడివారు. ఇండ్లు తగులపెట్టుటవంటి దారుణ

కృత్యములనుచేసెడివారు. దీనినంతనూచూచిన జిజియాబాయి మనస్సులో, మహమ్మదీయ పాలనపట్ల నొక విధమగు జుగుప్స గలిగెను. ఆమె తన బాల్యమున రామాయణ, భారతాది గ్రంథముల నెంతయో ఆసక్తితో చదివెడిది. నాటినుండి విదేశీపాలన పోయి చక్కని రామరాజ్య మేర్పడ వలెనను కోరిక ఆమె హృదయమున పాదుకొనినది. తన భర్తయగు శహాజీ నిజాంషాహీవద్ద నుద్యోగము చేయుట ఆమె కెంతయో కష్టమనిపించెడిది.

జిజియాబాయి తండ్రియగు లఖూజీరావునకు ముగ్గురు కుమారులు. పెద్దవానిపేరు అచలోజీ, రెండవవాడు రఘోజీ, మూడవవానిపేరు యశ్వంతరావు. వీరందరూ నిజాంషాహి కొలువులోనివారే. స్వీయ శౌర్య, ధైర్యాది గుణములవలన వీరు క్రమముగా తమ పలుకుబడిని పెంచుకొనుచుండిరి. ఆ కొలువులోని ఇతర సర్దార్లకేగాక సుల్తానుకుకూడ నది కన్నెఱ్ఱ యైనది. ఇట్టి వీరులవలన తనకేనాటికైన ప్రమాదమే యని సుల్తాను తలంచెను. తన నూతన రాజధానియగు దౌలతాబాదునందు కొలువుతీర్చి, లఖూజీరావును మువ్వురు పుత్రులతోబాటు దర్బారునకు పిలిపించెను. సుల్తాను ముందుగనే చేసిన ఏర్పాట్ల ప్రకారము, వారు నలుగురు నచ్చట హత్యగావింపబడిరి. (ఆషాఢ పూర్ణిమ. 25-7-1629). ఈ భయంకరవార్త తెలియునప్పటికి, జిజియాబాయి గర్భవతి. భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయగు శివాజీప్రభు వప్పుడామె గర్భమం దుండెను. తల్లికి, ముగ్గురు వదినెలకు, అకారణమున నంతటి భరింపరాని వైధవ్యము కలుగుట యామెను కలచి వైచెను. దీనికి కారణమైన తురుష్కపాలనపై నామెయొక్క

అసహ్యాభావము ద్విగుణీకృత మయ్యెను. ఏనాటికైనను, స్వతంత్ర హిందూరాజ్య మేర్పడగలదా ? జాతికి మోక్షము లభింపగలదా ? యను ప్రశ్న లామె మనమున మొలకెత్తెను. తన గర్భమందున్న శిశువే తన ఆకాంక్షలను తీర్చగలడని ఆనాడామె ఎరుంగదు.

శహాజీకి తన మామయగు లఖూజీరావుతో కారణాంతరములచే విరోధమున్నది. కాని యతనిలోని సద్గుణముల పట్ల గౌరవముకూడ నుండెడిది. లఖూజీరావు పుత్రులతోసహా చంపబడినాడని యాతడు వినెను. వెంటనే అతనికి సుల్తాను కొలువునం దయిష్టము కల్గెను. సుల్తాను కొలువులో నున్నచో, తనకు కూడ నేదో ఒకనాడు అటిస్థితి కలుగవచ్చునని భావించి, ఆతడు ఒక స్వతంత్రరాజ్యము నేర్పరచుకొనవలెనని తలంచెను. వెంటనే నిజాంషాహివద్ద నుద్యోగమును విరమించి, శహాజీ తన జాగీరగు పూనాకు చేరికొని, దానిని స్వతంత్ర రాజ్యముగా ప్రకటించెను. దాని పరిసర ప్రదేశమును గూడ నాక్రమించెను. పూనాకు చుట్టుపట్ల నున్న భూమియంతయు బీజపూరు సుల్తానుకు చెందినదే. తన సాహసమునకు తొలి ఫలము బీజాపుర సుల్తానుతో యుద్ధమని శహాజీకి తెలియును. అందుచే గర్భిణియైన జిజియాబాయిని అసమయమున పూనాలో నుంచుట భద్రము కాదనితలచి, ఆమెను సురక్షితమైన శివనేరి దుర్గమునకు జేర్చెను. శహాజీ శివనేరి కేగిన సమయమున, రాయారావ్ అనునొక హిందూ సరదారుని నేతృత్వమున బీజాపూర్ సైన్యము పూనాను ముట్టడించెను. కోట గోడలును, తదితర వసతులును ధ్వంసము చేయబడెను శహాజీ ప్రారంభించిన స్వరాజ్య నిర్మాణ యత్నము తొలిదశలోనే

నాశనమయ్యెను. ఇంక స్వరాజ్య ప్రయత్నము ప్రయోజనకారి కాదని యెంచిన శహాజీ, భార్యాబిడ్డలను శివనేరిలోనే యుంచి మరల మొగలుల వద్ద నుద్యోగము సంపాదించుకొనుటకు పోయెను. పిమ్మట కొన్నిదినములకు జిజియాబాయి ఒక శుభ లగ్నమున కుమారుని ప్రసవించెను. (19 ఫిబ్రవరి 1630). అతడే భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయగు శివాజీ ప్రభువు.

శహాజీ మొగలులవద్ద రెండేండ్లు పనిచేసెను. ఆ తరువాత శహాజీ మరల నిజాంషాహివద్ద కొలువునకు చేరెను. సామర్థ్యముండి స్వాభిమానములేని కుక్షింభరులగు హిందూ వీరులను స్వార్థపరులైన సుల్తానులు, సమయానుకూలముగ నుపయోగించుకొనుట సహజమేగదా! తరువాత నొకసారి మొగలులు నిజాంషాహితో పోరాడి, ఓడించి, అతనిని, వజీరునుకూడ బంధించి తీసికొనిపోయిరి. శహాజీ మాత్రము తనకు ప్రభువగు నిజాంషా పక్షమున నిలిచి మొగలులతో కొంతకాలము పోరాటము కొనసాగించెను. పిమ్మట నిజాం షాహి చిన్న కుమారుడు 'మూర్తఝా' ను రాజుగా చేసి, శహాజీ అధికారమంతయు తనచేత జిక్కించుకొని పరిపాలింప సాగెను (జూలై 1633). ఈ విధముగా రెండు మూడేండ్లు గడచినవి. మొగలుల సహకారముతో బీజపూరు సుల్తాను శహాజీపై దండయాత్ర చేసెను. అందు శహాజీ ఓడిపోయెను. కాని సమర్థుడైన సరదారగు శహాజీని బీజపూరు సుల్తాను ఆదిల్‌షా తన కొలువులోనికి తీసుకొనెను. కాని శహాజీని పూనా, కొండప్రదేశములలో నుంచలేదు. శహాజీకి మరల స్వరాజ్యాకాంక్ష కలుగకుండునట్లు దూరమున నున్న కర్నాట

కములోని బెంగుళూరునకు పంపించెను (1636). ఢిల్లీ సుల్తా నగు షహాజహాన్ పెట్టిన షరతు ప్రకారమది జరిగెను.

శహాజీ బెంగుళూరునకు పంపబడినను, పూనా జాగీరు మాత్ర మతని యధికారముక్రిందనే యుండెను. బెంగుళూరు నకు చేరుటకు ముందు, శహాజీ తన జాగీరు పరిపాలనా నిర్వాహణకుగాను దాదాజీ కొండదేవ్ అను బ్రాహ్మణుని నియమించెను. ఈతడు చక్కని పండితుడు, పరిపాలనాదక్షుడు తన భార్యయగు జిజియాబాయిని పుత్రునితోసహా శహాజీ యీతని పర్యవేక్షణలో నుంచెను. అప్పటికి శివాజీ వయస్సు ఆఱు వత్సరములు.

దాదాజీ కొండదేవుడు పూనాకు వచ్చిన మూడు, నాలుగేండ్లలోనే, అస్తవ్యస్తముగ నున్న ఆ జాగీరును సరిదిద్ది అందలి ప్రజలకు సుఖమును సమకూర్చెను. శివాజీకి వయసుకు దగిన విద్యలన్నింటియందు చక్కని శిక్షణనిచ్చి, పదియవ యేడున నాతనికి వివాహమును కూడ చేసెను. పనుల ఒత్తిడి చేత శహాజీకి యీ శుభసమయమునకు పూనాకు వచ్చుటకు వీలువడలేదు. అందుచే శహాజీ తదనంతరమున నొకసారి తన భార్యాబిడ్డలను బెంగుళూరునకు పిలిపించెను. బెంగుళూరులో శివాజీ తన తండ్రితో కొలది దినములు మాత్రమే గడపెను. ఆరోజులలోనే బీజపూరును చూపించుటకై శహాజీ శివాజీని తనవెంట తీసికొనిపోయెను. బీజపూరు ప్రయాణము రెండు భావములను స్థిరముగ శివాజీ మనమున ప్రతిష్ఠించెను. తురుష్కుల వలన ఉజ్జ్వలమైన విజయనగర హిందూ సామ్రాజ్యము విధ్వంసమైనదనియు, యీ దేశమున నన్యాయముగ

కొల్లగొట్టిన సంపదతో తురుష్కులు యానందమున తుల తూగుచున్నారనియు శివాజీ గ్రహింపగలిగెను.

బీజపూర్‌న యెక్కువ దినములుండుటగాని, సుల్తాను దర్బారున కేగుటగాని శివాజీకి మనస్కరించలేదు. కుమారుని లోని యీ స్వతంత్ర భావమును గ్రహించిన శహాజీ చాల సంతోషపడెను. తెలివితేటలలో, శౌర్యసాహసములలో తనకు కుడిభుజమువంటి వారిని కొందఱిని యెంచి, శివాజీలోని స్వేచ్ఛా, స్వాభిమాన భావములకు దోహదము చేయు నిమిత్తమై, శివాజీతో పాటు పూనాకు పంపుచు, శామ్‌రావ్ రాంఘేకర్ అను అనుభవజ్ఞుని పూనాకు పీష్వాగా నియమించెను.

బెంగుళూరునుండి పూనాకు తిరిగివచ్చునాటికి శివాజీకి పదునొకండు వత్సరములు. నాటినుండి జాగీరు నిర్వహణలో అనుభవము కల్గించుటకై దాదోజీ, శివాజీని ఎల్లప్పుడూ తన తోనే యుంచుకొనుచుండెను. శివాజీది సహజముగ తీక్ష్ణబుద్ధి. అతనికి చక్కని దేశభక్తిని తల్లి బాల్యమునందే ఉగ్గుబాలతో రంగరించి పోసినది. ఆ తల్లి యొక్క శిక్షణవల్లనే రామ రాజ్యమువంటి హైందవ సామ్రాజ్యము దేశములో నిర్మాణము కావలెనను కోరిక యతని మనస్సులో స్థిరపడినది అట్టి రాజ్యము నిర్మించుటకు ఒక వ్యక్తికి అవసరములైన గుణ గణములు, శక్తి, జ్ఞానములు తనలో నలవరచుకొనుటకై అతడు యెల్లప్పుడును కృషిచేసెడివాడు. విద్యయందభిలాష, అర్హత యున్న శిష్యునకు, దాదాజీ కొండదేవ్ వంటి సమర్థుడు గురువుగా లభించినచో ఫలితమునకు కొదవేమి? అనతి

కాలములోనే పరిపాలనా వ్యవహారములలోను, సంఘటనా నిర్మాణములోనూ శివాజీకి మంచి నేర్పరితనము వచ్చెను. దాదాజీ కొండదేవుడు తన జాగీరులోని ప్రజలను యెంతగా అభిమానించి, వారి కష్టసుఖములపాలు పంచుకొనెడివాడో, వారికి క్రమశిక్షణ గఱపుటలో నంత నిర్దాక్షిణ్యముగా నుండెడివాడు. పొరపాటు జరిగినప్పుడు తననుకూడ తాను క్షమించుకొనెడివాడుకాడు. ఒకసారి జాగీరుకు చెందిన చెట్టు నుండి మామిడిపండు నొకదానిని పొరపాటున కోసినందుకు గాను, తనను తాను శిక్షించుకొని ఆనాటినుండి ఒక చేయి లేని చొక్కానుమాత్రమే ధరించుచుండెడివాడు. గురువు నందలి సద్గుణములన్నియూ శివాజీకి అలవడెను.

శివాజీ జాగీరుయొక్క పనులన్నియూ తానే చూచు కొనుట ప్రారంభించెను. పరిపాలనా నిర్వహణలో క్లిష్టసమస్య లేర్పడినపుడుకూడ శివాజీ యెంతో నేర్పుతో దానిని పరిష్క రించెడివాడు. ఒక పర్యాయము రాంఝూ అను గ్రామపు పటేలు ఒక స్త్రీని బలాత్కారము చేసెను. స్త్రీని మాతగా పరిగణించు హిందూ రాజ్యములో ప్రభుత్వమునకు చెందిన ఒక అధికారి యీవిధమైన అపరాధము చేయుటను చూచిన శివాజీ కోపోద్రిక్తుడై, వెంటనే వానిని బంధించి, కాళ్లు, చేతులు నరికించెను. (28-1-1645). అన్యాయమును ధైర్య ముతో ప్రతిఘటించు స్వభావము, దేశభక్తి, ఆత్మవిశ్వాస ములు అలంకారములుగాగ, ప్రకాశించు శివాజీపట్ల ఆతని ప్రజలందరకూ గౌరవాభిమానము లేర్పడెను. అతనికి తన ప్రజలపట్ల నాత్మీయతాభావ ముదయించెను. అతడు యెల్ల ప్పుడూ తన జాగీరులో సంచరించుచూ ననేకమందితో

స్నేహము చేసెడివాడు. ఆనాటినుండి వారి హృదయములు దేశభక్తి భరితములయ్యెడివి. దేశమునకై యెట్టి సాహసము చేయుటకునైన వారు సంసిద్ధులయ్యెడివారు. హైందవ సమాజమును తీర్చిదిద్దగల్గిన దక్షుడుగా శివాజీ రూపొందుచుండుటను చూచి దాదోజీ యెంతయో యానందపడెను. సర్వాంగ సుందరముగా దేవతామూర్తిని తీర్చిదిద్దిన శిల్పి, దానిముందు చేతులు జోడించి వినమ్రుడై నమస్కరించునట్లు, చిన్ననాటి నుండి శివాజీ వ్యక్తిత్వమును హిందూ సంప్రదాయానుగుణముగా తీర్చిదిద్దిన దాదోజీ, నేడు సర్వసమర్థుడైన ఆ ప్రభువు ముందు చేతులుకట్టి, ఆజ్ఞలకై నిరీక్షించుచుండెను. దాదోజీ వంటి సమర్థులైన పెద్దలసలహాలు, సాహసికులైన స్నేహితుల సహకారము తోడుగా శివాజీ తన చిరకాల వాంఛితమగు హిందూ సామ్రాజ్య నిర్మాణమునకై కృషి నారంభించెను.

ఆ కాలమున కాశ్మీరమునుండి కావేరి వరకూ వ్యాపించి యున్న దేశములో-మధ్యనున్న చాందా, గోండు వనాన్ని వదలి మిగిలిన దేశమంతయూ - విదేశీయులైన తురుష్కుల యధీనములో నుండెను. దేవగిరి రాజుల హిందూరాజ్యము, విజయనగర హిందూ సామ్రాజ్యము నశించిపోయినవి. పిమ్మట రెండుసార్లు శహాజీ చేసిన స్వరాజ్య ప్రయత్నములు కూడ విఫలము లయినవి. వీనియొక్క గుణదోషములను జ్ఞప్తి యందుంచుకొని, భవిష్యద్ హిందూ సామ్రాజ్య నిర్మాణ యత్నము కొనసాగించవలసి యున్నది. అందులకై శివాజీ తన మిత్రులందరితోనూ అనేక పర్యాయములు చర్చలను జరిపెడివాడు. ఒకసారి ఒక పాడువడిన దేవాలయము, వేరొకసారి కీకారణ్యము, మరియొకసారి కొండగుహ, ఇుం

కొకసారి యిసుకతిన్నె - యీ విధముగా ననేక ప్రదేశములు వారి చర్చలకు రంగస్థలములు కాజొచ్చినవి. నిర్ణయము తీసికొనుటలోనే ఆలస్యముగాని, తీసికొనిన నిర్ణయమును ఆచరించుటలో వారు అతి చురుకుగా ప్రవర్తించెడివారు. తాము అనుకొనిన ప్రకారము బీజపూరు సుల్తాను దృష్టి పథములో నిర్లక్ష్యము చేయబడుచున్న 'కాన' లోయలోని 'తోరణ' దుర్గమును తొలుత జయించి, వారు హిందూ సామ్రాజ్య నిర్మాణోద్యమమునకు మంగళతోరణము కట్టిరి. ఆ తోరణ దుర్గమును బాగుచేయుసమయమున, దానిని పాలించిన పూర్వ చక్రవర్తులందు దాచికొనిన నిధి దొరికినది భావి విజయసూచకమగు ఆ ధనమును వినియోగించి, తోరణ దుర్గమున కెదుటనున్న 'మురుంబదేవ' గిరిపై నొక క్రొత్త కోటను కట్టించి, దానికి శివాజీ 'రాజ్ గడ్' అని పేరుపెట్టెను. తదనంతరము కొన్నిరోజులకు 'పౌఢ' లోయలోనున్న 'కువారి' కోటనుగూడ శివాజీ స్వాధీనము చేసుకొనెను. ఆ కోటలతో బాటు వాని పరిసరములలోనున్న దేశమంతయూ శివాజీ యధీనములోనికి వచ్చెను. కాని వాస్తవమున కా ప్రదేశ మంతయూ 'శిరవళ, సుభానమంగళ' కోటలు బీజపూరు ప్రతినిధి మియా రహీమ్ అహ్మద్ అధీనములో నుండెడిని. అతడు తన యధీనములోని ప్రదేశమును శివాజీ ఆక్రమించగా ఏమియు చేయజాలనివాడై, ఆ వార్తను బీజపూరు సుల్తానుకు తెలియపరచెను. ఆ విషయమును ముక్కుపచ్చలారని పదునారేండ్ల బాలుని చిలిపిపనిగా భావించిన సుల్తాను యికపై నట్టి యాటలను సాగనీయవద్దని తన యాజ్ఞగా ఆయా గ్రామముల దేశముఖులకు హెచ్చరికలను పంపుమని మియా

రహీంఖానకు కబురుపెట్టెను. సుల్తాను ఆజ్ఞ ప్రకారము అతడు ఆ ప్రాంతమున నున్న దేశముఖులందఱకు తాఖీదులను పంపెను గాని ప్రతిసంవత్సరము పన్నులు కట్టుటకు స్వయముగా వచ్చెడి ఆ దేశముఖులు, ఆయేడు పన్నులు కట్టుటకు ఖానువద్దకు రానైనలేదు.

స్వరాజ్య నిర్మాణమునకు తొలి దశలోనే నాలుగు కోటలను సాధించిన శివాజీని చూచి తన శిక్షణ సఫలమైనది గదాయని దాదోజీ యమితానందము నందెను. పిమ్మట కొంత కాలమునకు ఆయన పరమపదించెను. ఆయన మరణించుట శివాజీకి తీరని నష్టమయిననూ, దేశకార్యము ఒక వ్యక్తితో ముడిపెట్టుకొనలేదని గుర్తించిన శివాజీ సాహసముతో పరిస్థితుల నెదుర్కొనెను. జీవించియుండగా దాదోజీ, బీజపూరు సుల్తాను ప్రతినిధిగా సుబేదారుహోదాలో కొండణా కోటను గూడ పాలించెడివాడు. దాదోజీ మరణించినంతనే, సుల్తాను కొండణా కోటలో తన ప్రతినిధిగా శిరవళదుర్గాధిపతియైన అహ్మద్‌ను నియమించెను. ఈ వార్త వినిన వెంటనే తన యనుచరుడైన బాపూజీ ముద్గళ దేశపాండే యను వీరుని కొండణా కోటపైకి దాడిపంపెను. బాపూజీ ముందుగనే కొండణాకోట చేరుకొని ఆ దుర్గాధిపతి కెట్లో నచ్చచెప్పి, కోటను స్వరాజ్యములో కలిపెను. కోటపై భగవపతాకము నెగురవేసెను. శిరవళ దుర్గాధిపతియైన అహ్మద్ బీజపూర్ సుల్తాను ఆజ్ఞ ప్రకారము కొండణా కోటను తన యధికారము లోనికి తీసికొనుటకై బయలుదేరెను. గాని అంతకుముందే శివాజీ ఆ కోటను స్వాధీనపరచుకొన్నట్లు మార్గమధ్యముననే తెలిసి అతడు తిరిగి 'శిరవళ'కే పోయెను.

శివాజీ కొండణాకోటను ఆక్రమించెనను వార్త బీజపూరునకు జాబుద్వారా తెలిసినది. సుల్తాను ఆశ్చర్యపడెను. ఇటుపై శివాజీ చర్యలను 'కుఱ్ఱవాని యల్లరి'గా భావింపరాదని నిశ్చయించుకొనెను. అంతలోనే 'శిరవళ', 'సుభానుమంగళ' దుర్గములను కూడ శివాజీ యాక్రమించెనని విని, కర్తవ్యము తోచని స్థితిలోపడెను శివాజీపైకి తన సైన్యము నంపినచో ఆ వార్త బెంగుళూరులోని శహాజీకి తెలియును. అతడు తన వద్దనున్న పదిహేనువేల సైన్యముతోను విప్లవము జరిపి, స్వాతంత్రమును ప్రకటించుకొను నవకాశ మున్నది. అప్పుడు తనకు మఱింత యిబ్బంది కల్గును అని యూహించిన సుల్తాను శివాజీపైకి సైన్యమును పంపుయత్నమును మాని, మోసము చేసి ముందుగా శహాజీని బంధింప దలపెట్టెను. వెంటనే వజీరు ముస్తఫా ఖాన్‌ను దక్షిణమునకు సైన్యమునిచ్చి పంపెను. కర్తృత్వ పరాయణుడైన శహాజీ పట్ల వజీరునకు మొదటి నుండియూ నీర్ష్య కలదు. బీజపూరులో శహాజీకి పరమశత్రువైన 'బాజీ ఘోర్పడే' యను హిందూసర్దారుని యీ పాపకృత్యము మున సహాయకునిగా నుంచుకొని సుల్తాను ఆజ్ఞ ప్రకారము వజీరు బెంగుళూరు చేరెను. ఆ విధముగా శహాజీ బంధింపబడిన వెంటనే తన సైన్యమును శివాజీ సైన్యముపైకి పంపవచ్చునని సుల్తాను ఆలోచించెను. శహాజీ కర్ణాటకములోని జింజీకోట వద్ద నుండగా వజీరుపోయి యాతనిని కలిసెను. ఆనాటినుండి వజీరు ముస్తఫాఖాన్, బాజీ ఘోర్పడేలు ప్రదర్శించుచున్న యకారణ ఆదరాభి మానములు, శహాజీ మనమున అనుమానములు రేకెత్తించినవి. బీజపూరులో నుండగా తన పొడవైన గిట్టని వీరు తనపట్ల ప్రేమాభిమానములు ప్రదర్శించుటలో

కేదో అంతర్యమున్నదని, దాని వలన తనకేదో అపాయ మున్నదని శహాజీ శంకించి, ఆ విషయమై వజీరును ప్రత్యక్ష ముగా పిల్చి మాట్లాడెను. శహాజీ మాటలు వినిన వజీరు, తన మోసము తెలిసిపోయి నందుకు క్షణకాలము స్థంభించి పోయెను. కాని అంతలోనే తేరుకొని తన మోసము బయట పడకుండుటకై ఖురానుపై చేయిపెట్టి తన కుమారునిపై నొట్టువెట్టి, తన హృదయమున యెట్టి మోసపుటాలోచనయూ లేదని చెప్పెను. ఆ శపథమును వినినంతనే శహాజీకి సంశ యము తొలగిపోయెను.

శహాజీ మనమున సంశయము పొడసూపినది కాన తాననుకొనిన పనిని చేయుటలో నికపై నాలస్యము కానీయ రాదని భావించిన వజీరు ఆ రాత్రియే శహాజీని బంధించు నేర్పాట్లు చేయసాగెను. వజీరు నివాసములో జరుగుచున్న ఈ రహస్య ప్రయత్నములను పసిగట్టిన వేగువాడొకడు ముందుగా హెచ్చరిక చేసిననూ, శహాజీ వజీరు మాటలపై నమ్మకముంచి ఆదమరచి నిద్రించెను. అర్ధరాత్రి సమయ మున వజీరు ముస్తఫా, బాజీ ఘోర్పడేలు సైన్యముతో శహాజీ నివాసముపై దాడిచేసి అతనిని బంధించిరి (25–7–1648). శహాజీ బంధింపబడిన వార్త బీజపూరున తెలిసినంతనే, సుల్తాను పత్తేఖానును ఏడువేల సైన్యముతో శివాజీపైకి దాడిబంపెను. అప్పుడు బెంగుళూరులో శివాజీ అన్నయగు శంభాజీ యొకడే యుండెను. అతనిపైకి కర్నాటకమునుండి ఫరాత్ ఖాన్‌ను దండయాత్ర కంపెను. బంధించిన శహాజీని సురక్షితముగా బీజపూరునకు పంపించమని వజీరు ముస్తఫా ఖానునకు సుల్తాను ఒక తాఖీదు నంపెను. ఈ విధముగా

బీజపూరుసుల్తాను నలుప్రక్కలనుండి శివాజీ ప్రయత్నములకు విఘాతము కల్గింప సమకట్టెను.

కర్నాటకమున శహాజీ బంధింపబడినాడను వార్త శివాజీకి పూనాలో తెలిసినది. తన తండ్రి యాపదలో చిక్కినందుకు శివాజీ చాల చింతించెను. అంతలోనే ఫతేఖానుడు తనపైకి దండెత్తి వచ్చుచున్నాడను వార్తకూడ అతనికి చేరినది. శివాజీకి అదియొక క్లిష్టపరిస్థితిగా నేర్పడినది. తన స్వరాజ్య నిర్మాణ యత్నములవల్లనే యిట్టి యాపదలు సంభవించిన వని శివాజీకి తెలియును. కాని ఆపదలకు బెదరి బీజపూరు సుల్తానువద్దకుపోయి క్షమార్పణ గోరుటయా ? లేక నాటి మిగతా హిందూ సరదారు లందరివలెనే పొట్టకొరకై వేరువేరు సుల్తానులవద్ద కొలువు చేయుటయా ? లేక యెన్ని యిక్కట్లు కల్గిననూ చలించక తన స్వరాజ్య ప్రయత్నములు సాగించుటయా ? - ఈ ప్రశ్నలు శివాజీ కెదురైనవి. తండ్రియగు శహాజీ బంధింపబడక నుండినచో యీ ప్రశ్నలే ఉత్పన్న మయ్యేడివి కావు. 'సౌభాగ్యమా ? స్వరాజ్యమా ?' అని జిజియాబాయి, "తండ్రి ప్రాణమా ? స్వరాజ్యమా ?" అని శివాజీ తేల్చుకొనవలసి వచ్చినది. ఆలోచనలకు వ్యవధిలేదు. బీజపూర్‌నుండి ఫతేఖాను వచ్చులోపల యేదియో యొక నిర్ణయము తీసుకొనవలసి వున్నది. చిన్నతనంనుండి స్వరాజ్య నిర్మాణముపట్ల శివాజీలో ఉత్సాహమును రేకెత్తించుచున్న జిజియాబాయి, నేడు తన భర్త ఆపదలోనున్నప్పుడుకూడ అదే ప్రోత్సాహ మివ్వగలదా? తల్లి మాంగల్యముకన్న స్వరాజ్యమును శివాజీ మిన్నగా

నెంచగలడా ! అవును. వారిని దేశభక్తియే జయించినది. మాతా పుత్రులు స్వరాజ్య నిర్మాణమునకే ప్రాధాన్యమిచ్చిరి.

ఈ నిర్ణయము చేసికొనిన వెంటనే శివాజీ రెండుపనులు ముఖ్యముగా ఆచరింపవలసి వచ్చినది. ఒకటి సంపాదించిన స్వరాజ్యమును కాపాడుకొనుట, రెండవది బందీయగు శహాజీని విడిపించుట. ఫతేఖాను ఏడువేల సైన్యముతో దండెత్తివచ్చు చుండగా, శివాజీ వద్ద కొన్ని వందల సైన్యము మాత్రమే యున్నది. శివాజీ అధీనములోని యేకోటగాని, లోనున్న స్వల్పసైన్యముతో ఫతేఖాను తాకిడికి తట్టుకొనజాలదు. అంతే గాక అధికసైన్యముతో వచ్చు శత్రువును తన రాజ్యపు ఎల్లలకు వెలుపలనున్న పటిష్ఠమైన 'పురందర్' దుర్గములో నుండి ఎదిరించవలెనని శివాజీ నిర్ణయించెను. కాని పురందర్ కోట బీజపూర్ సుల్తాను అధీనములో నున్నది. నాడు దానికి మహాదాజీ పంత్ అధిపతిగా నుండెను. అతనికి శహాజీకి సన్నిహిత మిత్రత్వముగలదు. దాని నాధారముగా జేసుకొని శివాజీ మహాదాజీపంత్ వద్దకుపోయి తన స్వరాజ్య నిర్మాణ యత్నమును వివరించి చెప్పి, దానికై సహకరించుమని కోరవలెను. సహకార మనగా, తన ముదుసలి తనమున మహాదాజీపంత్, సుల్తాను నెదిర్చి, ఆపదలకు సిద్ధపడి పురందర్ కోటను శివాజీకి స్వాధీనము చేయుట యని యర్థము. అంతటి పనిని ఒకబాలుని మాటను నమ్మి చేయవలెను.

శివాజీకి తాను చేయుపని సత్కార్యమనియు, దానిలో తన స్వార్థ ప్రయోజన మేమియు లేదనియు, అది విజయము నంది తీరుననియు ఆత్మ విశ్వాసము గలదు. అందువలన,

ఎవరినుండి అయినను, ఎంతటికష్టమైన సహకారమునైనను నిస్సంకోచముగా అడిగేధైర్యము, పనిని సాధించే చాకచక్యము అతనిలో ఏర్పడినవి. ఈ సాహస, విశ్వాసములతో శివాజీ అడుగగనే మహదాజీ పంత్ పురందరుకోటను శివాజీకి స్వాధీనము చేసెను. వెంటనే శివాజీ తన సైన్యమునునంతను ఆ కోటలో సంసిద్ధపరచెను.

శివాజీ పురందర్ కోట నాక్రమించెనను వార్త వినిన ఫతేఖాను మొకామొకిని పురందర్ చేరక, మధ్యలోనున్న 'బెలసరు' నందు మజిలీ వేసి, తొలుత బాలాజీహైబతురావను హిందూ సర్దారును 'శిరవల్' 'సుభానమంగళ' దుర్గములపైకి పంపి వానిని స్వాధీనము చేసుకొనెను. పురందర్‌లో నున్న శివాజీకి ఈ వార్త చేరినది. సుభానమంగళ దుర్గములో నున్న హైబతరావువద్ద కొద్ది సైన్యముమాత్ర మున్నది. ఫతేఖాను ముఖ్యసైన్యముతో 'బెలసరు' లో నున్నాడు. ఈ స్థితిలో శివాజీ రెండు దాడులను చేయనెంచెను. తాను పురందర దుర్గమునందేయుండి కావజీ యను తన స్నేహితునకు అవసరమగు సైన్యమునిచ్చి, 'శిరవళ' ను, 'సుభాన మంగళ' కోటను తిరిగి స్వాధీనము చేసుకొనుటకై పంపెను. కావజీ, హైబతరావును చంపి ఆ రెండు దుర్గములను మరల స్వాధీనము చేసుకొనిన పిమ్మట విజయశాలియగు తన సైన్యముతో పురందర కోటకు చేరుకొనెను. శివాజీ తన రెండవ పథకము ప్రకారము, ఫతేఖాన్ తనపైకి వచ్చులోపలనే, తానే ఖాను శిబిరముపై దాడి చేయవలయునని యెంచెను. అట్టిదాడిలో గెలుపు అసంభవమను విషయము శివాజీకి తెలియును. పెద్ద సైన్యంతో వచ్చు శత్రువుయొక్క శిబిరంపై

అకస్మాత్తు దాడిచేసి వానికి కొంత నష్టము కల్గించినయెడల తన సైన్యముయొక్క ధైర్యము ఇనుమడించుననియు, ఫతే ఖాను సైన్యములో స్థైర్యము భంగమై నిరుత్సాహము కలుగుననియు శివాజీ ఊహించెను. అనుకున్న ప్రకారము శివాజీ సైన్యము ఫతేఖాను సైనిక స్థావరముపై దాడిచేసి, తీరని నష్టము కలిగించి వెంటనే మరల పురందరు కోటకు చేరుకొనెను. ఆకస్మికముగా జరిగిన యీ దాడివలన, ఫతే ఖానుకు కోపమువచ్చినది. కాని ఆతనిసైన్యములో ధైర్యము సడలినది. శిరవళ, సుభానమంగళ దుర్గములు మరల శివాజీ ఆక్రమించిన వార్త ఫతేఖానుకు అప్పుడే తెలిసినది. నీరుకారి పోవుచున్న తన సైన్యమునకు ఉత్సాహము కలిగించుటకై తప్పనిసరిగా ఫతేఖాను, వారికి విశ్వాసజనకమగు నొక విజయ మును సాధించవలసి ఉన్నది. అందుచేత శివాజీకన్న తనవద్ద పదెనిమిదిరెట్లు సైన్యమున్నదిగాన, వెంటనే పురందరుకోటను ముట్టడించవలెనని ఆతడు నిర్ణయించెను.

ఫతేఖాను సైన్యము పురందరుకోటపై దాడి ప్రారం భించెను. కోటలో శివాజీ తన కొద్దిసైన్యముతో సంసిద్ధ నుయ్యెను. ఫతేఖాను సైనికులు కొండ ఎక్కుచుండగా, శివాజీ సైనికులు కోటపైనుండి పెద్దపెద్ద రాళ్ళను దొర్లిం చుచూ, వారిలో అనేకమందిని సంహరించిరి. సంఖ్య అధిక మగుటచేత, చచ్చెడివారు చావగా, మిగిలినవారు కొండ సగభాగమున కెక్కగల్గిరి. అప్పుడు మెఱపుదీగవలె, శివాజీ సైన్యము అకస్మాత్తుగా కోట తలుపులను తెఱచికొని వెలికి వచ్చి వారితో యుద్ధమునకు తలపడెను. ఫతేఖాను సైనికులకు

కొండలలో, గుట్టలలో యుద్ధము చేయు నలవాటు లేదు. శివాజీ సైనికులు అట్టి యుద్ధములో నారితేరినవారు మాత్రమే గాక, వారి హృదయములలో స్వరాజ్యస్థాపనకై ప్రాణముల నైన సమర్పించెడి సంసిద్ధత గూడ గలదు. ఆ కొండపై జరిగిన నాటి భీషణ సంగ్రామములో విజయము శివాజీకే లభించినది. ఫతేఖాను పక్షములోని మూసేఖాను అను ప్రముఖ వీరుడు సంహరింపబడెను. వెంటనే ఫతేఖాను సైనికులు భయముతో పలాయనము చిత్తగించిరి. వారిని శివాజీ సాసవడ్ వరకు తరిమికొట్టెను. అంతవరకు శివాజీ సైన్యములో నే యధికారియు చనిపోలేదు. కాని యుద్ధానంతరము సాసవడ్ లో నుండగా 'బాజీ పాసలకర్' అను వీరుడైన శివాజీ అనుచరు డొకడు హత్య గావింపబడెను. దురాక్రమణదారుల నోడించి మొదటి సంగ్రామములో స్వాతంత్ర్య లక్ష్మికి అతడు బలి పశువుగా నాయెను. ఈ వార్తను వినిన శివాజీ చాల దుఃఖించెను. దేశకార్యము స్వీకరించిన వానికి యిటువంటి కష్టము లెన్నియో సహించవలసి యుండును. ఫతేఖానుడు పూర్తిగా నోడించబడెను (8-8-1648). బెంగుళూరులోని శివాజీ యన్న శంభాజీ తనపై దండెత్తివచ్చిన ఫరాత్ ఖానును పూర్తిగా నోడించినట్లు శివాజీకి వార్త యందెను.

ఈ విజయములతో శివాజీ సైనికులలో తమ స్వరాజ్య నిర్మాణ కార్యముపట్ల అచంచలమగు విశ్వాసము జనించెను. కాని శివాజీ మనస్సు తదనంతర కర్తవ్యమును గుఱించి తీవ్రముగా యోచించసాగెను. ఫతేఖాను, ఫరాత్ ఖానుల పరాభవ వార్తను వినిన బీజపూరు సుల్తాను తనవద్ద బందీగానున్న శహాజీని వెంటనే సంహరించుడని యాజ్ఞ నీయవచ్చును.

అట్టిచో తమ విజయమే తమ తండ్రికి ప్రాణాంతకముగా పరిణమించును. ఏ ప్రమాదము జరుగకముందే తన తండ్రిని వదలించవలెనని శివాజీ యత్నము.

జింజికోటలో పట్టువడిన శహాజీని బీజపూరునకు తీసుకొనివచ్చు బాధ్యత బీజపూరు సర్దారులలో ప్రముఖుడగు అఫజుల్ ఖానున కప్పగింపబడినది. కర్నాటక యుద్ధములో బీజపూరువారికి లభించిన ధనరాసులను ఎనుబదియారు ఏనుగులపై మోయించుకొనుచు, శహాజీని వెంటనిడుకొని అఫజుల్ ఖాను బీజపూరునకు బయలుదేరినట్లు శివాజీకి దెలిసినది. జింజినుంచి బీజపూరు చేరుకొనుటకు చాల దినములు పట్టును. మార్గమధ్యమున అఫజుల్ ఖానుపై దాడిచేసి శహాజీని విడిపింపగల సైనికశక్తి శివాజీవద్ద లేదు. శక్తిచే సాధ్యముకాని పనిని యుక్తిచే సాధించుట సమర్థుడైన కార్యవాది లక్షణము కదా. శివాజీ వెంటనే యొక ఊహాచేసి ఢిల్లీ పాదుషా కొక జాబు వ్రాసెను. దానియందు తాను, తన తండ్రియగు శహాజీలు ఢిల్లీశ్వరుని కొలువు చేయ గోరుచుంటి మనియు, అది తెలిసి, బీజపూరువారు తన తండ్రిని బంధించిరనియూ, శహాజీని బందీనుండి విడిపించినచో, తామిద్దరూ, ఢిల్లీ సుల్తానుల ఆజ్ఞానువర్తులుగా చరింతుమనియు వ్రాయించెను. షాజహానుకు శివాజీ వ్రాసిన యీ ఉత్తరమును గుఱించి తెలిసినను, శివాజీ అనుచరు లెవ్వరును దానిని శంకించలేదు. వారు శివాజీ సమయస్ఫూర్తి కానందపడిరి. షాజహాను కూడ ఆ జాబున కాశ్చర్యపడలేదు. పొట్టకొరకై దేశాభిమానము వదలి పరుల పంచల నుద్యోగము చేయుచు, అధిక వేతనములకై ఆశపడి సుల్తానులను మార్చుచూ తిరిగెడి

హిందూ సర్దారుల ననేకులను షాజహాను చూచినాడు. అందుచే శివాజీ కూడ అట్టివారిలో నొకనిగా భావించిన షాజహాను, శివాజీ, శహాజీ వంటి సమర్థులు తన కొలువునం దున్నచో లాభసాటిగా నుండునని యెంచినాడు. సుల్తానులు యిట్టి మనస్తత్వములో నుందురని, వారికి హిందువులనగా అంగడిలోని బొమ్మలవంటివారను అభిప్రాయము కలదని గుర్తించినవాడు కనుకనే శివాజీ ఢిల్లీకి అట్టి లేఖ నంపెను. కాని ఆ లేఖ సుల్తానుల దక్షిణ సుబా కేంద్ర మగు అహ్మదా బాద్ చేరి అచటనుండి ఢిల్లీకిపోయి మరల బీజపూరు సుల్తాను నకు ఆజ్ఞారూపమున చేరుటకు కొన్ని నెలలకాలము పట్ట వచ్చును ఈలోపల శహాజీ గతి యేమగునో? అయిననూ వేరుమార్గములేని శివాజీ ఢిల్లీనుండి జాబునకై ఎదురు చూచుచుండెను.

కర్నాటకములో లూటీ చేసి సంపాదించిన ధనమును ఏనుగులపై వేసికొని, శహాజీని వెంటనిడుకొని అఫజుల్‌ఖాన్ బీజపూరు చేరుకొనెను (10-3-1649). తాను పట్టుబడిన నాటినుంచి, ఏనాటి కానాడు బీజపూరు సుల్తాను తనను చంపుట కాజ్ఞ పంపునేమోయని శహాజీ శంకించుచుండెను. వజీరును నమ్మి మోసపోయినందుకు శహాజీ మనమున నెం తయో దుఃఖించెను. కాని శహాజీ బీజపూరు చేరునాటికే, శివాజీ ఢిల్లీసుల్తానుకు వ్రాసిన జాబు, అందలి విశేషములు కూడ బీజపూరు సుల్తానుకు తెలిసినవి. అతని మనము పరి పరి విధముల పోయినది. అనుభవజ్ఞుడు, వీరుడునైన శహాజీని, యువకుడు, సమర్థుడునైన శివాజీని ఢిల్లీ సుల్తాను ఆ లేఖ చూచిన వెంటనే కొలువున చేర్చుకొనునని బీజపూరు సుల్తాను

భావించెను. కాబట్టి వెంటనే, శహాజీని వదలిపెట్టవలసినదిగా ఢిల్లీనుంచి తనకు జాబువచ్చునని కూడ అతడునమ్మెను. శక్తి వంతుడగు షాజహాను ఆజ్ఞను అనుసరింపక తనకు తప్పదని గూడ ఆతడు గుర్తించెను. అట్టి స్థితిలో ఢిల్లీనుండి జాబు వచ్చినందున భయపడి శహాజీని బీజపూరు సుల్తాను వదలిపెట్టి నాడను మాట రాకుండుటకై ఒక యుపాయము నెంచి, తనంత తానే శహాజీని విడిచి పుచ్చి, ఆతని పుత్రుని పనులను గుఱించి హెచ్చరించి సగౌరవముగా తన దర్బారునకు పిలి పించి, ఆతనివద్దనుండి బెంగుళూరు నగరము, కందర్పి, కొండణా కోటలను తన యధీనము చేయునట్లు వ్రాయించు కొని వదలెను. శహాజీని పిమ్మట తన సమీపముననే ఉంచు కొనెను ( జ్యేష్ఠపూర్ణిమ - వటపూర్ణిమ - 16-5-1649 ). ఈ విధముగా శివాజీ పన్నిన పథకము, ఎంతో చక్కని ఫలిత ములనిచ్చి, ప్రాణనష్ట మేమిలేకుండగనే శహాజీని విడిపించినది.

బీజపూరు సుల్తాను వటపున్నమినాడు శహాజీని వదలి పెట్టెనన్న వార్త శివాజీ రాజ్యములోనివారందరికిని ఎంతో ఆనందము కలిగించినది. పురాణ కాలమున యీ పున్నమి రోజుననే సావిత్రి యమునివద్దనుండి తన భర్తయగు సత్య వంతుని ప్రాణములను తిరిగి పొందగలిగినది. స్వరాజ్యనిర్మాణ యత్నమునకు కలిగిన ఇబ్బందులన్నియు తొలగిపోయినవి. పురందర దుర్గముపై ఫతేఖానుడు, బెంగుళూరులో ఫరాద్ ఖానులు ఓడింపబడిరి. బీజపూరులో శహాజీ కూడ బందీనుండి వెలికి వచ్చెను.

కాని కొన్ని రోజుల తరువాత శహాజీవద్దనుండి శివాజీకి ఒక జాబువచ్చెను. దానిని చూచిన శివాజీ మనసులోని సంతోషము చల్లారెను. కొండణా కోటను తిరిగి బీజపూరు సుల్తాను కివ్వవలసినదిగా శహాజీ ఆ జాబులో వ్రాసెను. కొండణావంటి చక్కని కోటను వదలిపెట్టుటకు ఆతని మనస్సు అంగీకరించలేదు. పితృ ఆజ్ఞను ధిక్కరించుటకు కూడ మన సొప్పుటలేదు. శివాజీకి పెద్ద సమస్య ఏర్పడెను. వయస్సు లోను, అనుభవములోనూ కూడా పెద్దవాడగు సోనోపంత్ డబీర్‌ను శివాజీ పిలిపించి, తన తండ్రి తన యాశయమును గాని, యోగ్యతా సామర్థ్యములనుగాని గుర్తించలేదనియూ ఆయన శత్రువును నమ్మి మోసపోయెననియూ, అందుచేతనే తనకు అట్టి జాబు వ్రాసెననియు, ఆతని కృత్యము బాధ్యతా రహితముగా నున్నందున పాటింపజాలననియు పలికెను. సోనో పంత్ శివాజీ మాటను మధ్యనే ఆపి, మందలించు ధోరణిలో ఆతని నుద్దేశించి, "నాయనా! ఒక కోటకు తండ్రి కన్న నీవు అధికమైన విలువ నిచ్చుటయా? కొండణా నిచ్చినచో నీ తండ్రి రక్షించబడును. కొండణాను సంరక్షించుకొనగల శక్తి మన వద్ద నున్నచో, బీజపూరు సుల్తానుకు యిచ్చిన వెంటనే మరల మన మాక్రమింపలేమా?', యని పలికెను. తాత తండ్రుల కాలమునుండి ఆ జాగీరులో పనిచేయుచున్న సోనోపంత్ మాటలను విని శివాజీ ఉద్రేకమును విడచి "మీ సలహా ననుసరించి కొండణా కోటను స్వాధీనము చేతును. కాని ఎవరు నా తండ్రిని బంధించిరో, వారిపట్ల మాత్రము ప్రతీకారము తీసుకొందును'' అని శివాజీ పలికెను.

# అఫజుల్‌ఖాను వధ

బీజపూరు సుల్తాను ఖైదునుండి శహాజీని వదలిపెట్టి తననద్దనే యుంచుకొనెను. శహాజీ బీజపూరులో యున్నంతవరకు స్వరాజ్య విస్తరణకు శివాజీకి వీలు కలుగ లేదు. అందువలన సంపాదించిన స్వరాజ్యమును సుస్థిరము చేయుట కాతడు ఆ సమయము నుపయోగించెను. కోంఢవే, శివాపుర, గ్రామములవద్ద నాతడు రెండు ఆనకట్టలు కట్టించెను. వ్యవసాయదారులకు కావలసిన అన్ని సౌకర్యములు కలుగజేసి పన్నులు వసూలుచేయు పద్ధతిని ప్రవేశపెట్టెను. గోరక్షణ, గోసంవర్ధనలకు, న్యాయపరిపాలనకు చక్కని వ్యవస్థ నేర్పరచెను.

ఇట్లుండ క్రీ. శ. 1654 ప్రారంభమున బీజపూరు సుల్తాను శహాజీని కర్నాటకమునకుపంపెను. పురందర దుర్గాధి పతి యగు మహాదాజీపంత్ గతించెను (23-5-1654) మహాదాజీపంత్ నకు నలుగురు కుమారులు. వారు ఆ దుర్గాధి పత్యము కొఱకు తగవులాడుచుండిరి. శివాజీ వారికి నచ్చ జెప్పుట కనేక ప్రయత్నములు చేసెను. వారాతని మాట వినకుండిరి. పదవికొఱకు పోట్లాట జరుగుట స్వరాజ్య ప్రయ త్నమున తగనిది అందుచే శివాజీ వారిని బంధించి నేతాజీ పాల్కర్ యను నొక సర్దారు నట యధికారిగా నియమించెను. కొంతకాలము తర్వాత నలుగురు యన్నదమ్ములకు వేర్వేరు పదవుల నిచ్చి సత్కరించెను. శహాజీ బీజపూరును వదలిపెట్ట

గనే శివాజీ మరల స్వరాజ్య విస్తరణకు ప్రయత్నము లారంభించెను.

కృష్ణానదికి జన్మస్థానమగు మహాబలేశ్వరము చుట్టు నున్న ప్రదేశమును టావళి యందురు. ఆ ప్రదేశమంతయు కొండలతో, నడవులతో నిండియుండును. 1657 లో దాని కధిపతియైన దౌలత్ రావు చనిపోయెను. అతనికి పుత్ర సంతానములేదు. ఆ ప్రదేశముపై ఉత్తరాధికారిని నిర్ణయించు నధికారము బీజపూరు సుల్తానులది. అందుచే నతని భార్య శివాజీ నాశ్రయించెను. ఆమె దత్త పుత్రుడగు యశ్వంతరావుకు శివాజీ ఆ పదవి నిచ్చెను. శివాజీ సహాయము వలన పదవి నలంకరించిన యశ్వంతరావ్ చంద్రరావు మోరె తన మీాద శివాజీ యధికార ముండుట కిష్టపడలేదు. అతడు తన చుట్టు ప్రక్కలనున్న ప్రదేశములను కూడ ఆక్రమించెను. శివాజీ రాజ్యములో యున్నవారిని కొందరిని చంపి, వారి ప్రాంతములు కూడ నాక్రమించెను. అందుపై శివాజీ అతని కొక ఉత్తరము వ్రాసెను. తన యిచ్ఛవచ్చినట్లు చేయుదు నని ఆతడు సమాధానము వ్రాసెను. స్వరాజ్యనిర్మాణ ప్రయత్నముల కాతడు సహాయపడవచ్చునను దృష్టితో శివాజీ యాతనికి సహాయము చేయగా నాతడు స్వరాజ్యమునే పరిహసించువాడయ్యెను. అందువలన శివాజీ అతనిని యుద్ధమున నోడించి బంధించి ఆ ప్రాంతమును తన స్వరాజ్యములో చేర్చెను (1656). బందీయైన యశ్వంతరావు రహస్యముగా బీజపూరు వారి సహాయమును కోరెను. అది తెలిసిన శివాజీ వానిని చంపివేసెను. చంద్రరావ్ మోరె నుండి శివాజీకి వచ్చిన యీా కొండప్రాంతము దట్టమైన అడవితో నిండి

యుండును. అందులో నుండిన "రాయరి" అను కోటపై కొన్ని సంవత్సరముల తర్వాత శివాజీకి రాజధానియైన "రాయగడ దుర్గ" మేర్పడెను. ఆ యడవి నందలి వేరొక ఎత్తైన శిఖరమున శివాజీ "ప్రతాప్ గడ్" అను పేరున కోట నొకదానిని కట్టించెను. ఆ యడవి ప్రదేశము, అందలి కొండలు, కోటలు, స్వరాజ్య ప్రయత్నములలో శివాజీకి చాల ఉపయోగ పడినవి. ఈ సమయముననే మోరే వద్ద కొలువున్న మురార్ బాజీ దేశపాండేయ యను నొక వీరుని శివాజీ తన పక్షమునకు త్రిప్పుకొని సంపూర్ణ దేశభక్తునిగా చేసెను.

హిందూ సామ్రాజ్య విస్తరణకు తన బంధువులు అడ్డువచ్చినను, వారినికూడ శివాజీ లక్ష్యపెట్టలేదు. శివాజీ సవతితల్లి అన్నగారైన మోహితె పూనాదగ్గర సుపే యను నొక చిన్న ప్రాంతమునకు దేశముఖుగా నుండెడివాడు. అతనిని బంధించి శహాజీవద్దకు పంపి ఆ ప్రదేశముకూడ స్వరాజ్యములో కలిపెను.

పిమ్మట నొకనాడు బీజపూరు సుల్తాను మహమ్మద్ ఆదిల్ శా చనిపోయెను (4-11-1656). అతని కుమారుడు చిన్నవాడైనందున ఆతని మొదటిభార్య—బడీసాహెబా—తానే రాజ్యమును పాలించుట మొదలుపెట్టెను. ఈ యవకాశమును చూచుకొని అప్పటి మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు బీజపూరు నాక్రమించబోయెను. శివాజీ కూడ యీ అదను నుపయోగించి సహ్యాద్రికి పడమర నున్న కొంకణ భూభాగమును జయించుటకు రఘునాథ్ బల్లాల్‌ను పంపెను. ఆతడు 'ధాభోడ్' మొదలగు కోటలు జయించెను.

బీజపూరుకు జెందిన యీ ప్రాంతము జయించిన తర్వాత దానిని స్వరాజ్యములో కలుపుటకు యనుజ్ఞను శివాజీ ఔరంగజేబునుండి తీసుకొనెను (23-4-1657). ఒకరిభూమి నాక్రమించి దానిపై యధికారమును వేరొకరి యనుజ్ఞతో పొందుట వింతయే. కాని దీనివలన శివాజీ రెండు ప్రయోజనముల నాశించినాడు. ఒకటి ఔరంగజేబు తనను వ్యతిరేకించకుండుట; రెండు శివాజి తన భూభాగము పైకి కూడ రావచ్చునను సందేహము ఔరంగజేబుకు కలుగకయుండుట. సరిగా నాసమయమునకే అప్పుడు ఢిల్లీ సుల్తానైన "షాజహాన్"కు సుస్తీ చేసెను. అతని కుమారుడైన ఔరంగజేబు తండ్రి సింహాసనము తనకు చెందవలెనను కోరికతో ఢిల్లీకి పోవు ప్రయత్నములో నుండెను. ఔరంగజేబు యితర కార్యములలో నిమగ్నుడై యుండుటవలన స్వయముగా తనను ఎదుర్కొన వీలుపడదని తలచిన శివాజీ "కొంకణ" ప్రదేశమును స్వరాజ్యములో చేర్చుటకు ఔరంగజేబునుండి అనుజ్ఞ సంపాదించిన యేడవనాడే "జున్నార్"ను లూటీ చేసెను. కొన్ని రోజుల తర్వాత "అహమ్మద్ నగర్" ను కూడ లూటీ చేసెను. శివాజీ యూహించినట్లే జరిగినది. ఆవార్త వినిన ఔరంగజేబుకు కోపమువచ్చెను. కాని స్వయముగా ఏమియు చేయుట కవకాశములేక శివాజిని కనిపెట్టి యుండుడని కొందరిని యాజ్ఞాపించెను. అపుడు శివాజీ ఒక వకీలును ఔరంగజేబువద్దకు పంపి, తానుచేసిన లూటీల విషయమున క్షమాపణ కోరెను. కాని లూటీచేసిన ధనమును మాత్రము తిరిగి యివ్వలేదు. శివాజీని క్షమించుట ఔరంగజేబున కిష్టములేదు. అంతకన్న వేరు చేయగలిగినదియు లేదు.

కావున ఔరంగజేబు శివాజీని క్షమించినట్లూరకుండెను. దీని తర్వాత కొంతకాలము శివాజీ మొగలుల ప్రదేశముల లోనికి పోక బీజపూరు ప్రాంతమునుండి "కోండ్వానా" కోటను, "కొంకణ" లో ఉన్న దండరాజపురి, భీవండీ, కల్యాణ్, మాహూ మొదలగు కోటలను జయించెను. పోర్చుగీసు వారి నుండి "చోళ" ప్రాంతాన్నికూడ జయించెను (1658). పశ్చిమ సముద్రములో విజయదుర్గ యను నొక కోటను కట్టించి అందు నౌకాదళమును ప్రారంభించెను.

ఒకదాని తరువాత నొకటిగా, శివాజీ ఆక్రమణ వార్తలు బీజపూరుకు వచ్చుచుండెను. క్రీ. శ. 1658 లో బడీ సాహెబా "మీ కుమారుడు చేయుచున్న యల్లరుల నాపకున్నచో పరిణామములు తీవ్రముగా నుండగల" వని శహాజీకి యుత్తరము వ్రాసెను. శివాజీ స్వరాజ్య ప్రయత్నములు ప్రారంభమయి నాటికి పదునాలుగు సంవత్సరము లయ్యెను. స్వరాజ్యమునకు శక్తి సమకూరినది. ఇంక భయము లేదని శహాజీ యెంచెను. కాన "నా కుమారుడు నా మాటలు వినుటలేదు, కావున ఆ విషయమును మీరే పరిష్కరించు కొను" డని బీజపూరునకు జాబు వ్రాసెను. శహాజీకి వ్రాయుట వలన ప్రయోజనము లేదని తెలుసుకొనిన బడీ సాహెబా శివాజీ ఆక్రమణల నరికట్టుటకు వేగ ప్రయత్నములు చేయ దలచెను. ఒక రోజున ఆమె పూర్తి దర్బారు నాహ్వానించెను, అందు ప్రముఖులైన సరదారు లందరును వచ్చియుండిరి. బీజపూరు రాజ్యమునుండి యెంత ప్రదేశము యే విధముగ శివాజీ స్వాధీనపరచుకొనెనో ఆమె వారికి వివరించెను. సభ యంతయు నిశ్శబ్దమయ్యెను. "శివాజీని బంధించి తీసుకొని

రాగలవారుగాని, సంహరించగలవారుగాని మీలో యెవ్వరైన నున్నారా'' అని సవాలు చేసెను. అది విని సభాసదులందరు ఒకరి మొగము లొకరు చూచుకొనుచుండిరి. ఎవరును పలుక లేదు. ఆ నిశ్శబ్దమును ఛేదించుచు అఫజుల్ ఖాన్ లేచి ఖుద్నిసాత్ చేసి శివాజీని నేను బంధించి తీసుకొని రాగల' ననెను. అఫజుల్ ఖాను మాటలు విని బడీ సాహెబాకు చాల సంతోషము కలిగెను. వెంటనే అతని ధైర్యము నభినందించుచు ఆతని వెంట 12000 గుఱ్ఱపు దళము, 10000 పదాతి దళము, 1200 ఒంటెల దండు, 65 ఏనుగులు, అనేక ఫిరంగులు వెడలునట్లు ఆజ్ఞాపించెను. ఎట్లయిన శివాజీని సంహరింపు మని రహస్యముగా ఖానుకు వార్తను కూడ పంపెను

సైన్య సమేతుడై అఫజుల్ ఖాను నాలుగు మైళ్ళ దూరము వెళ్ళుటకే చీకటిపడెను. ఖాను అచట తొలి మజిలీ వేసెను. అక్కడ వారి వెంట పతాకమును ధరించి వచ్చుచున్న "ఫతే లస్కర్" అనే ఏనుగు చనిపోయెను. ఈ అపశకునము వలన ఎవ్వరి యుత్సాహముగాని భంగము కాకుండుటకై సుల్తాను కొఱకు ప్రత్యేకించియున్న యేనుగును బడీ సాహెబా అక్కడికి పంపెను.

అఫజుల్ ఖాను చాలా శక్తివంతుడు. క్రూర స్వభావుడు, విశ్వాసఘాతకుడేగాక విగ్రహ విధ్వంసకుడు కూడా. తాను స్వీకరించిన బాధ్యతను తుదివరకు నెరవేర్చెడివాడు. ఆతని తల్లి సుల్తాను కొలువున వంటమనిషి. ఖాన్ తన కర్తృత్వము వలన, సామర్థ్యమువలన యింత పెద్ద పదవి నలంకరించెను. కర్నాటకమునుండి శహాజీని బందీచేసి తీసు

కొని వచ్చిన వాడితడే. కర్నాటకములో ఉన్న కనకగిరి యను కోటను జయించుటకు బీజపూరు సుల్తాను యితనిని నియమించి యితనితో బాటు శహాజీ పెద్ద కుమారుడైన శంభాజీని పంపెను. ఆ యుద్ధములో నొకసారి శంభాజీకి సహాయ మవసరమయ్యెను. సహాయము పంపుమని అతడు ఖానును కోరెను. సహాయము చేయుట కవకాశమున్నప్పటికి ఖాను నిరాకరించెను. అందువలన ఆ యుద్ధమున శంభాజీ చంపబడెను. బీదరు, కళ్యాణిల దగ్గఱ జరిగిన యుద్ధమున అఫజుల్ ఖాను, ఖాన్ మహమ్మదుతో కలసి ఔరంగజేబును యెదిరించుచుండగా ఔరంగజేబు అఫజుల్ ఖానుని చేతిలో చిక్కెడు సమయ మేర్పడెను. కాని ఖాన్ మహమ్మద్ లంచము తీసుకొని ఔరంగజేబును తప్పించెను. ఈ మోస మెఱింగిన అఫజుల్ ఖాను బీజపూరు సుల్తానుకు జరిగినదంతయు తెలిపెను. అప్పుడు సుల్తాను ఖాన్ మహమ్మద్‌ను చంపించెను. నాటినుండి సుల్తాను కొలువున అఫజుల్ ఖానుని నిజాయితీపై యెంతో నమ్మక మేర్పడినది. "కాఫిర్‌లను చంపువాడు, విగ్రహ విధ్వంసకుడు" అని అఫజుల్ ఖానుడే స్వయముగ తన గుఱించి శిలపై చెక్కించె నందురు. అట్టి అఫజుల్ ఖాను పెద్ద సైన్యము తీసుకొని శివాజీ పైకి బయలు దేరెను.

మొట్టమొదట అతడు తులజాపూరు చేరెను. అక్కడ నున్న తులజా భవానీ మందిరములోని దేవీమూర్తిని పగుల గొట్టెను. మహారాష్ట్రమున చాలమంది హిందువులకు ఆ దేవి కులదైవము. అఫజుల్ ఖాను సేనలోకూడ ఆ దేవతను పూజించువారు చాలమంది హిందువులున్నారు. పొట్టకొఱకు

ఉద్యోగమున చేరినవారు కాబట్టి గాబోలు వారది చూచి మిన్నకుండిరి. అక్కడినుండి ఖాను పండరిపురము వెళ్లెను. అక్కడ ప్రసిద్ధమైన పాండురంగ మందిరము కలదు. అందున్న విఠలమూర్తిని పగులకొట్టుటకు ఖాను వెళ్ళగా. 'మా దేవుడు తనను రక్షించుకొనుటకు పారిపోయి చంద్రభాగ నదిలో దూకి అదృశ్యమయ్యె'నని యచటి వారతనితో చెప్పిరట. పిరికి వారి దేవుడుకూడా పిరికివాడేకదా! ఖాను ఆ మందిమును నేల మట్టము గావించెను. ఈ విధముగా చాల దేవాలయములను ధ్వంసము చేయుచూ, ఖాను శివాజీయున్న కొండప్రదేశము వైపు వెడలుచుండెను. పగిలే ప్రతివిగ్రహము తనను నాటింత పవిత్రునిగా చేయునని ఆతని భావన. హిందూ స్వరాజ్యాన్ని నిర్మించు శివాజీ, హిందూ దేవతలను సంరక్షించుటకుగాను ఆ దేవాలయములను నాశనముచేయు తనపై యుద్ధము చేయుటకు రావచ్చును. అట్టిచో సమతల ప్రదేశములోనున్న తాను శివాజీని సులభముగా నోడించవచ్చునని ఖాను భావించెను. కాని శివాజీ మైదానములో ఖానుతో యుద్ధము చేయుటకు సిద్ధముగా లేడు. శివాజీ దగ్గఱ సైన్యము, ఆయుధములు చాల స్వల్పముగా నున్నవి. ఉన్న సాధనసంపత్తితో ఖాను నోడించవలెనన్న యుద్ధము కొండప్రదేశములలో, శివాజీకి అనుకూల స్థలములో జరుగవలెను. అందుకనియే తానున్న జావళీ ప్రదేశమును వీడి శివాజీ బయటకు రాలేదు. శివాజీ బయటకు రాకుండుటను అందరన్నివిధముల తలంచిరి. శివాజీ భయపడెనని కొందరు, దైవము, ధర్మముల రక్షణ నినాదము స్వార్థమునకేనని కొందరు యెంచిరి. ప్రజలలోని

భావము పెరుగుచున్నప్పటికిని శివాజీ మిన్నకుండెను. పర్వత ప్రదేశమును వీడి వెలికిమాత్రము రాలేదు.

తానేమిచేసినను శివాజీ మైదానములోనికి రాకుండు టను చూచిన ఖాను యింకొక యుక్తి పన్నెను. ఆతడు వెంటనే మళవడి యను గ్రామమునకు వెళ్ళెను. అక్కడ శివాజీ బావమఱది యగు బజాజీ నింబాళకర్ నివసించు చుండెను. అతడు బీజపూరు వారికి సర్దారే. బీజపూరుకు వ్యతిరేకముగా అతను యేమియు చేయలేదు. కాని శివాజీని మైదానములోనికి రప్పించుటకై ఖానుడు అతనిని బంధించి మహమ్మదీయ మతములో బలవంతముగా చేర్చెను. అప్పటికికూడ శివాజీ మైదానములోనికి రాని పక్షమున బజాజీని చంపవలె నని కూడ ఖాను డనుకొనెను. శివాజీ కీ విషయము తెలిసెను. అతను మైదానమునకు రాలేదు. కాని ఖాన్ సైన్యములో పనిచేయుచూ మంచి పలుకుబడియున్న సర్దార్ నాయక్ జీ పాండె యను నొక హిందూ సర్దారున కీ విషయమై జాబును వ్రాసి, బజాజీని చంపకుండ నాపు చేయమని కోరెను. సర్దార్ నాయక్ జీ పాండే ప్రయత్నఫలితముగా బజాజీ విడిపించబడెను. శివాజీని మైదానములో రప్పించుటకు ఖాను పన్నిన యీ యుక్తికూడ విఫల మయ్యెను. అంతవరకు హిందువులపై ఖాను చేయు నత్యాచారముల నెదిరించకున్నందున, ప్రజలలో శివాజీ వలన నెట్టి రక్షణ జరుగదను భావన యధికమైనది; కొందరు సహచరులలో కొంత పిరికితనము ప్రవేశించెను. వారు ఖానుతో సంధిచేసుకొమ్మని శివాజీతో పలికిరి. శివాజీ వారి కెంత నచ్చచెప్పినను వారి మనమున ధైర్యము కలుగుటలేదు. పైగా ఆ ప్రదేశమునకు చుట్టు

ప్రక్కల నున్నవారు శివాజీకి సహాయము చేయకుండ తన పక్షమున నుండుటకై ఖాను అనేకవిధము లగు ప్రయత్నములు చేయుచుండెను. సుల్తానుద్వారా పూనా చుట్టుపట్లనున్న చాలమంది దేశముఖ్‌లకు అట్టి ఉత్తరములు వ్రాయించెను. ఉత్తరములు అందిన వెంటనే భయపడిన "ఖండోజీ ఖోపడే" "సుల్తాన్‌జీ జగదాళె" అను దేశముఖులు ఖాను పక్షమున చేరిరి. కాని కన్హోజీ జేథే అను దేశముఖుడు ఖాను దగ్గరకు వెళ్ళకుండ శివాజీని చేరి ఆ యుత్తరమును శివాజీకి చూపించెను. కన్హోజీ పెద్ద దేశముఖ్. ఆ ప్రదేశములో నాతనికి మంచి పలుకుబడి యున్నది. అతడు దేశముఖు లందరి నొకచోట చేర్చి తాను సుల్తానుకు వ్యతిరేకముగా శివాజీ పక్షమున పోరాడుదునని తన నిర్ణయమును తెల్పెను. కన్హోజీ యొక్క నిర్ణయమును విని అక్కడకు చేరిన వారందరు ప్రభావితులైరి. అతని వలెనే అందరును స్వరాజ్య రక్షణ చేయుటకు సిద్ధమయిరి. ఈ వార్త విని మిగిలిన దేశముఖు లందరును శివాజీ పక్షమున నిలుచుట కంగీకరించిరి.

శివాజీ యున్న పర్వత ప్రదేశమునకు సరిహద్దుపై నున్న 'వాయి' యను గ్రామమునకు అఫజుల్‌ఖాను సైన్యముతో సహా చేరికొనెను. అప్పటికి శివాజీ శివాపూరులో నుండెను. తల్లియగు జిజియాబాయిని, కుమారుడగు శంభాజీని రాజగడ్ కోటపై నుంచి తాను ప్రతాప్‌గడ్ (వాయి నుండి 28 మైళ్ళ దూరం) వెళ్ళవలెనని శివాజీ తలంచెను. "ఈ యుద్ధములో జయము లభించిన యానందమే అట్లుగాక నేను మరణించినచో జిజియాబాయి పర్యవేక్షణలో శంభాజీని రాజుగా జేసి స్వరాజ్య ప్రయత్నములు కొనసాగించవలె"

నని తను యనుచరులకు చెప్పి, అక్కడనుండి శివాజీ రాజ ఘడ్ వెళ్ళి అటనుండి ప్రతాప్ గడ్ చేరెను (11-7-1659).

బీజపూరు సుల్తాను పంపిన ఆజ్ఞల నంది చిన్న, పెద్ద సరదారులు చాలమంది ససైన్యముగా 'వాయి' వచ్చి ఖానుతో కలసిరి. ఖాను సైన్యము మరింత పెరిగినది. శివాజీ తన గూఢచారులద్వారా ఆ వివరాలు యెప్పటి కప్పుడు గ్రహించుచునే యుండెను. శివాజీ వైపు కూడా కొందరు దేశభక్తులు వచ్చి చేరిరి. దేశముఖు లందరు వచ్చి కలసిరి. అందరి మనస్సులలోను ఖాను నాశనము కావలయు ననియే యుండెను. ఈ సమయములో నొక దుర్ఘటన జరిగినది. రాజగడ్ లో శివాజీభార్య సయీబాయిగతించెను(5-9-1659). కాని శివాజీ కడచూపులకైన నప్పుడు వెళ్ళలేకపోయెను. స్వరాజ్యముపై నెంతో భీకరమగు నాపత్తు వచ్చియుండగా, స్వీయ కుటుంబ విషయములు చూచుకొనుటకు శివాజీకి సమయ మెక్కడిది ?

వాయి వద్ద మజిలీ చేసిన అఫజుల్ ఖాను శివాజీ స్వాధీనములోనున్న ప్రదేశమును జయించుటకై కొందరినిపంపెను. కాని అతనికి ముఖ్యముగా కావలసింది శివాజీయే. కాని యేమిచేసినను పర్వత ప్రదేశాల నుండి శివాజీ వెలికి వచ్చుట లేదు. ఖానుకు ఆ ప్రదేశములోనికి వెళ్ళుట కిష్టములేదు. ఎట్లయినను శివాజీని వాయికి పిలిపించి బంధించవలె నని తలచిన ఖాను కృష్ణాజీ భాస్కర్ కులకర్ణి వాయికర్ అను ఒక వకీలును ఒక బెదిరింపు టుత్తరముతో శివాజీ దగ్గరకు రాయబారిగా పంపెను. కృష్ణాజీ భాస్కర్ శివాజీవద్దకు వెళ్లి ఖాను

చెప్పిన మాటలు చెప్పి ఆ వుత్తరము నిచ్చెను. అది శాంతముగా విని శివాజీ ఆ ఉత్తరము చూచెను. కాని వాయి వెళ్లుట కాతడు సిద్ధము కాలేదు. ఎట్లయినను ఖానును జావళీ భూమిలోని దట్టమైన అడవులలోనికి రప్పించవలెనని యాతడు తలంచెను. వెంటనే ఖానుయొక్క వకీలుతో నాతడేమియు చెప్పలేదు. పంతాజీ గోపీనాథ్ బోకిల్ అను నొక యనుభవశాలిని పిలిపించి అతని కన్నివిషయములు బోధించి తన రాయబారిగా కృష్ణాజీ భాస్కరుని వెంట ఖాన్ వద్దకు బంపెను.

వాయి వెళ్లినతరువాత రాయబారి పంతాజీ, అఫజుల్ ఖాన్ నేకాంతమున గలసి "మీ శౌర్య సాహసములు శివాజీకి బాగుగా తెలియును. మీవలననే బీజపూరు సేనకు కీర్తి ప్రతిష్ఠలు కలిగినవి. మీరన్న ఆయనకు చాల భయము. ఒక్కసారి జావళీకివచ్చి వారిని మీరు కలిసినచో ఆయన కా భయము పోగలదు. ఒక్కసారి మీతో కలిసిన తర్వాత కోటల నన్నిటినీ మీ స్వాధీనముచేసి, మీరు చెప్పినట్లే నడచుకొనుట కాయన సిద్ధముగా నున్నాడు. మీ సైన్యముగూడ జావళీలోనున్న ప్రకృతి సౌందర్యము తిలకించి ఆనందించగలదు. ఈ మా ప్రార్థన మన్నింపవలయు"నని చెప్పెను.

అది వినిన ఖానునకు లోలోపల భయ మనిపించినది. కాని వంటరిగా కాక ససైన్యముగా వెళ్ళవచ్చును. కాబట్టి ప్రమాద ముండదని భావించినాడు పైకిమాత్రము గాంభీర్యము నటించుచు శివాజీ రాయబారితో "మీ కాఫిర్ రాజు దొంగ. అతని మాటలు మాకు నమ్మకము కాదు. కాని నీవు బ్రాహ్మణుడవు. కావున నీ మాటలు నమ్మవచ్చును. శివాజీ

చెప్పినదంతయు నిజమేనని నీవు ప్రమాణము చేసినచో నేను జావలీ వత్తు'' ననెను. వెంటనే పంతాజీ ప్రమాణముచేసెను. పిమ్మట జావలీకి వచ్చుటకు ఖాను డొప్పుకొనెను. తరువాత రెండుమూడు రోజుల వరకు పంతాజీ, ఖాను శిబిరములోనే యుండి ఖాను వెంటవచ్చిన సరదారులను గౌరవించుటకను నెపమున ఖాను వెంటవచ్చిన సైన్యము వివరముల నన్నిటిని తెలిసికొనెను. శివాజీతో కలిసికొన్నప్పుడు అతనిని యెట్లయిన బంధించవలెనని ఖాను నిర్ణయించుకున్నట్లు కూడ గ్రహించి నాడు. ఇది తెలిసిన రెండవరోజుననే ఖానువద్ద వీడ్కోలు తీసుకొని పంతాజీ బయలుదేరెను.

పంతాజీ వెళ్లిపోయిన తరువాత ఖానుయొక్క సర దారులు కొందరు జావళిలోని దట్టమైన అడవిలోనికి వెళ్లుట ప్రమాదమేమోనని సందేహించుట కారంభించిరి. అది తెలిసిన ఖాను తన శక్తిపై వారి కేమాత్రపు విశ్వాస మున్నను అట్లు సందేహించరని పలుకగనే మరెవ్వరుగాని నోరెత్తలేదు.

ఖాన్ జావళీకి వచ్చుచున్నాడని పంతాజీ చెప్పగనే శివాజీకి సగము విజయము చేతికి లభించిన ట్లనిపించినది. పంతాజీ ఏకాంతమున శివాజీని కలిసి ఖాన్ మనసున దుష్ట యోచనలున్నవని కూడ చెప్పెను. శివాజీ మొదటినుండియు అట్టిదానిని శంకించుచునే యుండెను. కర్నాటకములోని షిరే పట్టణమును కస్తూరిజంగ్ అనువాడు పాలించుచుండగా అతనిని నమ్మించి, మాటయిచ్చి, కోటబయట నొప్పందము చేయుట కని పిలచి, యీ ఖానుడే చంపించెను. ఈ విషయము పంతాజీ మహారాజునకు చెప్పి ''ఖానుడు జావళీలోనికి రాగానే అతనిని,

అతని సైన్యమును కూడ చంపివేసి లూటీ చేయుద” మని సలహా నిచ్చెను. శివాజీ తొలినుండి యట్లే యూహించి యుండెను. ఆ మరుసటి రోజున ప్రముఖుల నందరను సమా వేశపరచి అఫజుల్‌ఖాన్ జావళీకి వచ్చిన తర్వాత ఎవ్వ రేమి చేయవలెనో శివాజీ వివరించి చెప్పెను. జావళినుండి ఖాను వెనుకకు తిరిగిపోకుండా, ఆ మార్గంలో అతని సైన్యమును అడ్డగించుట నేతాజీ పాల్కర్ వంతు. అతనికి రఘునాథ్ భల్లాల్ సహాయకుడు. ఇట్లే ఇతరులకు కూడ వేరువేరు పనులు కేటాయించబడెను. స్వరాజ్యములోని అన్ని ప్రాంతముల నుండి సైన్యములు పిలువబడెను.

మరల నొకసారి పంతాజీ అఫజుల్‌ఖానువద్దకు పోయి “మీ పేరువిని భయపడుచున్న శివాజీ యిట్లు మీరు జావళికి వచ్చుచుండుటచే ఆనందించుచున్నారు. శహాజీపైనున్న యభిమానము వారిపై జూపి వారిని మీరు క్షమించవలె”నని చెప్పెను. ఆ వార్తను విని ఖాను నవ్వుచు “శివాజీ యంతగా భయపడ నవసరము లేదు. ప్రస్తుతము అతని వశమున నున్న కోటల నాతని యధీనముననే యుంతును. పైగా మరికొంత సంపదకూడ నిత్తును. మా మిత్రుడగు శహాజీ పేర శపథంచేసి ఆతనికేట్టి భయము లేదని చెప్పగల”నని పంతాజీతో చెప్పెను. ఖాను మనస్సున శివాజీ నిజముగా చాల భయపడు చున్నాడను నభిప్రాయము గట్టిగా నేర్పడినది.

పంతాజీ తిరిగి ప్రతాపగడ్ వచ్చెను. జావళీలో ఖానుకు స్వాగత మిచ్చుట కేర్పాట్లు ప్రారంభమైనవి. ఖాను ససైన్యంగా బసచేయుటకు స్థలము నిర్ణయమైనది అతనితో

నే స్థలములో కలియవలెనో యదికూడ నిర్ణయముచేసి అక్కడ నొక 'షామియానా' నమర్చదలచిరి. తదనంతర కార్యక్రమము పూర్తిగా నిర్ణయింపబడినది.

పంతాజీ వెడలిన మరుసటిరోజున ఖాను ససైన్యముగా ప్రతాపగడ్‌కు బయలుదేరెను. వాయి నుండి నాలుగైదు మైళ్ళ దూరములో కొండలు, అడవి ప్రారంభమయినవి. అక్కడనుండి మరి పదునేను పదునెనిమిది మైళ్లు వెళ్ళవలసి యుండెను. ఏనుగులు, ఒంటెలు, ఫిరంగులు మొదలగునవి తీసుకొని కొండలపై, యడవులలో వెళ్ళుట చాలయిబ్బంది. ఆ సైన్యములోని కొంద రప్పటివరకును తమ జీవితమున నట్టి కొండలు చూడనైన లేదు. ఆ సైన్యమువెంట వ్యాపారస్తులు కూడ పలువు రున్నారు. అధికప్రయాసల కోర్చి చివరకు వారందరును ప్రతాపగడ్‌కు నాలుగైదు మైళ్ళ దూరమునకు చేరి, అచట నొక స్థలము నెన్నుకొని అడవి నరకించి డేరాలు వేయించిరి. వారు అచటకు చేరిన తరువాత, శివాజీ ఖానుల సమాగమమును గురించిన వివరము లన్నియు ఆయనతో నిర్ణయించుటకై పంతాజీ ఖానుతో మరల నొకసారి కలసెను. ఖానుని రాక, తన కర్తవ్యము యిత్యాదివానిని గురించి శివాజీ తన కొలువులోని పెద్దలతో ముందుగనే యోచించి నిర్ణయించెను. ఆ వివరములు ఖానుకు తెలిపి ఆతని యొప్పుదల స్వీకరించుట పంతాజీ పని. దీనికి వెనుక పంతాజీకి యింకొక పనికూడ ఉండెను. ఖాన్ వెంట చాలమంది వజ్ర వైఢూర్య వ్యాపారులు వచ్చియుండిరి. ఖాన్‌తో వచ్చిన పెద్దపెద్ద సరదారుల హోదాల ననుసరించి వారిని గౌరవించుటకుగాను వజ్రములు, ముత్యములు కొనుగోలు చేయుటకు

గాను ఆ వ్యాపారస్తులందరిని ప్రతాపగడ్‌కు తమ తమ వస్తువులతో పంపుమని ఖానుతో చెప్పవలసి యుండెను. ద్వారము చేరిన సిరిని నేర్పుగా తన కోశాగారమునకు చేర్చనిచో స్వారాజ్యోద్యమ మెట్లు ముందుకు సాగును?

పంతాజీ ఖానుని రాయబారిని కలిసి సమాగమమున కేర్పాట్లను గురించి వివరించెను. ఆ వివరములను ఆ రాయబారి ఖానుతో చెప్పెను. తర్వాత ఖాన్‌తో నేకాంతమున పంతాజీ కలసి శివాజీ భయమునుగురించి వర్ణించి "కోటబయట కొండల మధ్య నేర్పరచబడిన షామియానాలో ఒంటరిగా శివాజీతో కలుసుకొనుట యవసరము. లేకున్న శివాజీ భయపడు" నని చెప్పెను. అదివినిన ఖానునకు పిడుగు పడ్డట్లయినది. కాని మరు క్షణమున తనను తాను సంబాళించుకొనెను. పంతాజీ ఖానుని యవస్థగమనించి "మీ సైన్యమంతయు శిబిరములోనే ఉండును. షామియానా వరకు మీరు ఒక్కరే పల్లకిలో వచ్చెదరు. మీతో నిద్దరు సేవకు లుండవచ్చును. వారిద్దరిని షామియానా బయట ఉంచవలెను. అవసరమనిపించినచో పదిమంది శూరులను బాణము వేటు దూరమున నుంచవచ్చును. షామియానా లోనికి మీ వెంట మీ రాయబారి మాత్రమే రావచ్చును. మీరు వచ్చిన తరువాత శివాజీ కూడ మీవలెనే ఒంటరిగా లోనికి వచ్చెదరు. అక్కడ మీ రిద్దరూ కలసి మాట్లాడ వలయును" అని చెప్పెను. శివాజీగూడ ఒంటరిగా వచ్చునని గుర్తించిన తరువాత ధైర్యము తెచ్చుకొని ఖానుడు వాని నన్నిటిని యంగీకరించెను. తొలుత నీ విషయము నొప్పుకొనిన తరువాత ఖానుతో వచ్చిన సర్దారులను గౌరవించుటకు వజ్రములు, ముత్యములు శివాజీ కొనుగోలు చేయనెంచెను గాన

వ్యాపారస్తులను ప్రతాప్‌గడ్ పంపించమని పంతాజీ ఖానుతో చెప్పెను. అది విని ఖాను సంతోషముగా నొప్పుకొనెను.

మరుసటి రోజున ఆ వ్యాపారస్తులను వెంటనిడికొని పంతాజీ ప్రతాపగడ్ చేరి వారిని మహారాజు సమక్షమున ప్రవేశపెట్టెను. వారివద్దనున్న విలువైన రత్నభాండారమును చూచి మహారాజు చాల సంతోషపడి ఆ మొత్తమునంతను తానే ఖరీదు చేతునని చెప్పి భాండారమును తనవద్దనే యుంచుకొనెను. ఖానుతో కలసిన తరువాత రత్నరాసులక్రింద నీయవలసిన ధన మీయగలనని చెప్పి, వారికి ప్రత్యేకములైన విడుదుల నేర్పాటుచేసి విశ్రాంతి గైకొనుడని పంపెను. వ్యాపారస్తులందరు తమ భాండారమంతయు నొకేసారి అమ్ముడుపోయినందుకు చాల సంతోషించి తమకొరకేర్పాటు చేయబడిన నివాస స్థలములకు పోయిరి. ఖాను వెంట వచ్చిన విలువగల భాండారమంతయు సునాయాసముగా శివాజీకి స్వాధీనమైనది.

శివాజీ, ఖానుల కలయికకు, కొండలమధ్య నేర్పాటైన స్థానము, ఖాను శిబిరమురమునకు కన్పించదు. వారిద్దరు కలసిన సమయమున నేమిజరిగినను ఖాను సైన్యము వెంటనే యచటకు చేరుట సులభము కాదు ఇట్టి సదుపాయముల నెంచియే శివాజీ స్థలనిర్ణయము చేసెను

కలయిక జరుగునాటికి ముందురోజున శివాజీ తనవారందరిని పిలిచి వారి వారి కర్తవ్యమును బోధించెను ఖాను శిబిరంచుట్టు అతిరహస్యముగా తన సైనికులు దాగొనవలెను. కలయికలో నేదైన విశ్వాసఘాతుకము జరిగినచో కోటపై

నుండి ఫిరంగి కాల్చబడును. ఫిరంగి శబ్దము వినినవెంటనే ఒకేసారి నాల్గువెపులనుండి తన సైన్యము ఖాను శిబిరమును ఆక్రమించి అతని సైన్యమును పూర్తిగా నాశనము చేయవలెను. ప్రతి ఒక్కరికి వారి స్థానము, కర్తవ్యము వివరంగా చెప్పబడెను. ఆ రాత్రికే వారందరు వారివారి సైన్యంతో నిర్ణీత ప్రదేశములకు బయలుదేరిరి. వారిలో నే యొక్కడు పొరపాటు చేసిననూ పథక మంతయు భగ్నమగును. వారివారి స్థలములకు చేరిన తరువాత ఫిరంగి శబ్దము వచ్చువరకు కొన్ని గంటలవరకు బొమ్మలవలె చైతన్యరహితులై యుండుట యంత సులభముగాదు. కాని వారందరును కర్తవ్యనిష్ఠ కలవాటుపడినవారే. వారందరు తమ స్థలముల చేరుటకు పోయిన తరువాత మరునటి రోజున శివాజీ యెట్లు పోవలెనో అతనివెంట నెవరు పోవలెనో, ఏమి చేయవలెనో, నిర్ణయింప బడినది. ప్రతాపగడ్ పై నిట్టి నిర్ణయములు జరుగుచుండగా ఐదు మైళ్ళ దూరమున నున్న ఖాన్ శిబిరములో నందరు త్రాగిన మైకమున సంతోషంగా హాయిగా ప్రవర్తించు చుండిరి. వారికి శివాజీ చాల పిరికివాడు అను యూహ కలిగినది. ఇంక శివాజీని బంధించి బీజపూరునకు తీసుకొనిపోవుటయే తరువాయి యని వా రూహించి యుండిరి.

తెల్లవారినది చరిత్ర పుటలలో సువర్ణాక్షరములతో లిఖింపదగిన ఆరోజు ప్రారంభమయినది. ఉదయముననే శివాజీ స్నానముచేసి భవానీమాతను పూజించెను. పూర్వ నిర్ణయమునకు విరుద్ధముగా ఖాను డేమైన యితర యేర్పాట్లను చేయుచుండెనేమో గ్రహించుటకు పంతాజీ ఉదయముననే ఖాను శిబిరమునకు పోయెను. పంతాజీ ఖాను శిబిరమును

చేరుసరికి పదిహేనువందలమంది సాయుధులగు సైనికులు ఖాన్‌తో బయలుదేరుటకు సిద్ధమగుచుండిరి. సర్వసన్నద్ధుడై ఖానుడు పన్నెండు గంటలకు తన డేరానుండి వెలికివచ్చెను. వెంటనే పంతాజీ ఖాన్ దగ్గరకుపోయి "యీ సైనికులందరు మనతో వత్తురా?" యని ప్రశ్నించెను. ఖాను అవు ననెను. 'అట్లయిన శివాజీ మహారాజు వీరినిచూచి భయపడి ముందు నకు రాక వెనుకకు పోగలడు. ఇంక మీ యిరువురి కలయిక జరుగ' దని పంతాజీ పలికెను. శివాజీ పిరికితనమునకు ఖానుడు నవ్వుకొనెను. పంతాజీ మాటలు నిజమే యనిపించెను. శివాజీ వెనుకాడినచో తానూహించిన యోజన యంతయు వృథా యగునని భావించిన ఖానుడు తన వెంట రావద్దని ఆ సైనికులకు చెప్పెను. శివాజీ భయపడుచున్నాడను వార్త ఖాను సైనికు లప్పటివర కెన్నియోసార్లు వినియుండిరి వారికి చులకనతోబాటు, అలసత్వముకూడ బలసినది. అక్కడ ప్రతాపగడ్‌పై శివాజీ దేవీపూజ తరువాత మాతృవందన మాచరించి, తన పథకములోని అన్ని ఏర్పాట్లు ఎట్లున్నవో తుదిసారి విచారించి సంతృప్తి చెందిన తరువాత మొట్టమొదట కవచము, శిరస్త్రాణము ధరించి పైన మామూలు వస్త్రములు ధరించెను. ఒక ఛురికను, పులిగోళ్ళనుకూడ రహస్యముగా నమర్చుకొనెను. తన పురోహితునకు నమస్కరించి, సవత్స గోదాన మొసగి, తమ సంప్రదాయము ననుసరించి పెరుగును, గరికను, అక్షితలను స్పృశించి, కోట రక్షణబాధ్యత నేతాజీ పాల్కరున కప్పగించి దుర్గమును దిగి ఖానును కలియుటకు బయలుదేరెను.

మార్గశీర్ష శుద్ధ సప్తమి గురువారమునాడు (10-11-1659) మధ్యాహ్నము ఒంటిగంటకు ఖాన్‌యొక్క పల్లకి షామియానావద్దకు వచ్చెను. పంతాజీ, కృష్ణాజీ భాస్కరుడు ఖాను, అతని అంగరక్షకుడు సయ్యద్ బండాలు షామియానాలోకి వెళ్ళిరి. ఆ షామియానా చాల యందముగా నున్నది. క్రిందవేసిన తివాసీలు ఖరీదైనవి. దానియందంతటను విలువైన వస్తువు లమర్చబడి యున్నవి. ఇవి యన్నియు చూచిన ఖాను మనస్సులో నీర్ష్య ప్రవేశించినది. ఆతని కన్నులలోని యీ భావమును గ్రహించిన పంతాజీ "ఈనాటినుండి యివి యన్నియు సుల్తానువారి వస్తువులే" అనెను. ఖానున కమితానంద మాయెను.

క్షణములు గడచినకొలది ఖానునకు ఆతృత యధిక మగుచుండెను. షామియానాలో చేరిన వెంటనే శివాజీని తీసుకొని రమ్మని పంతాజీతో నాతడు చెప్పెను. వెంటనే పంతాజీ అచటకు కొద్ది దూరముననున్న సందేశ వాహకుని పిలిచి, శివాజీ దగ్గరకువెళ్ళి త్వరగా రమ్మని చెప్పమని పంపెను. ఒక్కక్షణమైన ఖానుని వదలిపోరాదని విర్ణయము. కాన పంతాజీ వానిని బంపెను. త్రోవలో కలసిన సందేశ వాహకుని ద్వారా ఖానువద్ద షామియానాలో సయ్యద్ బండా యున్నట్లు తెలిసిన మహారాజచ్చటనే యాగి పంతాజీని పిలిపించెను. శివాజీ పంతాజీని పిలిచెనని విని ఖాను ఆశ్చర్యపడెను. "చూచితిరా శివాజీ భయ"మనుచు పంతాజీ ఖాన్‌తో చెప్పి వెళ్లెను. శివాజీతో మాట్లాడి తిరిగివచ్చిన పంతాజీ "శివాజీ చాల భయపడుచున్నాడు. మీతో వచ్చిన అంగరక్షకుని బయటకు పంపనిచో శివాజీ రాజాల"డని ఖానుతో చెప్పెను. చేత

చిక్కిన ఎలుక జారిపోవునేమోయని భావించిన ఖానుడు సయ్యద్ బండాను దూరముగా బంపెను. అంతట శివాజీ షామియానాలోనికి వచ్చెను.

ఇరువురి చూపులు కలసినవి. శివాజీ పిరికితనమును చూచిన అఫజుల్‌ఖాను చూపులలో చులకన భావము, అజాగ్రత్త; శివాజీ కన్నులలో శత్రుసంహారమునకు అవకాశ మన్వేషించు నిశితదృష్టి. విశ్వాసపూర్ణమైన చూపులు ఒక దానితోనొకటి కలసినవి. కుశలప్రశ్నల నడుగుచు యిరువురు ఒకరి దరి కొకరు చేరిరి ఆనందమున ఆలింగనము చేయుట కా యిద్దరును చేతులు చాపిరి. పరస్పరము కాటువేయుటకు ముందుకు సాగిన త్రాచుపాములవలె వారి హస్తములు కదలినవి.

శివాజీ పొట్టివాడు. శివాజీ తల ఖానుని ఛాతీవరకు మాత్రమే వచ్చెను. అంతట ఖాను అకస్మాత్తుగా శివాజీ యొక్క తలను తన ఎడమచంకలోనికి తీసుకొని రహస్యముగా తాను వెంట తెచ్చిన ఛురికతో శివాజీ డొక్కలో పొడిచెను. మహారాజు కవచము ధరించుటచే గాయము తగలక చొక్కా మాత్రమే చిరిగెను. వెంటనే శివాజీ పులిగోళ్ళతో ఖాన్ పొట్టను పొడిచి ఒక వైపునుండి రెండవ వైపునకు చీల్చెను. ఆ బాధ భరించలేక ఖానుడు బిగ్గరగా "మోసము! మోసము! ఈ దుష్టుడు నన్ను చంపెను. వీనిని చంపుడు!" అని అరచెను. ఇదివిని ఖాను రాయబారి శివాజీపై కత్తిదెబ్బ వేసెను. ఆ దెబ్బను తప్పించుకొని శివాజీ అతనిని చంపెను. ఖాను ప్రేగులు బయటకు వచ్చినవి. వాటి నటులేపట్టుకొని, ఖాను

షామియానా వెలికి రా ప్రయత్నించెను. లోపలనుండి వచ్చిన శబ్దము విని సయ్యద్ బండా క్షణములో లోపలకు దుమికెను. ఇదిచూచి శివాజీతో సంగరక్షకుడుగా వచ్చిన జీవాజీ మెహతా మరుక్షణమే సయ్యద్ బండాను సంహరించెను. ఇంతలో ఖాను బయటకురాగా అతనితల నరకబడెను. షామియానాకు కొద్ది దూరమునున్న ఖాన్ సైనికులు అక్కడనే చంపబడిరి. శివాజీ సైనికు లెవ్వరును సంహరింపబడలేదు. అక్కడనుండి వెంటనే శివాజీ కోటలోనికి వెళ్లెను. కోటపైనుండి ఫిరంగి మ్రోగెను. ఆ ఫిరంగి శబ్దమువిని ఖాన్ శిబిరములో నున్న వారు ఖానుకు స్వాగత సూచకముగ నా ఫిరంగి మ్రోగిన దనుకొనిరి. వారా విధముగా సంతోషముతో గంతులువేయు చుండగా శివాజీ సైన్యము నలువైపులనుండి వారిపై దుమికి వారిశిరముల నూచకోత కోసెను. ఖాన్ సైన్యము చాల వరకు చంపబడినది. మిగిలిన ఖాన్ సైన్యమును 'స్వరాజ్య' సైనికులు వాయీ వరకు తరిమి కొట్టిరి. వారినుండి దోచిన ధనమును, సాధన సామగ్రిని ప్రతాపగడ్‌కు తీసుకొని వచ్చిరి.

అచట రాజగఢమున రాజమాత జిజియాబాయి తన కుమారునకు, స్వరాజ్యమునకు ఎట్టి ముప్పు కలుగకుండుటకై భగవంతుని ప్రార్థించుచున్నది. అప్పుడు ఖాన్ చంపబడినట్లు అతని సైన్యము నాశనమైనట్లు వార్త రాజగడ్ చేరి అందరిని సంతోషపరచినది. ప్రతాపగడ్‌లో ఖాను దేహమునకు సకల మర్యాదలతో నంత్యక్రియలు ముగిసినవి. ఖాన్ శిరస్సును

చెడిపోకుండ ఒక గాజుపెట్టెలో పెట్టిరి. ఆ శిరస్సు జిజియా మాతకు చూపుటకుగాను రాజగడ్ పంపించబడినది. ఆ శిరస్సును - తన కుమారుని చంపిన, తన భర్తను చెరబెట్టిన ఆ శిరస్సును - చూచిన జిజియామాతకా విషయము లన్నియు గుర్తునకువచ్చి, వానికి ప్రతీకారము జరిగినందుకు సంతోషము కలిగినది. ఆ శిరస్సును రాజగడ్ కోట లోపలనున్న ఒక ప్రవేశద్వారము ప్రక్కగా నొకగోడలో బిగించుట కేర్పాట్లు చేయుడని శివాజీ యాజ్ఞాపించెను.

ఖాను సైన్యమున చేరిన హిందూ సరదారులలో ఖండోజీ ఖోపడే యొకడు. అతని యల్లుడు హైవతరావు శివాజీ కొలువులో నుండెను. అతడు తన అల్లునివద్దకుపోయి యేవిధముగానైన మహారాజుతో చెప్పి తన ప్రాణములను రక్షించమని కోరెను. కన్హోజీవలన చాలమంది దేశముఖులు ఈ యుద్ధములో శివాజీవైపు తిరుగుట సంభవించెను కాన అతడే శివాజీని ఈ విషయమై యడుగ గలడని భావించిన హైవతరావు కన్హోజీతో నామాట చెప్పెను. శివాజీ ఖండోజీని క్షమించడను నభిప్రాయము కన్హోజీ మనస్సులో నున్నప్పటి కిని హైవతరావు మాట కాదనలేక అతనిని క్షమించి ప్రాణదాన మివ్వవలసినదిగా శివాజీని కోరెను. అందుకు శివాజీ తొలుత యిష్టపడలేదు. కాని కన్హోజీ చాలసార్లు చెప్పుటచే శివాజీ ప్రాణదాన మిచ్చుట కంగీకరించెను. తరువాత ఖోపడే ప్రతాపగడకు వచ్చెను. కొన్ని రోజుల

తరువాత నొకనా డాతడు కంటపడగనే శివాజీ యతని కుడి చేతిని, ఎడమకాలును నరుకమని యాజ్ఞాపించెను. ఆ యాజ్ఞ వెంటనే అమలు జరిగెను. ఈ విషయము తెలిసి కన్హోజీ జేధే శివాజీవద్దకు రాగా "మీరుచాలసార్లు చెప్పుటవలన నేనాతనిని చంపలేదు. కాని స్వరాజ్యమునకు వ్యతిరేకముగా, ఏ చేయి లేచినదో, ఏ కాలు నడచినదో, వానికి శిక్ష నీయనిచో స్వరాజ్యమున క్రమశిక్షణ, శ్రద్ధాభక్తులు చెడిపోగలవ" వని శివాజీ తన యాజ్ఞయొక్క ఆంతర్యమును వివరించెను. స్వరాజ్య నిర్మాణపు విలువను, అందు సత్సంప్రదాయముల నెలకొల్పవలసిన యావశ్యకతను గుర్తించిన కన్హోజీ శివాజీ చర్య నభినందించెను.

* * *

# పనాళగఢ్ ముట్టడి

అఫజుల్‌ఖానును చంపిన రోజు సాయంత్రమే వోరజీ యను నొక సరదారును బీజపూరు సైన్యమును జయించుటకు కొంకణలోని రాజాపురముపైకి పంపి అదేరోజున అర్ధరాత్రి ఐదువేల సైన్యమును తీసుకొని శివాజీ స్వయముగా బయలు దేరెను. అఫజుల్‌ఖాన్ సైనికులను తరిమివేయుచు వచ్చిన నేతాజీ పాల్కర్ మరుసటిదినము, వాయిలో మిగిలిన ఖాను సైనికులను చంపి లూటీ చేయుచుండగా శివాజీ యక్కడకు చేరెను వారిద్దరు కలసి యొక పథకము పన్నిరి. దాని ప్రకారము నేతాజీ సరాసరి బీజాపురము వరకు నున్న ప్రదేశములను నాశనము చేయవలెను. శివాజీ పనాళగఢ వరకు నున్న ప్రదేశము జయించి స్వరాజ్యములో కలుపుకొనవలెను. ఈ విధముగ ముగ్గురు సేనాధిపతులు బీజపూర్ రాజ్యములో మూడు దిశలనుండి ప్రవేశించిరి. అఫజుల్‌ఖాన్ చంపబడిన వార్త బీజపూర్‌కు చేరిన వెంటనే ఈ మూడు దాడులవార్త కూడ నచట తెలిసినది. కొన్ని కొన్ని స్థలములలో ఖాన్ చంపబడిన వార్తకన్న శివాజీ సైన్యములే ముందు చేరినవి. శివాజీ కటావ్, మయణి, అష్టి, ఖరాహాడ్, సుపే, యొగావ్

కొల్హాపూర్, పనాళగఢ్ కోటలను జయించెను. నేతాజీ గదగ, తీకోటె, ఉకేరి, లక్ష్మేశ్వర్ వరకు లూటీచేసి పనాళగఢ్ కోట చేరెను. ఈ సమాచారము లన్నియు బీజపూర్‌కు చేరిన వెంటనే బీజపూర్ సుల్తాను, అఫజుల్‌ఖాను కొడుకు ఫాజల్‌ఖానును, సరదార్ రుస్తెమే జామన్‌లను పదివేల సైన్యమునిచ్చి శివాజీపైకి పంపెను. అప్పుడు శివాజీ నేతాజీ లిద్దరివద్ద కలసి మొత్తె మైదువేల సైన్యము మాత్రమే యుండెను. అయినను శివాజీ కొల్హాపూర్ దగ్గర ఖానులపై బడి వారిని ఓడించెను. ఇద్దరు ఖానులు పారిపోయిరి (28-11-1659). కొంకణలోని దాభోళకోట స్వరాజ్యములో కలసినది. ఖాను చంపబడిన పదునెనిమిది రోజులలో స్వరాజ్యములో నెంతయో భూభాగము కలసినది. తరువాత నేతాజీ పాల్కర్ కృష్ణ నదియొడ్డున నున్న సాంగలీ, పారగావ్ వరకు నున్న ప్రదేశమును జయించెను. మీరజ్ కోటను శివాజీ ముట్టడించెను. అది మట్టికోట. దానిని జయించుట కెక్కువ సమయము పట్టెను.

ఫాజల్‌ఖాను, రుస్తేమే జమాన్‌ఖాను లిద్దరు ఓడింపబడి బీజపురము చేరిరి. వారి యోటమికి సుల్తా నెంతయో దుఃఖించి శివాజీపైకి నెవని బంపవలెనా యని యోచించెను. తెలంగాణములో నున్న మహమ్మదు నూర్ (కర్నూల్) కోటకు అధిపతి సిద్దీ జౌహర్. అతడు శూరుడు, కర్తృత్వపరాయణుడు, పరమ సాహసి; అనుభవజ్ఞుడైన గొప్ప సేనాధిపతి. గుణము లెన్నిగల్గి యున్నను, సుల్తానున కాతనిపై చిన్నచూపుండెడిది. అతనికి మెరమెచ్చులకై దర్బారులలో నాడు కపట నాటకములు చేతకావు. ముక్కుకు సూటిగా నడుచు

సైనికు డాతడు. సుల్తానున కాతనిపేరు స్ఫురణకు రాగానే యాతనికి కబురంపబడెను. తన కాహ్వాన మెందుకు వచ్చినదో గ్రహించిన సిద్ది వినయపూర్వకముగా మీయాజ్ఞ కెదురు చూచుచున్నానని సుల్తానుకు జాబు వ్రాసెను. శివాజీ నోడించి నా యభిమానమునకు పాత్రుడవు గమ్మని సుల్తా నాతనికి కబురుపెట్టెను. అది యందిన వెంటనే ససైన్యముగా సిద్ది బయలుదేరెను.

సిద్ది జౌహార్ బీజపూర్ వచ్చునప్పు డాతనితో నతని సైన్యముకూడ వచ్చినది. అతని సైనికులందరూ నల్లనివారు. చూచుటకు భీకరముగా నుండెడివారు. మందముగా ఉన్న పెదిమలు, పెద్దకళ్లు, ఉంగరాలు తిరిగిన వెంట్రుకలు, కండలు తిరిగిన దేహములతో, నెత్తుగా లావుగా చూచుటకు భీకర ముగ నున్నప్పటికి కూడ వారిలో చాల మంచిగుణము లున్నవి. వారు శూరులు, విశ్వాసపాత్రులు, బుద్ధిమంతులు. సిద్ది జౌహార్ ఉత్తమమైన సేనాపతి. అట్టివానికి సహాయము చేయుటకు సుల్తాన్ పెద్ద పెద్ద సర్దారులను కూడ యిచ్చెను. వారి అందరి సేనలు బీజపురము బయట శిబిరములలో నేక మయ్యెను. కొంకణనుండి సూర్యరావు సూరవే, జస్వంతరావు లను కూడ సుల్తాను పిలిపించెను. ఇరువదివేల గుఱ్ఱపుదళము, పదిహేనువేల పదాతిదళముతో బీజపూరు సైన్యము బయలు దేరెను. అంతేగాక ఔరంగజేబునకు శివాజీని నాశనము చేయుటకు సైన్యమును బంపుమని ఉత్తరమును వ్రాసెను. శివాజీయొక్క శత్రువులందరిని ఒకేసారి లేవదీసి ఆ వెల్లువలో శివాజీని ముంచివేయవలెనని బీజపూరు సుల్తాను భావించెను.

అప్పుడు శివాజీ మిరాజ్‌లో నుండెను. సిద్దియొక్క సేనాసాగరము బీజపురమునుండి మిరాజ్ వైపు బయలు దేరినది. ఈ వార్తను గూఢచారులు శివాజీకి తెలియజేసిరి. పెద్ద సైన్యముతో వచ్చెడి సిద్దితో మైదానములో యుద్ధము చేసి గెలుచుట యసంభవము. ప్రతాపగడమున్న కొండలలో నైనచో జయించుట సులభము. కాని తా నచటికి పోయినచో వెనుకనే సిద్ది వచ్చును. అతని సైన్యము మధ్యనున్న దేశము నంతను సర్వనాశనము చేయుచూ రావచ్చును. అట్లు జరగ నీయకుండుటకై స్వరాజ్యమునకు సరిహద్దునైనున్న పనాళగఢ కోటలో తా నుండి సిద్దితో యుద్ధము చేయవలెనని శివాజీ యనుకొనెను. పనాళగఢ దుర్గము శత్రుదుర్భేద్యము. లోన తానుండగా సిద్ది ముట్టడిని చేసినచో, పైనుండి నేతాజీ పాల్కర్ అతనిపై దాడిచేయవచ్చును. మధ్యనున్న సిద్దికి ఓటమి తప్పదని యెంచిన శివాజీ సంవత్సరాదినాడు పనాళ గఢమున ప్రవేశించెను (2-3-1660). తరువాత రెండు రోజులకే సిద్ది జౌహారు కోటను ముట్టడించెను.

ఆ కోటలో శివాజీ యున్నట్లు సిద్ది జౌహారునకు తెలి యును. శివాజీ కొరకే యాతడు కోటను ముట్టడించెను. దుర్గములోనికి రాకపోకల నరికట్టి వీలు దొరికినపుడు ఆక్రమణ చేయవలెనని సిద్ది యాలోచించెను. లోన యాహారసామగ్రి వ్యయము కాగానే కోటతోసహా శివాజీ తన స్వాధీనము కావచ్చునని ఆత డాశించెను. కోటనుండి శివాజీ సైనికులు ఫిరంగులు కాల్చుచుండుటచే జౌహార్ సైనికులు దూరమున యుండవలసి వచ్చెను. దూరమునుండి కాల్చినను కోట గోడల వరకు గుండునంపు ఫిరంగులు సిద్దివద్ద లేవు. అట్టి ఫిరంగులను

విశాళగఢ కోటను ముట్టడించుటకై సూర్యారావు సురవే, యస్వంతరావులను సిద్ది నియోగించెను

బీజపూర్ సుల్తాన్ వ్రాసిన జాబు చూచి, శివాజీని నాశనము చేయుట కదియే మంచి అవకాశమని యెంచిన ఔరంగజేబు ఔరంగాబాదు సుబేదారుగా నున్న తన మామ యగు షహిస్తఖానను శివాజీమీద స్వతంత్రముగ దాడి చేయుమని ఆజ్ఞాపించెను. ఏడువేల గుఱ్ఱపు దళము, ముప్పది వేల పదాతి దళముతో ఔరంగాబాదునుండి షహిస్తఖాను బయలుదేరెను (28-4-1660). షహిస్తఖాను సుల్తాను లందరి వలెనే దారిలో నున్న ప్రదేశము నంతనూ ధ్వంసము చేయుచు పూనా చేరెను (19-5-1660).

బీజపూరునుండి సిద్ది జౌహార్ కూడ అప్పటికి శివాజీ పైకి బయలుదేరి పనాళగడమును ముట్టడించి యుండెను ఈ విధముగా ఒక లక్షన్నర కన్న ఎక్కువ సైన్యము స్వరాజ్యమును నాశనము చేయుటకు రెండు వైపులనుండి క్రమ్ముకొని వచ్చెను. అప్పుడు శివాజీవద్ద పదిహేనువేల సైన్యము మాత్రమే యుండెను.

సిద్ది జౌహారు ముట్టడిని కట్టుదిట్టముగా నుంచెను. దుర్గములోనున్న శివాజీ కంతయు నయోమయముగా నుండెను. ముందుగా ననుకున్న ప్రకారము నేతాజీ పాల్కర్ సిద్దిపై బయటనుండి నేల యాక్రమించుటలేదో తెలియుటలేదు. నేతాజీకి శివాజీ పనాళగఢ్‌లో ముట్టడింపబడినాడని, షహిస్త ఖాన్ స్వరాజ్యములో ప్రవేశించినాడని తెలియును. కాని నేతాజీ భావించినది వేరు. పనాళగఢ్ ముట్టడిని భంగము

చేయుట కతనివద్ద తగినంత సైన్యము లేదు. బీజపుర సైన్యము చాల పెద్దది. సుల్తాను సైన్యమంతయూ నిట చేరినది. బీజపురమున తక్కువ సైన్య మున్నది. తాను బీజపురముపై దాడి జరిపి దానిని ధ్వంసము చేసినచో సిద్ది జౌహార్ దగ్గర నున్న సైన్యము తప్పనిసరిగా బీజపురము నకు రావలసి వచ్చును దానితో పనాళగఢ్ ముట్టడి భంగమై శివాజీ మహారాజు బయటకు రావచ్చును. ఇట్లూ హించి యాతడు బీజపురము వైపు వెళ్ళెను. బీజపురము దగ్గరనున్న షావుపూర్‌లో ముల్లా మహమ్మదును, బాబులా ఖానును ఓడించెను. వారిద్దరు పారిపోయి బీజపూర్ చేరిరి. నేతాజీ పాల్కర్ బీజపురముపైకి దండయాత్ర వచ్చుచున్నాడని విని యచటివారందరు భయపడిరి. కాని అప్పుడు బీజపురములోనున్న నైదువేల సైన్యముతో ఖావాస్ ఖానుడు నేతాజీ పాల్కర్ నెదుర్కొనెను. ఖాను సైన్య మప్పుడే యుద్ధములోనికి దిగినది. నేతాజీ సైన్యము అఫజుల్ ఖానును చంపినప్పటినుంచి దాదాపు ప్రతినిత్యము యుద్ధము చేయుచునే యున్నది. అలసిపోయిన తన సైన్యముతో మైదానమున ఖావాస్‌ఖానుపై జరిపిన యుద్ధములో నేతాజీ పూర్తిగా ఓడిపోయెను. షావుపూర్‌లో నోడిపోయిన తరువాత నేతాజీ రాజగఢ్‌లోనున్న జిజయాబాయి దగ్గరకు భవిష్య కర్తవ్యము నాలోచించుటకై పోయెను.

రాజగఢ్ మీద జిజియాబాయి చాల విచారముగా నుండెను. అఫజుల్ ఖానుతో కలియుటకై శివాజీ రాజగఢ్ నుంచి ప్రతాపగఢ్ వెళ్లినప్పుడు ఆమె శివాజీని చూచి యుండెను. అప్పటినుండి పది పదకొండు నెలలకైననూ ఆమె

కుమారుని చూడలేదు. అంతేగాక రెండు మూడు నెలలనుండి శివాజీ పనాళగడ్ కోటలో ముట్టడింపబడి యుండెను. దాని నుండి వెలివడి కుమారు డెప్పుడు వచ్చునాయని ఆమె ఎదురు చూచుచుండెను.

నేతాజీ పాల్కరు, శివాజీలు దూరముగా నుండుట వలన రాజధానిని చుట్టియున్న స్వరాజ్యమును సంరక్షించు బాధ్యత నామెయే నిర్వహించుచుండెను. అపుడు రాజధానిపై దండెత్తి వచ్చిన సహిస్తఖానుని వ్యూహ పద్ధతిలో నామె యెంతయో బాధపెట్టెను. కాని శివాజీ ముట్టడింపబడిన వార్త యామెను కలచివేసెను. తానే స్వయముగా పనాళగఢ్ వెళ్ళి సిద్దిమీద యాక్రమణ చేయవలెనను యాలోచన కూడా ఆమెకు కలిగెను. ఇంతలో మే నెల చివరకు నేతాజీ పాల్కర్ రాజగఢ్‌కు వచ్చెను. అతనినిచూచి జిజియాబాయి కోపముతో, "రాజిక్కడ ముట్టడింపబడియుండగా శత్రువునకు భయపడి నీ విక్కడికి వస్తివా? శివాజీని విడిపించుటకు నేనే పనాళగఢ్ పోవుచున్నా" ననెను. అది వినిన నేతాజీ పౌరుషముతో రాజగఢమున నొక్క క్షణమైన నాగకుండ పనాళగఢ చేరి సిద్దిజౌహార్‌పై దాడిచేసెను. ఈ విషయము కోటలోని మహారాజునకు తెలిసినది. మూడు నెలల పదిహేను రోజులనుండి శివాజీ ఈ అవకాశము కొఱకై ఎదురు చూచు చుండెను. ఇంక నేమాత్రము అవకాశము చిక్కినను, నాతడు కోటనుండి బయటకు పోవలెనని ఎదురు చూచుచుండెను. కాని సిద్దిజౌహార్ సామాన్యుడు కాడు. అతడా కోట ముట్టడి నుండి తన సైనికుల నెవ్వరిని కూడ వెలికి పిలవకుండా, తన దగ్గర నుంచుకొన్న యదనపు సైన్యమును మాత్రమే

నేతాజీపై కంపెను. ముట్టడి చేయుచున్నవారిని జాగరూకులుగా చేసెను. నేతాజీతో నతి భీకరమైన యుద్ధము చేయవలసి వచ్చెను. కాని చివరకు వారు నేతాజీని పూర్తిగా నోడించిరి. దీనితో ముట్టడినుండి వెలికి వచ్చుటకు శివాజీ యాశించిన మార్గము విఫలమైనది.

బయటినుండి తన కెవ్వరును సహాయము చేయగలవారు లేకపోవుటచే శివాజీ తానే యేదో మార్గము వెతుకవలసి వచ్చినది. ముట్టడినుండి బయటకు పోవుట కేమాత్ర మవకాశము లేకుండెను. సాహసించి వెలికి వచ్చినచో శత్రువులకు దొరకుట కవకాశమున్నది. అది కోరి మృత్యువు నావ్హానించినట్లే కాగలదు. అయిననూ అంతకన్న వేరు మార్గము లేదు. అట్టి ప్రయత్నము చేయవలసి వచ్చిన, వర్షాకాలములోనే చేయవలెను. వర్షాకాలము దాటినచో ముట్టడి మరింత పటిష్టము కాగలదు. అంతేగాక, అప్పటికి షహిస్తఖాను స్వరాజ్యమును చాలభాగము నాశనము చేయవచ్చును. అందువలన ఈ వర్షాకాలములోనే ముట్టడినుండి బయటపడవలెనని శివాజీ నిర్ణయించెను. సాహసించి కోటనుండి వెలికివచ్చుట యొక్కటియే మిగిలియున్న యవకాశము. వెంటనే శివాజీ కోటలోనున్న త్ర్యంబక దేవ్ పంత్, గంగాధర పంత్, బాజీప్రభు దేశపాండే వంటి ప్రముఖులను పిలిచి, "ఇపుడు మనము సిద్ది జౌహారు నోడించుట యసాధ్యము; నేతాజీకూడ ఓడింపబడి వెనుకకు మళ్లెను. షహిస్తఖాన్ స్వరాజ్యమును నాశనము చేయుటకు యారంభించినాడు. కాబట్టి నే నెట్లయిన ముట్టడినుండి బయటకు వెళ్ళవలెను" అని పలికెను. అది విని వారు స్తంభించిపోయిరి. 'ఎగిరిపోవుటకు

విమానము లేదు. దూరి పోవుటకు సొరంగములేదు. ఎట్లింక ముట్టడినుండి తప్పించుకొనుట'యని వారి మనసులు కలవర పడినవి. కాని శివాజీ వివరించిన దేశపస్థితులు తెలిసిన తరువాత యంతకన్న వేరుదారి లేదని వారుగూడ గు్రహించిరి.

ముట్టడినుండి వెడలునపుడు సిద్ది జౌహారు మనుష్యుల కెవరకు తెలియకుండా వెళ్ళవలెను. శక్తివలన లాభములేదు. యుక్తి యవసరము. ఎవరికిని తెలియకుండ బయటకు పోవుట కేదైన మార్గమున్నదేమో చూచివచ్చుటకు సమర్థులైన గూఢచారులు నియోగింపబడిరి. వారుఎంతో శ్రమపడి శివాజీ సురక్షితముగా వెళ్ళవలసిన మార్గమును తెలిసికొని వచ్చిరి. మార్గము దొరికినదిగాని సిద్ది మనుష్యుల నేమార్చుట ఎట్లు? అందులకై శివాజీ సిద్ది దగ్గరకు క్షమార్పణ కోరుచూ పత్రము పంప నిశ్చయించెను. ఆషాఢ పూర్ణిమ రోజున గంగాధరపంత్ ఆ పత్రమును తీసికొని రాయబారిగా సిద్ది శిబిరములోనికి పోయెను. ''మీరు పనాళగఢ వచ్చి యున్నారనివిని, మీకృప సంపాదించుకొని, యిట్టి కష్టములు కలుగకుండ చేసికొనవలెనని తొలుత నాలోచించితిని. గాని భయముచే నట్లు చేయలేక పోయితిని. మీరు యనుజ్ఞ ఇచ్చినచో రాత్రిసమయమున, కొద్దిమందితో మీ శిబిరము నకువచ్చి, నేను మిమ్ములను కలిసి ఆపై మీయిష్టప్రకారము చరింపదలచుచుంటిని. నాయందను గ్రహించి నాకా యవ కాశము నిప్పించ గోరుచున్నా'' నని శివాజీ వ్రాసిన ఉత్తరము చూచి సిద్ది ఆశ్చర్యమొందెను, శివాజీ చాల ధూర్తుడు, మోసము చేయుటలో నారితేరినవాడు, అతని విషయమున చాల జాగ్రత్త వహించవలెనని బీజపూర్ సుల్తాను సిద్దికి

పదే పదే వ్రాయుచుండెను. అందువలన శివాజీ వ్రాసిన యుత్తరముచూచి, సిద్ది కొంతసేపాలోచించెను. కాని ఇపుడు శివాజీ యడిగినదానిలో తాను మోసగింపబడుట కెట్టి యవకాశము అతనికి కనబడలేదు. ఇంతటి పెద్ద సైన్య శిబిరముల మధ్యలో తన డేరాలో చాల కొద్దిమందితో శివాజీ వచ్చి చేయగల్గిన మోసమేమియు లేదు. సరెగదా, అట్టి ప్రయత్నమేదైన చేసినచో యుద్ధము చేయనవసరము లేకుండ నాతడు తనచేతిలో చిక్కగలడు ఇట్లూహించిన సిద్ది జౌహారు శివాజీ సూచన కంగీకరించెను. మరుసటిరోజు రాత్రికే సిద్ది శిబిరములోనికి శివాజీ రావలెనని నిర్ణయమైన తరువాత గంగాధర పంతు తిరిగి కోటలోనికి వచ్చెను. శివాజీ వద్ద నుండి ఒక రాయబారి సిద్ది జౌహారు వద్దకు వచ్చి వెళ్లుట సైన్యములోని వారందరును చూచిరి. రాయబారమునందలి విషయముకూడ నందరకును తెలిసినది. వారి యానందమునకు మేరలేదు. ఎవరికివారు 'ఎక్కువ రోజులు ఇళ్ళు వాకిళ్లు వదలి, యీ అడవులలో ఉండవలసిన అవసరము తప్పుచున్నది గదా' యని సంతోషించిరి. దానితో నొకవిధమైన యశ్రద్ధ - ముట్టడిలో ఒక సడలింపు - సిద్ది సైన్యమున కలిగినది. అన్నము ఉడుకునంతవరకు నాగగలిగినవారు వండిన తరువాత వడ్డించులోపల నాతురపడినట్లున్నది ఆనాడు సిద్ది సైన్యపు స్థితి.

గంగాధరపంతు సిద్ది దగ్గరనుండి కార్యసాఫల్యమునంది వచ్చిన తరువాత శివాజీ తనవారి నొక్కొక్కరుగా పిలిచి వారి వారి కర్తవ్యములను వారికి వివరించెను. పథకమునంతయు ముందుగనే శివాజీ నిర్ణయించెను. దాని ప్రకారముగా ఆనాటి అర్ధరాత్రి మొదటిజామున ఆరువందలమంది సాయుధ

పదాతి సైనికులు కోట దిగి సిద్ది సైనికుల కన్నుగప్పి ముట్టడి నుంచి బైటికిపోయి విశాలగఢ్ కోట చేరవలెను. ఇది కత్తిపై సాముపంటి పని. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఆరువందల మంది నిశ్శబ్దముగా నెవరికి తెలియకుండ పోవలయును. శత్రువున కేమాత్ర మనుమానము కలిగినను, అందరును ముక్కలు ముక్కలుగ నరుకబడుదురు. ఈ పథకములోని రెండవ యంశము మరింత కఠినమైనది. ముట్టడినుండి బైటకు వెళ్ళినవారు నలుబది మైళ్ళు నడచుచు, పరిగెత్తుచు పోయి విశాలగఢ్ ను ముట్టడించియున్న సూర్యారావ్, జస్వంతరావులతో యుద్ధము చేసి, గెలిచి, విశాలగఢ్ ను ప్రవేశించవలెను. ఈ ఆరువందల మందిలో నెంతమంది విశాలగఢ్ వరకు వెళ్ళగలరు? మరి ఎంతమంది ఆ కోటలోనికి చేరగలరు! అంతయును అనుమానాస్పదమే. కాని ఇది తప్ప వేరు మార్గము లేదని నిర్ణయమైన తరువాత సావధానముగ, దానిలో విజయము గాంచుటకు ప్రయత్నించి, ఫలమును శ్రీ భవానీ దేవికై వారు వదలిరి. దుర్గ రక్షణ భారమును శివాజీ త్ర్యంబక పంత్ న కప్పగించెను. శివాజీ శ్రీ భవానీ మాతను స్మరించి తన గదినుండి బయటకు వచ్చుసరికి బాజీప్రభు దేశ్ పాండేతో నారువందలమంది సైనికు లక్కడ ప్రయాణమునకు సంసిద్ధులై యుండిరి.

మహారాజున కొక పల్లకీ సిద్ధముగా నుంచబడెను. మఱియొకటిగూడ ఖాళీగానుంచబడెను. శివాజీ పల్లకీలో కూర్చున్న తరువాత అందరును బయలుదేరిరి. చినుకులతో నారంభమైన వర్షము క్రమముగా కుండపోతగా మారెను. మబ్బులతో నాకాశమంతయు కప్పబడియుండెను. తురకల ముట్టడిలో

చిక్కువడిన శివాజీవలె, చంద్రుడు మబ్బులనూరున చిక్కెను. గాఢాంధకార మలముకొనెను. మార్గము నెరింగిన గూఢ చారులు ముందు నడచుచుండిరి. వారివెనుకగా నారువందల మంది సైనికులు ఒక్కటిగానయి నడచుచుండిరి. వారు మెల్లగా కోటను దిగుట కారంభించిరి. వేయుచున్న ప్రతి యడుగు వారిని మృత్యుముఖమువంటి సిద్ది సైనికుల దరికి చేర్చుచున్నది. అందరూ సావధానులై యుండిరి. సిద్ది శిబిరము వందయడుగుల దూరమున నున్నది. అది క్రమముగా ఏబది యిరువది, పదియడుగుల దూరములోనికి వచ్చెను. శిబిరమును మరుక్షణములోనే వారు సమీపించిరి. కంసుని నిర్బంధము నుండి వసుదేవుడు కృష్ణుని తీసుకొనిపోవు రాత్రివలె నున్నదా రాత్రి. జౌహారు సైనికులు చలికి వణుకుచు వారి వారి గుడారములలో నుండిరి. అంచె లంచెలుగా శివాజీ సైనికులు శిబిరమును దాటిరి. శివాజీ యందరికన్న ముందే శిబిరమును దాటి విశాలగఢవైపు పయనించుచుండెను. భవానీమాత యనుగ్రహమున పథకములోని మొదటియంశము విజయవంత ముగా ముగిసెను. ఇకవారి ధ్యానమంతయు విశాలగఢపైననే. వర్షమింకను తీవ్రమయినది. వారి కా ధ్యాస లేదు. వర్షము వచ్చినను, ప్రళయము వచ్చినను, ఏది ఏమైనను– వీలైనంత త్వరలో విశాలగఢమును చేరవలె ననునదియే వారిలక్ష్యము, గమ్యము.

అంతటి వర్షములో నా యడవులలో, కొండలలో నెవరుగాని వెలికి రారు. కాన ఎవరయిన తమను చూతురను భయము వారికి లేదు. కాని యంతలోనే మెఱపు మెరిసినది. దూరమున నేవో మానవాకారములు కదలిన ట్లున్నవి. వా

రెవరో శివాజీ సైనికులకు తెలియుటలేదు. వా రెంతమంది యున్నారో కూడ బోధపడలేదు. కాని వారు మాత్రము తమను చూచిరని నిశ్చయముగా తెలియును. వా రెవరై యుందురు? సిద్ది సైనికులైనచో వారిని చంపుట యవసరము. చంపవలెనన్న వారిని వెంటబడి తరిమి చంపవలెను. దానికీ కటిక చీకటిలో చాల సమయముపట్టును వారిలో నే యొక్కడయిన తప్పించుకొని సిద్దికీ వార్త తెలిపినచో, క్షణములో సిద్ది సైన్యము గుఱ్ఱములపై రాగలరు. ఈ స్థితిలో క్షణము వృథాయయినచో మహారాజునకు ప్రమాదము. ఆలస్య మయినచో శత్రువులు తమ నాక్రమింతురు. కావున తమ గమనమును గుర్తించిన వా రెవరను యోచనను వదలి శివాజీ సైనికులు మరింత వేగముగా ముందుకు సాగిరి. సమయము గడచుచుండెను. కొంత దూర మేగిన తరువాత శివాజీ పోలిక లున్న వేరొక వ్యక్తిని ఖాళీగా నున్న పల్లకిలో కూర్చుండ బెట్టి, ఆ పల్లకితో పది, పదిహేనుమంది సైనికులు విశాలగడ పోవు త్రోవపట్టిరి. శివాజీ మహారాజు కూర్చున్న పల్లకితో మిగిలిన సైనికులు వేరొక కాలిబాటవెంట విశాలగడమును చేర బయలుదేరిరి. కటిక చీకటి – కంటకాకీర్ణ మార్గము. వారు మాత్రము ముందునకే పయనించుచుండిరి. వారికి వేరాలోచనలు లేవు. కష్టసుఖముల పరిగణన వారికి లేదు. దేశకార్యము పూలబాటపై పయనించుట కాదుగదా !

శివాజీ పల్లకిని, సైనికులను చూసినవారు సిద్ది జౌహారు గూఢచారులే. తాము శివాజీ కంటపడనందుకు వారు సంతోషించిరి. వారు పరుగు పరుగున సిద్ది శిబిరమును చేరి శివాజీ పల్లకీలో కూర్చొని చాలమంది సైనికులతో ముట్టడిని

దాటి, విశాలగఢవైపు వెళ్ళినట్లు సిద్దితో చెప్పిరి. ఆ వార్త సిద్దికి పిడుగుపాటువలె నైనది. స్తంభించిపోయిన యాతని నోట కొంతవరకు మాట రాలేదు. ఆ గూఢచారుల వైపు కొంతసేపు రెప్పలార్చకుండ చూచుచుండెను. అంతలోనే తేరుకొని "అల్లా! ఇపుడు నాగతి ఏమగును?" అని వ్యథ చెంది, కొంతసేపటికి ధైర్యము చిక్కబట్టుకొని, తన మాటలలో గాంభీర్యము మెరయుచుండగా సిద్ది మసూద్ అను దళవాయిని పిలిచి 2000 గుఱ్ఱపుదళము ఒక వెయ్యి పదాతి దళము నిచ్చి శివాజీని పట్టి తీసుకురమ్మని పంపెను. సిద్ది మసూద్ వెంటనే బయలుదేరెను. వర్షము కురియుచుండగా నా చీకటిలో నాతడు త్వరగా పయనించుటకు వీలుపడలేదు. అట్లు రెండు మూడు గంటలు ప్రయాణించిన తరువాత వారికి ఒక పల్లకి ననుసరించి వెళ్ళుచున్న కొందరు మనుష్యులు కనిపించిరి. శివాజీ చిక్కినాడని యానందించుచు వారా పల్లకిని చుట్టుముట్టిరి. పల్లకిలో నెవరున్నారని వారు ప్రశ్నించిరి. బోయీలు భయముతో వణకుచున్న కంఠముతో "శివాజీ" యని బదులు చెప్పిరి వెంటనే మసూద్ పల్లకిలో తొంగిచూడగా శివాజీ కనపడెను. ఆ పల్లకిని తీసుకొని వారందరూ శిబిరములోనికి వచ్చిరి. మసూద్ శివాజీని పట్టుకు వచ్చె నన్న వార్త విని యందరును సంతసించిరి. శివాజీని పూర్వము చూసినవారు కొందరా శిబిరములో నుండిరి. మసూద్ తీసుకువచ్చినవాడు శివాజీయేనని ఋజువు చేసికొనుటకై వారిని పిలిచిరి. వారు వచ్చి చూడగా నాతడు శివాజీ కాడేమో నని సందేహము కలిగినది. చివరి కాతడు శివాజీ పోలికగల యొక మంగలి యని తేలినది.

మసూద్ ముఖమున కత్తి వేటునకు నెత్తురుచుక్క లేదు. అందరును హతాశులైరి. అప్పటికి రాత్రి మూడున్నర గంటలైనది. వెంటనే సిద్ది మసూద్ మరల బయలుదేరెను. జరిగిన మోసమువలన నప్పుడాతని కన్నులలో నిప్పులుకురియు చుండెను. ఈ వ్యవధిలో శివాజీ దళము ముందునకు హుటాహుటిని పయనించు చున్నది. తెల్లవారుఝాము మగుసరికి, వెనుకనుండి ఏదియో సైన్యము వచ్చుచున్నట్లు శివాజీ దళమునకు కన్పించినది. శివాజీ సైనికులదిచూచి పరిగెత్త నారంభించి, త్వరత్వరగా గజీపూర్ కనుమలో చేరిరి. అక్కడ నుండి విశాలగఢము ఎనిమిదిమైళ్ళుదూర మున్నది. వెనుక నుండి సిద్ది సైన్యము, ముందు విశాలగఢమును ముట్టడించి యున్న సూర్యారావ్ సూరవే సైన్యము లున్నవి. ఈ రెండు శత్రుసేనల మధ్యలో రాత్రియంతయు పరుగిడి అలసియున్న కొద్దిపాటి శివాజీ సైన్యమున్నది. అట్టిచో కర్తవ్య మేదియో ఆలోచించుటకుకూడ సమయములేదు. ఎవరునూ మాట్లాడుట లేదు. దూరమునుండి శత్రుసైన్యములోని గుఱ్ఱపు డెక్కల సవ్వడి క్రమముగా సమీపించుచుండెను. అప్పుడు బాజీ ప్రభు దేశపాండే శివాజీయున్న పల్లకీని సమీపించి, "మహారాజా! సిద్ది సైన్యమును మన మీ కనుమలలో నే యాపవలయును. మీరిక్కడ నాగకుండ విశాలగఢ్‌కు వెడలి పొండు. మన దళములోనున్న సగముమందితో నేను శత్రువును ఈ సన్నని దారిలో అడ్డగించెదను. మీరు త్వరగా విశాలగఢ్ చేరి అక్కడనుండి ఫిరంగిని కాల్పించుడు. ఆ ఫిరంగిశబ్దము వచ్చునంతవరకు నేను శత్రు సైన్యమును యీ కనుమ దాటనివ్వ"నని పలికెను. బాజీప్రభు స్వీకరించిన కార్య

మెంతయో కఠినమైనది అలసిపోయిన మూడువందలమంది సైన్యముతో శివాజీ కాలినడకతో వెళ్ళి విశాలగఢ్ దగ్గరవున్న ముట్టడిని భేదించి కోటపైకి చేరవలయును. అందుకు చాల సమయము కావలయును. అప్పటివరకు నొక పెద్ద సైన్యమును ఈ కనుమలో నాపవలయును. ఇది సాధ్యమా? కాని వేరు దారిలేదు కాన శివాజీ యందు కంగీకరించెను. సగముసైన్యము మహారాజుతో వెళ్ళినది. కొద్ది సమయము గడిచినదో లేదో శత్రువుల గుఱ్ఱపుదళము కొండ నెక్కుట కారంభించినది. బాజీప్రభు సైనికులు పైనుండి పెద్ద పెద్ద రాళ్ళను క్రిందకు త్రోయుట ప్రారంభించిరి ఆ రాళ్లు తగిలి శత్రు సైనికులు క్రిందపడుచుండిరి. పైకి చేరగలిగినవారిని బాజీప్రభు సైనికులు చంపుచుండిరి. ఇట్లు నాలుగైదుగంటలవరకు శత్రుసైన్యమును నిలువరించు యాట యాడవలయునని బాజీప్రభు ఉద్దేశించెను. తదనుసారము శత్రువు జరిపిన రెండు దాడులను బాజీప్రభు వెనుకకు నెట్టగల్గెను.

మహారాజు విశాలగఢమును చేరెను. అచట సూర్యారావు సురవే సైన్యసమేతుడై యుండెను. గత్యంతరములేక శివాజీ యొకప్రక్కనుండి సూర్యారావు సైన్యముపై యుద్ధమునకు దిగెను. ఇక్కడ విశాలగఢ క్రింద శివాజీ, అక్కడ గజీపూర్ కనుమలలో బాజీప్రభు పోరాడుచుండిరి. శివాజీ సైనికులు ప్రాణములకు తెగించి పోరాడుచుండిరి. శత్రుసంహారమునకన్న, వారికి కోటలో ప్రవేశించుట ప్రముఖ యవసరము. కాన యుద్ధము చేయుచునే వారు ముందునకు చొచ్చుకొని పోవుచుండిరి. విశాలగఢము పైనుండి దీనిని పరికించిన శివాజీ సైనికులు సూర్యారావు సైనికులపై

నాయుధములు ప్రయోగించసాగిరి. ప్రవాహమున కెదురీదినట్లు చివరకు సాయంత్రము ఐదు గంటల కా ముట్టడిని భేదించి శివాజీ విశాలగఢ కోట లోపలికి పోయెను. గజ్‌పూర్ కనుమలో నున్న బాజీప్రభు దేశపాండే విశాలగఢముపై నుండి ఫిరంగి శబ్దము కొరకు ఎదురుచూచుచుండెను. అతని సైన్యములో నప్పటికి సగము మంది చంపబడి యుండిరి. ఇంకను పోరాటము సాగుచునే యున్నది. బాజీప్రభుకు గూడ చాల గాయములు తగిలినవి. గాయములు లేని శరీరావయవము లేదు. రక్తము ధారలుకట్టి ప్రవహించుచున్నది. అతడు మరణావస్థలో నుండెను అయిననూ శత్రుసైనికులను ముందు కడుగిడ నీయలేదు. కోటలోనికి చేరిన వెంటనే శివాజీ దుర్గము పైనుండి ఫిరంగి పేల్పించెను. ఆ శబ్దము బాజీప్రభువు చెవులబడెను. 'మహారాజు కోటలోనికి చేరినాడు. ఇంక స్వరాజ్యమునకు భయము లేద' ని భావించుచు ఆనందముతో బాజీప్రభు ప్రాణములను వదలెను. అట్టి సాటిలేని దేశభక్తుని మృత్యువుచే పావనమైన ఆ కనుమకు ఆరోజు నుండి పావన కనుమ అని పే రేర్పడినది. బాజీప్రభు ప్రాణము వదలిన తర్వాత అతనితోనున్న స్వారాజ్యసైనికులు పోరాటము సలుపుచునే వెనుకకు జరుగుచు నకస్మాత్తుగా ప్రక్కనున్న అడవిలోనికి తప్పించుకొని పోయిరి.

కనుమలో పోరాడుచున్న స్వరాజ్య సైనికులు తొలగి పోయినవెంటనే అడ్డుతొలగిన ప్రవాహమువలె సిద్ది మసూదు సైన్యము విశాలగఢవైపుగా ముందున కురికినది. వారు విశాలగఢ్ కోటదరికి చేరుసరికి, అచటనున్న సూర్యారావు శివాజీ కోటలోనికి వెళ్లెనని మసూదుతో చెప్పెను సిద్ది

చేసిన యత్నమంతయు వృధా అయ్యెను. అయినను సిద్ది నిరుత్సాహపడక విశాలగఢము చుట్టును ముట్టడి పటిష్టము చేయ నారంభించెను. అది తెలిసిన శివాజీ, కోట పైనుండి అలసిపోకుండా యున్న సైనికులను వారి నెదిరింప బంపెను. భగ్నప్రయత్నులై యలసి నిరుత్సాహముతోనున్న సిద్ది సైన్యమును వారు సులభముగా నోడించిరి. సూర్యారావు, జస్వంతరావు, మసూద్‌లు పారిపోయి పనాళగఢ్ దగ్గరనున్న సిద్ది జౌహారు శిబిరమును చేరిరి.

ఇంతజరిగిననూ సిద్ది జౌహారునకు మాత్రము శివాజీ నిజముగా పారిపోయెనా? లేదా? యను సందేహము మాత్ర ముండెను. మసూద్ వచ్చి శివాజీ విశాలగఢ్ చేరినట్లును, తాను ఓడిపోయినట్లును చెప్పెను. అపుడు జౌహారుకు శివాజీ పారిపోయినందుకు, దుఃఖమును తన యల్లుడైన మసూద్ శివాజీతో యుద్ధముచేసి బ్రతికి వచ్చినందుకు సంతోషమును ఒకేసారి గలిగెను. బీజపూరు సుల్తాను తనను ఏమనునో, ఏమి చేయునో యను విచారము మాత్రము ఆతనిని వీడలేదు. పనాళగఢ్ కోట ముట్టడిని మాత్రము నడిపించుచుండెను.

శివాజీ పనాళగఢ్ ముట్టడినుండి బయటకు వచ్చి, విశాలగఢమును చేరెనని, విశాలగఢ్ ముట్టడికూడ వదలి పోయినదని వార్తలు స్వరాజ్యములో అన్నిచోట్లా చేరినవి. రాజగఢమున నీ వార్తవిని జిజియాబాయి చాల సంతోషించెను. ఆ మాతృహృదయము మృత్యుముఖమునుండి వెలికివచ్చిన కుమారుడగు శివాజీని కలియవలెనని చాల ఆతురత చెందెను. అప్పటికి ఆమె శివాజీని చూచి ఒక సంవత్సరమయినది.

శివాజీకూడ తల్లిని చూడవలెనని కోరిక గలిగి యుండెను. అలసిపోయివున్న తన సైన్యమునకు విశ్రాంతి నొసగి శివాజీ రాజగఢమును చేరెను.

పనాళగఢ్‌లో ముట్టడి అలా సాగుచునే యుండెను. శివాజీ పనాళగఢ నుంచి పారిపోయెనను వార్త బీజపూర్ చేరినది. సుల్తాను చాల బాధపడెను. సిద్ది జౌహారు శివాజీని వెలికి వెళ్ళనిచ్చియుండునను సందేహము ఆతని మనమున కలిగినది. తనను మోసగించిన సిద్దికి బుద్ధి చెప్పవలెనని అతడు స్వయముగా సైన్యము తీసుకొని బయలుదేరెను.

ఇటు బీజపూరు వారితో పనాళగఢ్ వద్ద, అటు షహిస్తఖానుతో పూనావైపు యుద్ధము చేయవలసియుండుట వలన, పరిస్థితి నంతను బాగుగా పరిశీలించిన మీదట శివాజీ పనాళగఢ్‌ను సిద్దికిచ్చి రాజగఢము రమ్మనమని త్ర్యంబక పంతున కుత్తరము వ్రాసెను. శివాజీ ఆజ్ఞ ప్రకారము కోటను సిద్దికిచ్చి త్ర్యంబకపంత్ రాజగఢ్ చేరెను. బీజపూర్ నుండి బయలుదేరిన ఆదిల్‌షా సుల్తాను మీరజ్ చేరెను. అక్కడ నుండి ఒక ఉత్తరము సిద్దికి వ్రాసెను. అందు జౌహారు తనను మోసగించిన తీరు వర్ణించబడి యుండెను. ఆ వుత్తరము చూచి కోపించిన సిద్ది జౌహారు సరాసరి కర్నూలు కోటకు వెళ్ళిపోయెను. తరువాత అక్కడ సుల్తాను మోసముచేసి సిద్ది జౌహారునకు విషము నిప్పించి చంపించెను.

* * *

# షహిస్తఖాను పరాజయము

మొగలాయి సామ్రాజ్యమునకు దక్షిణ సుబేదారుగా నున్న ఔరంగజేబు 1657లో ఢిల్లీ సుల్తానగు షాజహానుకు సుస్తీ చేసినందున ఢిల్లీకి ప్రయాణమయ్యెను. అనారోగ్యముగా నున్న తండ్రికి సేవ చేయుటకు కాదు ఆతడు ప్రయాణమైనది. మహమ్మదీయ రాజవంశములలో అనారోగ్యవంతుడైన పాదుషాను అతని కుమారులు చంపియో లేక ఖైదులో పెట్టియో, సింహాసనము నెక్కెడి యలవాటు బహుళముగా ఉన్నది. ఈ పద్ధతి ప్రకారము ఔరంగజేబు ఢిల్లీకిపోయి, తండ్రిని ఖైదు చేసెను. తన సోదరులగు దారా, సుజా, మురాదులను, తదితర దగ్గిర బంధువులను, వెదకి నలుబదియైదుమందిని జంపి, తాను ఢిల్లీ సింహాసన మధిష్ఠించెను.

ఔరంగజేబు ఢిల్లీ వెళ్లు యత్నములో నున్నప్పుడే శివాజీ జున్నీరు కోట, అహమ్మదు నగరములను లూటీ చేసెను. అది తెలిసిన ఔరంజేబునకు కోపము వచ్చెను. కాని ఏమియు చేయజాలకపోయెను. క్రీ. శ. 1659లో శివాజీ

అఫజుల్‌ఖానును చంపి, బీజపూరు భూభాగమును స్వాధీనము చేసికొనినప్పుడు, బీజపూరు సుల్తాను శివాజీపైకి సిద్ది జౌహారును పంపుచూ, శివాజీపైకి సైన్యమును పంపవలసినదిగా ఔరంగజేబునకు జాబు వ్రాసెను. అట్టి అవమానమున కెదురు చూచుచున్న ఔరంగజేబు శివాజీపైకి తన సైన్యమును పంపనెంచెను. కాని ఆ సైన్యమునకు ఎవ్వరు అధిపతిగా పోవలెనను ప్రశ్న కలిగెను. ఔరంగజేబునకు మేనమామయును, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారును, శూరుడును, రాజకార్య నిపుణుడును అనుభజ్ఞుడును నగు షహిస్తఖానును ఆ సైన్యమున కధిపతిగా ఔరంగజేబు నిర్ణయించెను. లోగడ నొకసారి ఔరంగజేబును అఫజుల్‌ఖానుడు బీదరువద్ద బాధించెను. అంతటి వీరుడగు అఫజుల్‌ఖానునుగూడ శివాజీ అతి చాతుర్యముతో చంపెనని తెలిసి, ఔరంగజేబు ఎంతో లోతుగా నాలోచించి అట్టి శివాజీపైకి దండు నడుపుటకు షహిస్తఖానుడే తగినవాడని భావించెను. షహిస్తఖాను కూడ అది తనకు ఘనమైన గౌరవముగా భావించి శివాజీని నాశనము చేయుటకు సంసిద్ధుడై బయలుదేరెను.

ఔరంగాబాదు నగరమునకు వెలుపల శిబిరములు వేసికొని విడిసిన షహిస్తఖాను సైన్యము, ఒక చోట ఐదారు పట్టణములు వెలసినట్లు కనిపించుచుండెను. డెబ్బదివేదు వేల గుఱ్ఱపుదళము, ముప్పదివేల పదాతిదళము, పెద్ద ఫిరంగుదళము వీనిని నిర్వహించుట కవసరమగు మనుష్యులు, సామానులు, యివన్నియు, చూచుటకు ఒకానొక సేనాసాగరమువలె కన్పట్టెను. అప్పటికి 342 సంవత్సరముల క్రిందట అనగా క్రీ. శ. 1318లో ఒక పెద్ద సేన, అదే ప్రదేశమున విడిసి, దేవగిరి

హిందూ సింహాసనమును నాశనము చేసెను. నాటి ఆ సైన్యములో మహమ్మదీయులకు సహాయము చేయవచ్చిన హిందువు లెక్కువ సంఖ్యలో లేరు. కాని నేడుమాత్రము హిందువు లెక్కువ సంఖ్యలో షహిస్తఖాను సైన్యములో నుండిరి. కడకు శివాజీ బంధువులుకూడ తమ స్వార్థ ప్రయోజనముల నాశించి, స్వతంత్ర హిందూరాజ్య నిర్మాణమునకు వ్యతిరేకముగా పోరాడుటకు శత్రుపక్షమున చేరిరి. సర్జ్‌రావ్ ఘటగే, సూరజీ గయికవాడ్ వంటి పురుషులేగాక, వరహాడ్‌లో నున్న మహూర్ యొక్క హిందూ రాణియైన సావిత్రీబాయి కూడ షహిస్తఖాను వెంట నుండెను. ఆమె యొక్క పరాక్రమమును కర్తృత్వమును చూచి ఔరంగజేబు ఆమెకు పండిత రాయబాగాన్ అను బిరుదు నిచ్చెనట. వీరు మాత్రమేగాక శివాజీ సన్నిహిత బంధువులగు త్ర్యంబకజీరాజీ భోంస్లే జివాజీరాజీ భోంస్లే, సర్ఫోజీరాజీ భోంస్లే మొదలగువారందరు కూడ షహిస్తఖానుతో వచ్చిరి. శివాజీ బంధువులేగాక జిజియాబాయి బంధువులు కూడ వారితో నుండిరి. సింద్‌ఖేడ్ గ్రామము జిజియాబాయి పుట్టినయూరు. అచటనుండి దత్తాజీరావు జాధవ్,రుస్తుమరావు రాజీజాధవ్‌లు కూడ ఖాను సైన్యములో చేరిరి. ఇట్టి వా రెందరితోనో కూడిన గొప్పసైన్యమును వెంట నిడుకొని ఔరంగాబాదు నుండి బయలుదేరి షహిస్తఖాను అహమ్మద్‌నగర్ చేరెను (11-2-1660). అచటినుండి బయలుదేరి కొన్ని దినములు ప్రయాణముచేసి శివాజీరాజ్యములో ప్రవేశించెను(3-3-1660). ఆ రోజుననే శివాజీ యున్న పనాళగఢ కోటను సిద్ది జౌహారు ముట్టడించెను.

షహిస్తఖాను స్వరాజ్యములో ప్రవేశించి సుపే, బారామోతీ, శిరవళ వరకు జయించెను. అపుడు శివాజీ పనాళగఢములో నుండెను. శివాజీ సేనాధిపతి యగు నేతాజీ పాల్కర్ బీజపూరువైపు దండెత్తెను. జిజియాబాయి మాత్రమే రాజగఢమునందున్నది. షహిస్తఖాను ససైన్యముగా రాజగఢ్ సమీపమునకు వచ్చుటచే జిజియాబాయియే అతనిని యెదిరించవలసి వచ్చినది. ఆమెవద్ద సైన్యము చాల తక్కువగా నున్నది. మొత్తము స్వరాజ్యములోని సైన్యము కన్న పదిరెట్లు ఎక్కువగ ఉన్న శత్రుసైన్యముతో యుద్ధము చేయుటకు "వృక పద్ధతి" యుద్ధము తప్ప వేరు యుపాయము లేదు అందుచేత నామె షహిస్తఖానుపై 'వృక' పద్ధతిలో దెబ్బదీయుచూ బాధించుచుండెను. ఇట్టి హిందూ సైనికులను సంహరించుటకై షరజాఖాను, షంసద్దీన్‌ఖాను, రావు భావసింహులను షహిస్తఖానుడు పంపించెను. కాని వారికి స్వాతంత్ర్య సైనికు డొక్కడు కూడ చిక్కలేదు. ఎలుకలు బోనులోనికి వచ్చుట లేదు కాని, వానికి ఎఱగా పెట్టిన పదార్థములను హరించి కొనిపోయినవి. వారు షహిస్తఖాను సైన్యమును మాత్రము దొంగచాటుగా నాశనము చేయుచు ననేక తిప్పలు పెట్టుచుండిరి. పెద్ద సైన్యముతో వచ్చిన ఖానునకు ఈ నష్టము లెక్కకు రాలేదు.

షహిస్తఖాను శిరవళనుండి సాసవడ్ మీదుగా పూనా చేరెను. పూనాలో శివాజీ యొక్క లాల్ మహల్‌లోనే అతడు బసచేసెను. ఆ భవనమున హిందూ సంప్రదాయము ననుసరించి జరుగు దేవతార్చనాదులకు బదులుగా నాటి నుండి గో మాంసమును వండుట ఆరంభమాయెను. అచటకు

పదునెనిమిది మైళ్ళదూరమున నున్న చాకోణ (సంగ్రామ) దుర్గమును జయించుటకు ఖాను నిర్ణయించుకొనెను. ఖాను శిరవళ చేరినపుడు, శిరవళనుండి జిజియామాత యున్న రాజగఢ యిరువది మైళ్ళదూరమున మాత్రమే యున్నది. అచట సైన్యము తక్కువగా నున్నదని తెలిసినను, పర్వత ప్రదేశమనిన భయ ముండుటచేతనే ఖాను దానిపైకి దాడి పోకుండ సమతలప్రదేశముననున్న, చాకణ దుర్గమునుజయించి పూనా నుంచి గులశనాబాద్ (నాసిక్, నకు పోవుదారిలో నెట్టి యడ్డులేకుండా చేయవలయునని భావించెను. చాకణ దుర్గమును గుఱించి అతని కందిన సమాచారమునుబట్టి, తన సైన్యము వెళ్ళిన వెంటనే ఆ కోటను వశపరచుకొనవచ్చునని ఖాను తలంచెను. రాబోవునది వర్షాకాల మగుటచే నా సమయమున యుద్ధము జరుపవలదని యాతడనుకొనెను. కాని ఆ సమయముననే సిద్ది జౌహార్ పనాళగఢ కోట ముట్టడిని కొనసాగించుచుండగా, తా నేమియు చేయకుండ నున్నచో, ఔరంగజేబు అన్యథా భావించవచ్చునని యెంచిన షహిస్త ఖాను, ఆ సమయముననే చాకణ కోటపైకి సైన్యమును బంప వలెనని నిర్ణయించెను. ఆ నిర్ణయానుసారము మృగశిరా నక్షత్ర ప్రారంభ సమయమున ఖాను సైన్యము చాకణ కోటపైకి బయలుదేరెను.

చాకణకోట చాల చిన్నది. కోట యనుటకంటె ఒక పెద్ద లోగిలియని దానిని పిలువవచ్చును. ఇంటి గోడలవలె, సమతల భూభాగమున ఎత్తైన గోడలతో కట్టబడినది. ఖాను సైన్యము దానిని చేరిన వెంటనే ముట్టడించెను. కోటలో నున్న సైనికులు కొద్దిమందియైనను, అతి సావధానులై

యుండిరి. ఖానుసైన్య మూహించని రీతిగా కోటలో నుండి ఫిరంగికాల్పులు రా సాగినవి. అయినను ఖాను సైన్యము కోటకు నలుప్రక్కల క్రమ్మినది. ఇరువైపులనుండి ఫిరంగులు కాలుచునే యున్నవి. ఖాను సైన్యము ఎంత ధాటిగా దాడి చేసిననూ, దానికి సమాధానము అంత తీవ్రముగా కోటనుండి వచ్చుచున్నది. గంటలలో గెలుతుమని యెంచినకోట రోజులు గడిచినను ఖానువశము కాలేదు. జూన్ 21వ తేదీన షహిస్త ఖాను చాకణను ముట్టడించెను. నాటికిరువది యొకటవరోజున శివాజీ పనాళగఢ్ నుంచి పారిపోయెననువార్త ఖానుకు చేరెను. కాని చాకణకోట మాత్రము స్వాధీనము కాలేదు. ఖాను చివరకు ఒకయుక్తి బన్నెను. తన శిబిరమునుండి కోటగోడ వరకు సొరంగమును త్రవ్వించి, కోటగోడ క్రింద, మందు సామానులుంచి, ముట్టడి మొదలైన 55వ రోజున ప్రాకారము లను ప్రేల్పించెను (15-8-1660). కోటగోడలు పేకమేడల వలె గాలిలో ఎగిరెను. దానిపైనున్న సైనికులందరు చని పోయిరి. లోపలనున్న మిగతా సైనికుల కసలేమి జరిగినదో బోధపడలేదు. పగిలిన గోడల సందులనుండి ఖాను సైనికులు లోనికివచ్చుట చూచి, దిగ్భ్రాంతి నుండి తేరుకొని, వారం దరు శత్రువుల నెదుర్కొనిరి. కోటలో నున్నవారు మూడు వందల ఏబదిమంది మాత్రమే. వారిలో కొందరు పగిలిన గోడలక్రిందబడి మరణించిరి. మిగిలిన కొద్దిమంది ఖాను సైని కుల నెదిర్చిరి. కోటలోనుండి రోజులుతరబడి యుద్ధము చేయ గల్గినవారు ముఖాముఖి యుద్ధములో శత్రువుల ధాటికి ఆగలేక పోయిరి. మరుసటి దినమున, మిగిలిన కొద్దిమంది మాత్రము కోటను షహిస్తఖాను స్వాధీనముచేసి వెళ్ళిపోయిరి.

ఈ విజయవార్తను ఖాను ఔరంగజేబునకు పంపెను. ఇది విని సంతోషపడిన ఔరంగజేబు షహిస్తఖానుకు అదనపుబలమును తోడుగా బంపెను. పిమ్మట వర్షాకాలము గతించు నంతవరకు షహిస్తఖాను మిన్నకుండెను.

వర్షాకాలము గడిచినపిమ్మట షహిస్తఖాను తన సహచరులలో నొకడగు కారతలబ్ ఖానును బీజపూరువారి అధీనములో నున్న పరిండాకోటను జయించుటకు పంపెను. ఆ కోటకు అధిపతిగానున్న ఘూలీబ్ మొగలు దర్బారులో కొలువున కొప్పుకొని యుద్ధముచేయ నవసరము లేకుండగనే. కోటను కారతలబ్ ఖానున కప్పగించెను. ఈ విధముగా శివాజీని నాశనము చేయుటకై, బీజపూరు సుల్తానుచే నాహ్వానింపబడిన ఔరంగజేబు సైన్యము, బీజపూరునే క్రమింకుట కారంభించెను.

తరువాత కొన్ని దినములకు ఖాను మరల పూనాకు వచ్చెను. కొండ కోటల నాక్రమించుట కన్న కొంకణ భాగమున నున్న చౌల్, కల్యాణి, భివండీలను జయించుట మంచిదని షహిస్తఖాను భావించెను. ఆ పనిని కూడ కారతలబ్ ఖానున కప్పగించెను. తనపై నంత బాధ్యత నుంచినందులకు అతడును చాల సంతోషించెను. అతడు గొప్ప పరాక్రమవంతుడు. ఔరంగజేబు దక్షిణ ప్రాంత సుబేదారుగా నున్న నాటినుంచి కారతలబ్ ఖాను దక్షిణ భారతముననే యుండెను. కాని కొండల ప్రదేశములో నాతని కెప్పుడును పరిచయములేదు. అతని వెంట షహిస్తఖాను ముప్పదివేల సైన్యమునిచ్చి పంపెను.

కారతలబ్ ఖాను పూనానుంచి బయలుదేరి చించవడ, తాళేగవ, వడగవ మీదుగా మాళవళి చేరెను. ఇచ్చటి నుండి లోహాగడ ప్రక్కనుంచి పోయి తుంగారణ్యములో ప్రవేశించి కొంకణ చేరవలెనని యాతని యుద్దేశము. గూఢ చారులద్వారా యీవార్త నెఱిగిన శివాజీ, కారతలబ్ ఖాను తుంగారణ్యమును చేరకముందే ఆ అరణ్యమును చుట్టియున్న స్థలములలో దాగుకొని సూచన లందినవెంటనే, ఖానుపై దాడి చేయునట్లు తన సైనికుల నేర్పరచెను. ఖాను సైన్యము నకు ఆ పర్వత ప్రదేశమున పయనించుట విసుగు కలిగించినది. ఈ అడవులలో ప్రయాణము చేయుట ప్రమాదమేమో యని రాయబగన్ సంశయించినది. ఖాను మాత్రము తుంగారణ్యములో కొంత సమయము విశ్రాంతి తీసుకొని ముందుకు వెళ్ళవలెనని నిశ్చయించెను. లోహాగడ దుర్గము ప్రక్క నుంచి వారి సైన్యము వెళ్లుచుండగా, దానిలోనున్న శివాజీ సైన్యము మిన్నకుండినది. తుంగారణ్యములోనికి కారతలబ్ ఖాను మొత్తము సైన్యముతో చేరినవెంటనే నలుదిక్కుల భేరీలు మ్రోగినవి. నాలుగువైపులనుంచి శివాజీ సైనికులు ఖాను సైన్యముపై బడి నరకుట కారంభించిరి. ఈ మనోహర దృశ్యమును శివాజీ దూరమున నున్న ఒక కొండపైనుండి చూచుచుండెను. పర్వతములకు, అడవులకు అలవాటుపడని ఖాను సైనికులు, తమ నాయకు డెంత ప్రోత్సాహము నిచ్చి నను శివాజీ సైనికుల తాకిడిని తట్టుకొనలేక చనిపోవుచుండిరి. ఇది చూచిన రాయబగన్ "శివాజీ యొక్క అడవులలోనికి సైన్యము నడిపించుట మీ పొరపాటు ఈ పరాజయము పాదుషా అలంఘీర్ కీర్తికి మచ్చవంటిది. ఇప్పుడు వేరు

మార్గము లేదు గాన మీరు పోయి శివాజీని ప్రాణదాన మర్థించుడు. ఆతడు తప్పక అంగీకరించి మనల నందరిని కాపాడగలడు'' అని కారతలబ్ ఖానునకు సలహా నొసంగెను. వేరు మార్గములేక, ఖాను తన రాయబారి నొకనిని శివాజీ యొద్దకు పంపెను. శివాజీ ఖానువద్దనుండి చాల ధనమును తీసుకొని ఆతని సైన్యమును తుంగారణ్యమునుండి వెలికి పోనిచ్చెను (1661). బరువుగల సామాను లన్నియు ఖాను సైనికులు ఆ అడవియందే వదలిపోయిరి. వారి ధనముతో పాటు ఆ సామానులుగూడ శివాజీకి లభించినవి. ఉత్తర కొంకణమును జయించుట ఖానునకు సాధ్యము కాలేదు.

తుంగారణ్యమునకు దగ్గరలో, తుంగా, లోహగడ యను దుర్గములున్నవి. వానిపైకి మరల మొగలాయి సైన్యము రావచ్చునని భావించిన శివాజీ, వాని రక్షణకొరకు నేతాజీ పాల్కరు నచ్చటనే యుంచెను. తాను దక్షిణ కొంకణమును జయించుటకు వెళ్లెను. దాబ్ ళీ, సంగమేశ్వర్, దేవరుఖ్ లను జయించి యాతడు రాజాపూర్ చేరెను. అచ్చటనున్న ఆంగ్లేయులేలోగడ పనాల్ గఢముట్టడిలో శివాజీపై కిఫిరంగులను పేల్చినది. వారిని నేడు శివాజీ పూర్తిగా లూటీచేసెను. అట్లే విశాలగఢ వద్ద మహమ్మదీయుల పక్షమున నిలచి తనతో యుద్ధము చేసిన సూర్యరావు సూరవే, జస్వంతరావు పావణీకర్ ల జాగీర్లను కూడా శివాజీ స్వాధీనము చేసుకొనెను. అప్పటికి షహిస్తఖాను యొక్క వేరొక సరదారుడగు నామధార్ ఖాన్, కల్యాణీ ప్రాంతమునకు వేరొక మార్గమున వచ్చి విడిసియున్నందున శివాజీ దక్షిణ కొంకణమును వదలి రాజగఢ చేరుకొనెను.

అచటనుండి ప్రతాపగడ్ చేరి దానిపై భవానీదేవి యొక్క ప్రాణప్రతిష్ఠ నొనర్చి మందిరము కట్టించెను. పిమ్మట పేణ్ వద్ద మీరాష్యా గుట్టపైనున్న నామదార్ ఖానును శివాజీ ఓడించెను.

శివాజీపైకి పోయిన షహిస్తఖాను సరదారు లిద్దరు ఓడిపోయి తిరిగి వచ్చిరి. శివాజీ వద్దనుండి చాకణకోట నొకదానిని మాత్రము షహిస్తఖాను జయించగలిగెను, వేరొక కోటదరికి చేరకముందే సేనాపతులగు ఖానులిద్దరు ఓడింపబడిరి. నేతాజీ పాల్కర్ వృకయుద్ధ పద్ధతిలో షహిస్తఖానును బాధించుచుండెను. నేతాజీని బంధించుటకై షహిస్తఖాను పదునెనిమిదిమంది సరదారులను బంపెనుగాని, నేతాజీ వారికి చిక్కలేదు. ఎటుచూచినను షహిస్తఖానునకు పరాజయమే ఎదురగుచుండెను. అయినను శివాజీకి మాత్రము సంతోషము లేదు. అప్పటికి షహిస్తఖాను స్వరాజ్యములో ప్రవేసించి రెండు సంవత్సములైనది. నాటినుండి నేటివరకు షహిస్తఖాను తనవెంట వచ్చిన పెద్ద సైన్యముయొక్క పోషణ వ్యయమంతయు, శివాజీయొక్క ప్రజలనుండియే సంపాదించుచుండెను. ప్రజలకు సుఖశాంతులు లేవు. అంతేగాక స్వరాజ్య విస్తరణకు కూడ ఖాను యొక్క యునికి అడ్డుగా నున్నది. అందుచే శివాజీ, ఎట్లయిననూ షహిస్తఖానును స్వరాజ్యమునుండి వెలికి పంపితీరవలెనని నిశ్చయించెను. అంత పెద్ద సైన్యముతో వచ్చిన షహిస్తఖానును ఓడించుటకు సాధ్యముకాదు. ఓడించకుండా నతనిని వెళ్ళగొట్టుట అసంభవము. అందుచే శివాజీ ఒక పథకమును వేసెను. అకస్మాత్తుగా పూనాలోని లాల్ మహాలును ప్రవేశించి షహిస్త

ఖానును చంపవలెనని, అప్పుడు తప్పక ఖాను సైన్యము స్వరాజ్యము వీడిపోగలదని యోచించెను. కాని అది ఆచరణ సాధ్యమా? లాల్‌మహల్‌చుట్టూ నెల్లప్పుడు డెబ్బదియైదు వేల సైన్యముతో, అరువది ఆరుగురు సరదారులు అతి మెళకువతో కాపలా కాయుచుండిరి. అట్టి రక్షణవ్యవస్థను దాటి పోవుట యెట్లు? వెళ్ళగలిగినచో పని పూర్తిచేసుకొని రాగలుగుట ఎట్లు? అన్నియు చిక్కుప్రశ్నలే? కాని శివాజీకి అవి అంత గడ్డు ప్రశ్నలుగా తోచలేదు. శివాజీకి పథకము తయారు చేయుటలో నేర్పుగలదు. చిన్న చిన్న వివరములను గూడ శ్రద్ధతో నాలోచించుట యాతని ప్రత్యేకత. పథకము ప్రకారము పనిచేయుట కలవాటుపడిన మనుష్యులుగూడ నాతనివద్ద గలరు. కార్య నిర్వహణలో వారు తమ ప్రాణములనైన నర్పింతురు. అట్టివారి నెందరినో దరిచేర్చి తన సంఘటనా కుశలతతో వారికి చక్కని శిక్షణనిచ్చి, చక్కని దేశ భక్తులుగా శివాజీ రూపొందించెను. వారిలో ప్రతి ఒక్కరినీ పరిశీలించి వారిలోనున్న గుణావగుణములను గ్రహించి వారికి తగిన పని వప్పగింపబడుచుండుటచేతనే శివాజీ పథకము లన్నియు విజయవంతము లయ్యెడివి. మానవ యత్నము, యోచన నిర్వహణా నైపుణ్యములు లేకుండగా, దైవానుగ్రహమువలన లభించెడి విజయము శివాజీకి మనస్కరించెడిది కాదు.

పథకము తయారయినది. షహిస్తఖానును చంపుటకు ముహూర్తము కూడ నిశ్చయమైనది. చైత్ర శుద్ధ అష్టమి అర్ధరాత్రి పండ్రెండు గంటలకు అనగా శ్రీరామచంద్రుని జన్మదినమున (6-4-1663) ఖానును సంహరించవలెను.

ఆరోజు సాయంకాలమునందు శివాజీ మహారాజు, నేతాజీ, మోరోపంతులు వెంటరాగా రెండువేల సైన్యముతో రాజగఢ కోటనుండి క్రిందకు దిగివచ్చెను. ఆ రెండువేలమందిలోను యెంచి నాలుగువందలమందిని తన వెంట గొనిపోవుటకై వేరుగా నుంచి, మిగిలినవారిని రెండు భాగములుచేసి వారిని మోరోపంత్, నేతాజీ పాల్కరుల కప్పగించెను.

మహారాజుతో బాబాజీ, చిమణాజీ దేశపాండే లను యిద్దరన్నదమ్ములు వుండిరి. వీరందరు కలిసి గుఱ్ఱములపై పూనా నగరమునకు బయట నొక మైలు దూరమున నున్న మైదానములోనికి చేరిరి. అంతకుముందే శివాజీ షహిస్తఖాను యొక్క శిబిరమునకు సంబంధించిన వివరములను గూఢచారుల ద్వారా సేకరించెను. అది రంజాను మాసము, అది చంద్రుని ఆరవ రోజు. ఆ నెలపొడవునను మహమ్మదీయులు పగలెల్ల నుపవాస ముండి సూర్యాస్తమయము తర్వాత, మరల సూర్యోదయమునకు ముందు భోజనము చేతురు. అందుచే రాత్రికి కడుపునిండ భుజించి గాఢనిద్ర పోయెదరు. ఇది తెలిసికొనియే శివాజీ ఆనోజున ముహూర్తము పెట్టెను.

పథకము ననుసరించి నేతాజీ, మోరోపంతులు మైదానములోనే ఆగిపోయిరి. వేరు వేరు అర్థములను సూచించు సంకేతములను ఒసంగుటకై భేరీ వాదకులను ఆయా ప్రదేశములలో నుంచిరి. శివాజీ ఖానును చంపి తిరిగి వచ్చిన వెంటనే సింహగఢకు వెళ్ళవలయును. అందులకై సర్జేరావు ఒక ప్రత్యేకమైన స్థలమునందు నొక గుఱ్ఱముతో నెదురు చూచుచుండవలెను. శివాజీ దానిని అధిరోహించి సింహగఢకు

పోవలెను. బాబాజీ, చిమణాజీలు చిన్నప్పటినుండి లాల్ మహాలు నందుండినవారు. అందుచే వారు లాల్ మహాలు యొక్క ఆనుపానులన్నియు బాగుగా నెరుంగుదురు కావున శివాజీ తనవెంట చిమణాజీని మరి రెండువందలమంది సైనికులను తీసికొని మిగిలిన రెండువందలమందినీ బాబాజీకి నప్పగించెను. మైదానమునుండి ఆ రెండు దళములు పూనాకు బయలుదేరినవి. అప్పటికి మధ్యరాత్రి గడచెను. రక్షకులు మాత్రమే మేలుకొని తమ పనులలో నిమగ్నులై యుండిరి. మహారాజు దళము ముందు, దానివెనుక బాబాజీ దళములు ఒకదానితో మరియొకదానికి ఎట్టి సంబంధము లేనట్లు నటించుచూ ముందుకు పోసాగినవి. ఎవ్వరికిగాని ఏవిధమైన సంశయము కలుగనీయకుండా, నిర్భయముగా వారునడచుచుండిరి. ఖాను శిబిరమునకు బయట కాపలాయున్న సైనికులు వీరి నాపి ఎవరు మీరని ప్రశ్నించిరి. మేము కటక్ సైన్యములోని వారము. ఈ శిబిరములోనే వుందుము. ఛబన రక్షణ పనికిపోయి తిరిగి వచ్చుచుంటిమని వారు తిరిగి బదులు పలికిరి. ఛబనరక్షణ పని అనగా సైనిక శిబిరమునకు బయట కొన్ని మైళ్ళ దూరమువరకు, రాత్రి సమయమున పోయి పరిస్థితి నంతయు పరిశీలించి వచ్చుట. వేరువేరు దళములను వంతుల ప్రకారము యీ విధముగా నన్ని దిక్కులకు పంపు నలవాటు షహిస్తఖాను శిబిరమున గలదు. అడిగిన రక్షకులందరికీ యీ విధముగనే చెప్పుచూ ఆ రెండుదళములు శిబిరములోనికి ప్రవేశించినవి. వారు చెప్పినది నిజమనియే యందరు విశ్వసించిరి. ఖాను సైన్యములో చాలమంది హిందూ సర్దారులకు ఇట్టి బాధ్యత నొసంగు పద్ధతి కలదు. అందుచే శివాజీ సైని

కులను ప్రత్యేకముగా నెవరును గుర్తించుట జరుగలేదు. మొదటి రక్షకుడు వదలిన తరువాత మిగిలిన రక్షకుల కంతటి సంశయము కలుగుట కవకాశములేదు. రక్షకుల నందరినీ దాటిన తరువాత ఆ దళములు రెండు చిన్నచిన్న జట్లుగా విడిపోయి లాల్ మహల్ దగ్గరకు చేరుకొనెను.

లాల్ మహల్ నందు వంటశాల, నీటిగది కలిసి యుండెను. వంటశాలనుండి జనాన్ ఖానా (ప్రత్యేకించి స్త్రీలకొరకు యివ్వబడిన గది, లోనికి ఒక చిన్న ద్వార మున్నది. ఖాను లాల్ మహల్ ప్రవేశించిన వెంటనే ఆ ద్వారమును ఇటుకలతో మూయించెను. లాల్ మహల్ వెనుక ప్రక్కన వంటశాలలోనికి పోవు నొక ద్వారమున్నది. నీటి గృహములో నీరు నింపు వారీ ద్వారమును ఉపయో గింతురు. ఆ ద్వారముగుండానే శివాజీ తన సైన్యముతో బాటు వంటశాలలో ప్రవేశించెను. అపుడు కటిక చీకటిగా నుండెను. చీకటిలోని నీడవలె వారు ముందుకు సాగిరి. వంటశాలలోనుండి గిన్నెల శబ్దములు, వంటవారి మాటలు వినిపించుచుండెను. సూర్యోదయమునకు ముందే భోజనములు కావలెను గనుక వంటపనివారప్పుడే తమ పని ప్రారంభించిరి. ఖాను నిద్రించెడి గదిని చేరుటకు మహారాజు తన పథకము ప్రకారము యీ వంటశాలనుండియే పోవలెను. అందుచేత కొందరు సైనికులు వంటశాలలో ప్రవేశించి అచట వంటపని చేయుచున్నవారిని, పడుకొని నిద్ర పోవుచున్నవారినిగూడ, నోటినుండి ఏ శబ్దము రాకముందే చంపివేసిరి. తరువాత జనాన్ ఖానా లోనికి పోవు చిన్న ద్వారమును మూసియుంచిన

యిటుకలను ఆ సైనికులు మెల్లగా నూడదీయుట కారంభించిరి. వంటశాల గోడకు అటువైపున సైనికు డొకడు నిద్రించుచుండెను. వంటశాలనుండి శబ్దములు వినిపించగా నాతడు సరాసరి ఖాను వద్దకు పోయి నిద్రలేపి ఆ విషయము తెలిపెను. మంచి నిద్ర భంగమై విసుగునొందిన షహిస్తఖాను 'వంటశాలలో వంటవారు పనిచేయుచుందురు, లేకున్న ఎలుకలు శబ్దము చేయుచుండును. ఈ మాత్రమునకు భయపడి నా నిద్రను పాడు చేసినా' వని వానికి చీవాట్లు పెట్టి మరల నిద్ర కుపక్రమించెను. సేవకుడు అంతటితో మిన్నకుండెను. జనాన్ ఖానా లోనికి పోవు ద్వారమువద్ద నున్న ఇటుక లన్నియు మెల్లగా తొలగింపబడెను. పిమ్మట నా ద్వారమును తెరచి లోనికి ప్రవేశించిన మొదటివాడు చిమణాజీ. తరువాత శివాజీ ప్రవేశించెను. అటుపిమ్మట నొకరి తరువాత నొకరుగా అందరూ లోన ప్రవేశించిరి. లోపలకు వచ్చిన తరువాత వారందరూ లాల్ మహలు నంపంతటనూ వ్యాపించిరి. రక్షకులుగాని తదితరులెవరైన గాని తమను చూచిన వారి నెల్ల సంహరించిరి. అప్పటికి ఖాను సేవకులలో కొందరకు మెలుకువ వచ్చి పరిస్థితిని గ్రహించి ఖాను వద్దకుపోయి "మోసము జరిగినది. శత్రువులెవరో లోన ప్రవేశించి"రని చెప్పిరి. అంతలోనే అన్నివైపులనుండి అరుపులు, కేకలు, ఏడ్పులు ఆరంభమాయెను. వెంటనే ఖానులేచి ధనుర్బాణములను, శూలమును తీసుకొని యుద్ధమునకు బయలుదేరెను. తన కగుపించిన యొక హిందూ సైనికునిపైకి బాణము వేసెను. ఆ సైనికుడు బాణపు దెబ్బను తప్పించుకొని ఖాను పైకి దుమికెను. అచటనున్న కొందరు స్త్రీలు అది చూచి

దీపముల నారిపి ఖాను నచటనుండి తప్పించి, ప్రక్కకు తీసుకొని పోయిరి. ఎటుచూచినా యంధకారమే. స్వరాజ్య సైనికులు ప్రాణములకు తెగించి కత్తులు త్రిప్పసాగిరి. చంపెడివారెవరో చచ్చెడి వారెవరో ఎవరికిని తెలియకుండ మరణించుచుండిరి మనిషికి మనిషి కనిపించుటలేదు. అప్పటికి బాబాజీదేశపాండే కూడ తన దళములతో లోన ప్రవేశించెను. రక్షకులు వారి నడ్డుకొని యుద్ధ మారంభించిరి. 'దొంగలు లోనికిదూరినా'రని చెప్పుచూ శివాజీ సైనికులు ఖాను సైనికులను చంపసాగిరి. లాల్ మహలంతయు రక్తపు ధారలతో, భయంకర కోలాహలముతో నిండిపోయెను. నగార్ ఖానా (ఢంకాలు పెట్టు స్థలము)ను చేరిన స్వరాజ్య సైనికులు, ఖాను నగారాను మ్రోగించిరి. ఢంకాశబ్దము విని శిబిరములోనున్న సైనికులందరూ లాల్ మహల్ చుట్టునూ చేరిరి. తలుపులన్నియు లోపలనుండి మూయబడి యుండెను. లోనివారందరు ఎవరు మిత్రుడో, ఎవరు శత్రువో తెలికుండ నరకుకొన సాగిరి. ఈ గందరగోళమునకు మేల్కొనిన ఖానుయొక్క కుమారుడగు ఫతేఖాను వెలికివచ్చి యుద్ధముచేయుచు స్వరాజ్య సైనికులచే నరుకబడెను. షహిస్తఖానును అతని జనానాలోని స్త్రీలు పరదాలున్న యొక గదిలోనికి గొనిపోయిరి. అది గుర్తించిన శివాజీ, పరదాలను చించి స్వయముగా లోన ప్రవేశించెను. ఆ చీకటిలో నెవరో లోనికి ప్రవేశించుట చూచిన షహిస్తఖాను ఖడ్గమును ధరించి వాని నెదిరించబోయెను. లోనికివచ్చిన శివాజీ తనఖడ్గముతో ఖానుపై నొక వ్రేటు వేసెను. ఆ దెబ్బకు ఖాను గావుకేక పెట్టెను. ఖాను చనిపోయెనని శివాజీ భావించి వెంటనే వెలికి పోయెను.

లాల్‌మహాల్ బయట నున్న గోడకు వెలుపలినుంచి నిచ్చెనలు వేసి కొందరు లోనికి దూకిరి. దూకినవారు దూకినట్లు చంపబడిరి. లోపల నున్న హిందూ సైనికులు శత్రువు వచ్చుచున్నాడని అరచుట మొదలుపెట్టిరి. బయట నున్న సైనికులు కూడా నట్లే అరచుచుండిరి. ఇంతలో నెవరో లాల్‌మహాల్ తలుపులు తెరచిరి. బయటనుండి లోనికి వచ్చు వారినే శత్రువులుగా లోపలివారు భావించి చంపుచుండిరి. లోనివారే శత్రువులని బయటనుండి వచ్చినవారు వారిని చంప సాగిరి. ఇట్లు పరస్పరము ఖాను సైన్యమే చంపుకొనుచుండెను. ఇదే యదనుగా తీసుకొని శివాజీ తన సైనికులతో శిబిరము నుండి వెలికి చేరెను. లాల్‌మహాలంతయు నేడ్పులతో ప్రతిధ్వనించుచుండెను.

లాల్‌మహాలులో ఖానుకు సంబంధించిన వారనేకులు మరణించిరి. వారిలో ఖాన్‌కుమారుడు, అల్లుళ్ళు, సైన్యాధికారులు, 12 మంది స్త్రీలు కూడా కలరు. ఖాను భార్యయొక్క శరీరము ముక్కలు ముక్కలుగా నాయెను. ఆ ముక్కలన్నిటిని ఒక మూటగాగట్టి వానికి అంత్యక్రియలు జరుపబడెను. హిందూవీరులు స్త్రీలపై దురాచారములను యెన్నడును చేయరు. కాని ఆనాడు చీకటిగానుండుటచే, గుర్తించలేని స్థితిలో కొందరు స్త్రీలు చంపబడిరి. అందుచేత నది నేరము కానేరదని ఔరంగజేబు యొక్క తవారీఖనవస్ హాసమ్ ఆల్ ఖాను ఒకచోట వ్రాసెను. చనిపోయిన వారిలో నేబదియైదు మంది ముఖ్యులు; మిగిలినవారి సంఖ్యకు లెక్క లేదు. శివాజీ సైనికులు ఆరుగురు చనిపోయిరి. నలుబదిమందికి గాయములైనవి.

ఇది యంతయు ఖానున కవమానముగా నాయెను. ఈ దుర్ఘటనలో నాతడు చనిపోయినచో బాధ యుండెడిది కాదు. కాని చావకుండ, కుడిచేతి మూడు వ్రేళ్లు నరుకబడి జీవితాంతము ఆ అవమానమును గుర్తుచేయుచున్నట్లుండెను. శివాజీ ఎట్లు వచ్చెనో, యెటుపోయెనో యెంత చర్చించినను ఎవరికిని బోధపడలేదు శివాజీ తన సైన్యము విడిసియున్న మైదానమును చేరి యచటనుండి సింహగఢమునకు పోయి ఆ మరుసటిరోజే యటనుండి రాయగఢ్ వెళ్ళెను. ఖాను చంపబడెనని శివాజీ భావించెను. కాని మధ్యాహ్నమగుసరికి గూఢచారివచ్చి ఖాను చంపబడలేదనియూ, కుడిచేతి మూడు వ్రేళ్ళు మాత్రము నరుకబడినవనియూ, మిగిలిన వారనేకులు చచ్చిరనియు, భయపడిన ఖాను పూనాను వీడిపోవుటకు యోచించుచున్నాడనియు తెలిపెను. అది విని శివాజీ తన యత్నము విఫలమైనందులకు దుఃఖించెను. కాని తన పథకము పూర్తిగా విఫలము కాక, ఖానును పూనానుండి వెలికి పంపివేయుటలో సఫలమైనందుకు మాత్ర మానందించెను. తన కుమారుని పరాక్రమమునకు జిజియాబాయి ఎంతో సంతసపడెను.

తరువాత కొలది రోజులకే, భయపడిన షహిస్తఖాను తన సైన్యమునంతకూ, జస్వంతసింగు నధిపతిగాచేసి, శివాజీతో పోరాడుమని యాజ్ఞాపించి పూనానుండి బయలుదేరెను. (8-4-1663).

అప్పుడు ఢిల్లీలో నెండ లధికముగా నున్నందున శీతల విడిదికై కాశ్మీరమునకు పోవుచు, మార్గమధ్యమున, నౌరంగ జేబు తన మామయగు షహిస్తఖానుని పరాజయవార్తను వినెను. కోపోద్రిక్తుడైన యౌరంగజేబు వెంటనే షహిస్త ఖానును బెంగాలుకు సుబేదారుగా బదిలీ చేసినట్లున్న ఆజ్ఞా పత్రమును వ్రాయించి పంపెను.

* * *

# ఎత్తుకు పై యెత్తు

ఔరంగజేబుయొక్క సరదారులగు కారతలబ్ ఖాను, నామదర్ ఖాను, ఇనాయత్ ఖాను, షహిస్తఖాను, భావ సింహ హాడా జస్వంతసింహ రాథోడ్ మొదలగు వారందరిని శివాజీ ఓడించెను. తొలుత జున్నర్, అహమ్మద్ నగర్, పిమ్మట సూరత్ నగరాలను శివాజీ లూటీ చేసెను. ఇందుచే శివాజీపై ఔరంగజేబునకు కోప మధికమాయెను. కాని స్వయముగా తానే శివాజీపైకి దండెత్త తలచలేదు. అఫజుల్ ఖాన్, షహిస్తఖానులవలె తనకుకూడ నేదైన జరిగినచో తలవంపులే కాక, ఢిల్లీ సింహాసనమునకు కూడ ముప్పు వాటిల్లవచ్చునని భావించినందున, అంతటి సాహసమును జేయలేదు. అందుచేత, తనవద్దనున్న వీరులలో నెవడు శివాజీకి భయపడి పారిపోడో, ఎవడు అతనిని జయించగలడో, అట్టివానికై ఔరంగజేబు వెదకుచుండెను. తుదకు అతనికి మీర్జా రాజా జయసింగ్ పేరు స్ఫురణకు వచ్చెను. జయసింగు అనుభవజ్ఞుడు, ప్రౌఢుడు గంభీరుడు, శూరుడు. అంతేగాక అంతవరకెన్నడును, అపజయ మన్నది ఎరుగనివాడు. అట్టి జయసింగే ఈ పనికి అర్హుడని యెంచి శివాజీపైకి అతనిని బంప నిశ్చయించెను.

ఔరంగజేబు హిందువులతో యుద్ధము చేయుటకు తనవద్ద నున్న హిందూసర్దారు నెన్నడును ఒంటరిగా పంపలేదు. హిందువు హిందువుతో కలియవచ్చునని అతని భయము. అందుచేత శివాజీపైకి జయసింహునితో బాటు తనకు విశ్వాస పాత్రుడగు దిలేర్‌ఖానును జోడించి పెద్ద సైన్యమునిచ్చి పంపెను.

జయసింహుడు కచ్‌వాయి రాజు. ఈతడు శ్రీరామ చంద్రుని పుత్త్రుడగు కుశకుమారుని వంశీయు డందురు. అట్టివాడు శివాజీ స్థాపించిన హిందూరాజ్యమును నాశనము జేసి దేశమునంతనూ మహమ్మదీయుల జేతికి వప్పగించుటకు ఆనాడు బయలుదేరెను. విగ్రహ విధ్వంసకులగు మహమ్మదీయుల ప్రభువగు ఔరంగజేబునకు తనద్వారా విజయము కలుగజేయుటకొరకు, జయసింహుడు తాను బయలుదేరుటకు ముందు దేవీ ప్రయోగానుష్ఠానము, కోటి చండీ హోమము, ఏకాదశ కోటి లింగార్చనముల నాచరించి, శివాజీపై విజయము సాధించు వరమునిమ్మని పరమేశ్వరుని ప్రార్థించెను. అట్టి దేవతల మందిరముల నెన్నిటినో నేలగూల్చిన ఔరంగజేబునకు నమ్మినబంటగు సర్దారుడతడు. వ్యక్తిగత శీలముండి రాష్ట్రీయశీలము లేని తెగకు అతడు ఉదాహరణీయుడుగా చరిత్ర కెక్కినాడు.

ఢిల్లీ నుండి బయలుదేరిన జయసింహ, దిలేర్‌ఖానులు కొద్దికాలములో మొగలాయి దక్షిణ సుబేదారుడగు మువజ్జముతో కలిసిరి. వెంటనే జయసింహుడు శివాజీ శత్రువుల నందరిని తన పక్షమున జేర్చుకొను నాలోచనతో

చంద్రరావు మోరే బంధువులకు, అఫజుల్‌ఖాన్ కుమారుడగు ఫాజల్‌ఖానునకు జాబులు వ్రాసెను. తదితరులకు గూడ జయసింహుడు జాబులు వ్రాసెను. ఇట్లు బహుముఖములుగా యుద్ధసన్నాహములు జరుపుచుండెను. కాని జయసింహునికి దిలేర్‌ఖాన్‌కు అభిప్రాయ భేదములు మొదటినుండి ఏర్పడెను. కొండకోటలు జయించుటకన్న సమతల ప్రదేశమును జయించుట మంచిదని జయసింహుని భావన. కొండకోటలనే ముందు జయించవలెనని దిలేరుఖాను పట్టుదల. జయసింహు డెంతటి ప్రముఖ సేనాధిపతి యైననూ, మహమ్మదీయుడైన కారణమున దిలేరుఖానుపైన ఔరంగజేబునకు అభిమానము మెండు. ఈవిషయము జయసింహునకు తెలియును. అందుచే నాతడు అన్నిటిలో దిలేరుఖాను అభిప్రాయముతోనే తా నేకీభవించెడివాడు.

మిర్జా రాజా జయసింహుడు పూనా చేరెను(3-3-1665). తొలుత నాతడు పురందరగఢను ముట్టడించవలెనని నిశ్చయించి, వెంటనే సైన్యము నటకు బంపెను. పూనా చుట్టుపట్లనున్న జున్నర్, సుఫె, శిరవళ్ మొదలైన గ్రామములలో తన సైన్యపు చౌకీల నేర్పరచెను. పొరపాటు జరుగుటకు వీలులేని పథకమును వేసి, పూర్తి క్రమశిక్షణతో దానిని నిర్వహింపజేయు నేర్పు జయసింహునకు గలదు. అతనికి దిలేరుఖాను అడ్డుగా లేనిచో శివాజీతో అతడు జరిపిన యుద్ధములలో సమాజ శౌర్యమునకు, పథక నిర్మాణ చాతుర్యమునకు ఉత్తమ సేనాపతిత్వమునకు చక్కని ఉదాహరణము భావి చరిత్రకారులకు లభించియుండెడిది. ఇట్టి గుణముల నన్నింటిని

స్వీయ హిందూ బంధువుల నాశనమునకై జయసింహుడు వినియోగించుట మనజాతి దురదృష్టము.

పథకము ప్రకారము పురందర కోటను ముట్టడించి, పూనా చుట్టుపట్లనున్న ప్రదేశమును జయసింహుడు ధ్వంసము చేసెను. కాని పురందర కోట యంత సులభముగా వశమయ్యే దిది కాదు. ముట్టడి నారంభించి రెండు నెలలు గడచెను. దుర్గాధిపతియైన మురార్ బాజీ దేశపాండే చనిపోయెను. అయి ననూ జయసింహుని కా కోట స్వాధీనము కాలేదు. తరువాత సింహగడ దుర్గమును కూడ ముట్టడిచేసెను. లోగడ స్వరా జ్యముపై వచ్చిన దాడులతో పోల్చినచో జయసింహుని దాడి వలన గల్గిన నష్టము బహుకొద్ది. కాని బంధు సమానుడగు తోటి హిందూరాజపుత్రునితో యుద్ధము చేయవలసి వచ్చి నందుకు మాత్రము శివాజీ మనస్సు బాధపడెను. అంతటి శక్తివంతుడగు జయసింహుడు శత్రు పక్షమున చేరకుండా స్వదేశమున కుపయోగపడినచో ఎంతయో బాగుండును. అతనిలో ఎట్లయిన ఈ మార్పు తీసుకొనిరావలెనని శివాజీ భావించెను. అందుచే జయసింహుని ఎదుట పడకుండ స్వీయ గౌరవమును కాపాడుకొనుచు సంధి చేసికొనుట కవకాశమును శివాజీ వెదకెను. అతడు తన కోటలను జయించక ముందే, శివాజీ "నేను ఢిల్లీపాదుషా వారి సేవకుడను. చిన్నవాడనైననూ, పాదుషా వారికి బాగుగ ఉపయోగపడగలను. మీరు బీజ పూరు వారి ప్రదేశమును జయించ దలచుకొనినచో నేను సహాయము చేసెద"నని కబురు పంపెను. దానికి జయసిం హుడు వెంటనే సమాధానము వ్రాసెను. 'మా సైన్యము

దక్షిణ భారతమంతటిని స్వాధీనము చేసుకొనగలదు. దానికి మీ సహాయ మక్కరలేదు. ప్రాణములపై తీపియున్నచో పాదుషాకు సేవకుడవుగా నా దగ్గరకు వచ్చి శరణువేడుకొను' మను నది యందలి సారాంశము.

జయసింహునిలో కరడుగట్టిన బానిస భావమునకు శివాజీ వ్యధచెందెను. కాని ఆయన తన ప్రయత్నమున వీడ లేదు. మరలనొక సందేశము పంపుచూ, "నేను మీతో ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధుడను. మీకు ధనరూపమున కప్పము చెల్లింతును. నాకోటలలో రెండింటిని కూడ వప్ప గింతును" అని వ్రాసెను. దానికికూడ తొల్లిటివలెనే జయ సింహుని వద్దనుండి జాబువచ్చెను. ప్రాణములను కాపాడు కొనుమని జయసింహుడు పదేపదే వ్రాయుట శివాజీకి కష్ట మనిపించెను. తనకు వ్యక్తిగత జీవనసౌఖ్యము ప్రధానమైనచో ఎన్నియో ఆపదల నెదుర్కొనుచు స్వరాజ్య నిర్మాణము చేయనవసరము లేదుగదా!

జయసింహ, దిలేర్‌ఖానులకు స్పర్థలున్నను, దిలేర్ ఖాను మాటను జయసింహుడు త్రోసిపుచ్చలేడని శివాజీకి తెలియును. జయసింహునకు జాబు వ్రాయుటవలన ప్రయో జన ముండదని గ్రహించిన వెంటనే అతడు దిలేర్‌ఖానునకు జాబు వ్రాసెను. 'పోరాటమునకు ముందు నీతో నొప్పందము చేసుకొనుట మా కిష్టములే' దని యతడుకూడ సమాధాన మంపెను. జాబులు వ్రాయుట నిష్ప్రయోజనము కాగా, శివాజీ "మన మిద్దరము కలసి మొగలుల నోడింతము రమ్మ"ని బీజపూరు సుల్తానుకు జాబు వ్రాసెను. ఆ జాబువలన

శివాజీకి మంచి లాభము కల్గెను. దానికి బీజపూరు సుల్తాను జవాబు శివాజీకి చేరకపూర్వమే శివాజీ బీజపూరునకు జాబు వ్రాసెనని తెలిసికొనిన జయసింహుడు వారిద్దరును కలసినచో, వారిని ఓడించుట కష్టమగునని ఎంచెను. అందుచేత మరియొకసారి శివాజీ వద్దనుండి జాబు వచ్చినచో శివాజీతో నొప్పందము కుదుర్చుకొనుటకు అనుమతి నీయవలసినదిగా ఢిల్లీకి వ్రాసెను. శివాజీ ప్రతిపాదనకు బీజపూరు సుల్తాను అంగీకరింప లేదు. కనుక శివాజీ కడసారి ప్రయత్నముగా జయసింహునకు జాబు వ్రాయదలచెను. ఉత్తరమును పంపుటకన్న రాయబారిని పంపుట మంచిదని యెంచి, రాచకార్య కుశలుడగు రఘునాధరావును జాబు నిచ్చి తన రాయబారిగా జయసింహుని వద్దకు పంపెను. ఆ జాబును చూచి జయసింహుడు రాయబారితో "శివాజీతో సంధి చేసుకొనుటకు పాదుషా మాకు హక్కు నీయలేదు. కాని నిరాయుధుడై అపరాధివలె శివాజీ నా వద్దకు వచ్చినచో పాదుషా అతనిపై దయ చూపగల" డని చెప్పెను. ఆ వార్త విని శివాజీ జయసింహుని వద్దకు తన కుమారుడగు శంభాజీని పంపెదనని కబురంపగా, శివాజీయే స్వయముగా రావలెనని జయసింహుడు రాయబారితో చెప్పెను. అట్లయిన మొగలు శిబిరము చేరిన తర్వాత తన ప్రాణ గౌరవములకు ఎట్టి ప్రమాదము రాదని వ్యక్తిగతముగా జయసింహుడు మాట యిచ్చినచో వచ్చెదనని శివాజీ తన రాయబారిద్వారా కబురు పంపెను. తన మాటపై గుటి నుంచి శివాజీ తనవద్దకు వచ్చుట కంగీకరించిన వార్త విని, ఒక పెద్దపులిని తేలికగా పట్టుకొనినట్లు జయసింహుడు భావించి, అందు కంగీకరించి, నిదర్శనపూర్వకముగా

కర్పూర గౌరిని పూజించిన తులసీ, బిల్వపత్రములను శివాజీ కియ్యవలసినదిగా రఘునాధున కిచ్చి పంపెను.

రాజా జయసింహ మాట యిచ్చినను, అచటికి పోయిన పిమ్మట, నిరాయుధుడగు శివాజీకి ప్రమాదము కలుగవచ్చు నని స్వరాజ్యములో ననేకులు భావించిరి. శివాజీ, జయసింహుల కలయిక పిదప స్వరాజ్య స్వరూపమెట్లుండగలదో ఎవరి యూహకు నందలేదు జయసింహుని గెలుచుట శివాజీకి కష్టముగాదని వారి నమ్మకము. ఐదు సంవత్సరముల క్రిందట, స్వరాజ్యమునకు శక్తి సమకూరని రోజులలో మొగలాయి, బీజపూరు సైన్యములు యిరువైపులనుండి ఒకేసారి దాడి చేసినను తాము ఓడింపగలిగిరి. యుద్ధమన్నచో వారికి భయము లేదు. యుద్ధము వలన స్వరాజ్యమునకు కొంతనష్టము కలిగినను దాని వలన స్వరాజ్యమునకు శక్తిగూడ ఏర్పడగలదు. అట్టిచో శివాజీ సంధికై ఏల ప్రయత్నించుచుండెనో వారి కవగాహన కాలేదు. శివాజీ నిరాయుధుడై సంధికంగీకరించుట యుద్ధమునకు భయపడిగాదు. సంధిలో నొక నిబంధనగా శివాజీ తన కోటల రెండింటిని మొగలులకు సమర్పించ నిశ్చయించెను. శివాజీ జీవితములో నిట్లు కోటలను స్వాధీనపరచుటకు యిదియే మొదటిది, ఆఖరిదికూడ. బాల్యమునందు కొండణా కోటను బీజపూరున కిమ్మని తండ్రి చెప్పగా కోపించి, తండ్రిని నిరసించిన శివాజీ యీనాడు తనంత తానుగా కోటల నిచ్చుట కంగీకరించెను.

అసలు యుద్ధమైన జరుగకుండగనే జయసింహునితో నట్టి వప్పందము చేయుటలో శివాజీ ఉద్దేశ్యము వేరుగ

నున్నది. ఇంతవరకు శివాజీపైకి దండెత్తిన వారందరును అరాష్ట్రీయులే. వారితో యుద్ధము చేయవలసినదే. కాని యీసారి వచ్చినవాడు రాష్ట్రీయుడు. అట్టివాని నెట్లయినను దేశభక్తునిగా చేయుట అవసరము. నాడు దేశములోకెల్ల ప్రబల శక్తివంతుడగు ఢిల్లీ సుల్తాను కొలువులోనున్న వారందరిలో శ్రేష్ఠుడైన ఆ హిందూ సేనాధిపతి దేశభక్తుడుగా నయినచో నంతకన్న ఆశించవలసిన దేమి యున్నది? ఉత్తరమునుండి అతడు, తూర్పునుంచి లచిత్ బడఫుకన్, దక్షిణమునుంచి తాను - ఒక్కుమ్మడిగా ముగ్గురు స్వరాజ్య నిర్మాణమునకు కృషి చేసినయెడల, విదేశీరాజ్యము పూర్తిగ నశించిపోగలదని శివాజీ భావించెను. కాబట్టి జయసింహుని మనసున మార్పు దెచ్చుటకు తానే స్వయముగా నాతనిని కలసి ప్రయత్నించవలెనని శివాజీ యనుకొని, తాను పట్టుబడు అవకాశమున్నను జయసింహుని శిబిరములోనికి నిరాయుధుడుగా వెళ్ళుట కంగీకరించెను.

రఘునాధపంత్ జయసింహునివద్ద నుంచి వచ్చిన మరునాడే శివాజీ జయసింహుని కలియుటకు బయలుదేరెను. శివాజీ శిబిరము చెంతకు రాగానే, శిబిర రక్షకులు శివాజీ రాక జయసింహున కెరిగించిరి. అతడు నిరాయుధుడుగా నున్నచో లోనికి ప్రవేశ పెట్టుడని జయసింహుడు భటుల కాజ్ఞ యిచ్చెను. అఫజల్ ఖానుకు జరిగినట్లు తనకుగూడ ప్రమాదము జరుగవచ్చునేమోయని యాతడు జాగ్రత వహించెను. ఆతని సైనికులు శివాజీని పరీక్షించి నిరాయుధుడని గుర్తించి లోనికి బంపిరి. శివాజీ డేరాలోనికి వచ్చుచుండగా, జయసింహుడు తన ఆసనమునుండి లేచి నిలబడలేదు. శివాజీలోని

నిస్వార్థ దేశభక్తిని, నిరాడంబరతను జయసింహుడు గుర్తించ లేదు. తన శక్తికి భయపడి శివాజీ తనవద్దకు వచ్చుచున్నాడని ఆయన అభిప్రాయపడెను. శివాజీ తనకు నిర్దేశింపబడిన ఆసనమున కూర్చొని జయసింహునితో సంభాషించెను. శివాజీ జయసింహునితో ఎనిమిది రోజులు చర్చలు జరిపి, ఒక ఒప్పందము చేసికొనెను. దాని ప్రకారము శివాజీ తన యిరువదిమూడు కోటలను, నాలుగు లక్షల నాణెములు పన్నుగా వచ్చెడి ప్రదేశమును ఔరంగజేబునకు వప్పగించవలెను. తన క్రింద పండెండు కోటలు, ఒక లక్ష నాణెములు పన్నుల నిచ్చు ప్రదేశము నుంచుకొనవచ్చును. జయసింహుని వంటి వానిలో నెట్టియిన దేశభక్తిని నిర్మింపదలచిన శివాజీ వారు పెట్టిన షరతుల కన్నిటికిని అంగీకరించెను.

ఇట్టి యొప్పందము కుదిరిన తరువాత, నెట్లయిన శివాజీని ఔరంగజేబు కొలువునందు సర్దారునిగా చేయవలయునని జయసింహుడు భావించెను. అందుకుగాను శివాజీ యొక్కసారి ఢిల్లీకి వెళ్ళివచ్చిన బాగుండునని అతడనుకొనెను. తాను ససైన్యముగా వచ్చినంత మాత్రముననే శివాజీ యొప్పందమున కంగీకరించెను. ఇక ఢిల్లీకిపోయి పాదుషా యొక్క శక్తి సామర్థ్యములు చూచినచో తప్పక అచట కొలువును కోరవచ్చునని జయసింహుని అభిప్రాయము. శివాజీ జయసింహునిలో దేశభక్తిని కలిగించుటకు చేయు ప్రయత్నము విఫలమయ్యెను. బానిసత్వ విష మాతనిలో నంత లోతుగా నాటుకొని యున్నది. తాను బానిస యగుటయే గాక శివాజీని గూడ బానిసగా చేయుట కాతడు యత్నించెను. శివాజీ యా మాటలు విని జవాబేమియు చెప్పక మిన్న

కుండెను. జయసింహుడు మాత్రము తన జీవితమున శాశ్వతముగా పాదుషా యభిమానము నిండగలదని సంతోషించెను.

శివాజీతో ఒప్పందమైన తరువాత జయసింహుడు బీజపూరు వారిపై దండెత్తదలచెను. దానిలో స్వయముగా శివాజీ శంభాజీ, నేతాజీలు సైన్యసమేతులై జయసింహ వెంటనుండిరి. బీజపురము పోవుదారి పొడవునను శివాజీతో ఢిల్లీ ప్రయాణమును గుఱించి జయసింహుడు ముచ్చటించుచునే యుండెను. శివాజీని ఢిల్లీకి ఆహ్వానింపమని పాదుషాకు జాబులు వ్రాసెను. ఢిల్లీ వెళ్లుటవలన కలుగబోవు లాభములను శివాజీకి వివరించి చెప్పెను. ఔరంగజేబు, దక్షిణముననున్న ఆదిల్‌షా, కుతుబ్‌షాహీలను జయించు బాధ్యత శివాజీ కప్పగించుననియు, అట్టిచో పాదుషా సామ్రాజ్యము విస్తరించుటయేగాక శివాజీకి కూడ చాల ధనము లభ్యము కాగలదనియు, ధనముతో పాటు ఢిల్లీ దర్బారులో కీర్తిప్రతిష్టలు పెరుగుననియు, ఎన్నియో సార్లు చెప్పెను. అన్నిటికన్న ఘనముగా, శివాజీని దక్షిణ సుబేదారుగా ఔరంగజేబు నియమించునను నాశగూడ చూపెను. దాని నంతనూ విని వానివలన స్వరాజ్యమున కెట్టి లాభము చేకూర్పవచ్చునని శివాజీ ఆలోచించెను. దక్షిణాదిని జయించు పనిని ఔరంగజేబు నిజముగా తనకే వప్పగించినచో నాతని ఖర్చుతో తనయొక్క యిద్దరు శత్రువులను జయింపవచ్చును. జయించిన పిమ్మట తనను దక్షిణ సుబేదారునిగా నియమించినచో అప్పుడవకాశము చూచుకొని స్వాతంత్ర్యము ప్రకటించుకొనవచ్చును. వలసినచో ఔరంగజేబుతో యుద్ధముకూడ చేయవచ్చును. తద్వారా స్వరాజ్యాభివృద్ధి త్వరగానగును తాను దక్షిణ సుబేదారుగా ఉండుట

వలన జల దుర్గమును నిరంకుశముగా పాలించుచున్న సిద్దీకూడ తన అధికారములోనికి తేలికగా వచ్చును. ఢిల్లీవెళ్ళి మొగల్ షాహి ఎట్టిదో చూడవచ్చును. అనుకున్నట్లు జరిగిన సరియే. లేకున్న ఢిల్లీ దర్బారు రహస్యములు తెలియగలవు. ఇట్లనేక యోచనలు చేసి, ఔరంగజేబు పిలిచినచో తాను ఢిల్లీ వెళ్ళుటకు సిద్ధముగా నుంటినని జయసింహునితో శివాజీ చెప్పెను. ఢిల్లీలోనున్న కాలములో శివాజీకి ప్రాణభీతి యుండదని జయసింహుడు హామీ నొసంగెను. కాని శివాజీని ఢిల్లీ కాహ్వానించు విషయమై ఔరంగజేబు వద్దనుండి జవాబేమియు రాలేదు.

బీజపూరు వారితో జరిగిన యుద్ధములో మొగలాయీలోడిపోయిరి. ఓటమియొక్క పాపమును, బాధ్యతను వేరొకరిపై నెట్టవలెనని యెంచిన దిలేర్ ఖాను 'మన యోటమికి శివాజీ కారణము గనుక వాని శిరచ్ఛేదము చేయు' మని జయసింహునితో చెప్పెను. కాని జయసింహున కాపని యిష్టములేదు. దిలేర్ ఖాను యీ విషయమై తరచు జయసింహునితో వాదించుచున్నాడని శివాజీకి తెలిసెను. యుద్ధము జరుగుచున్న బీజపూరు ప్రాంతములో నప్పుడు త్రాగుటకు నీరు లభ్యముకాక, సైనికులు చాల బాధపడవలసి వచ్చెను. సైనికులకు నీటి యొద్దడిని, జయసింహునకు తన విషయమై దిలేర్ ఖానునుండి కలుగుచున్న ఒత్తిడిని తప్పించు నుద్దేశ్యముతో శివాజీ పనాళగఢ దుర్గమును జయించు నెపమున జయసింహుని అనుమతి పొంది, తన సైనికులతో సహా బయలుదేరిపోయెను.

శివాజీ పనాళగఢ పై దాడి చేసెను. కాని అనుకొనిన సమయమునకు తన సేనాధిపతియైన నేతాజీపాల్కర్ అచటకు రాకపోవుటచే నోడిపోయెను. అట్టి పొరపాటు చేసినందులకు స్వరాజ్యోద్యమములో ప్రముఖపాత్ర వహించిన వీరులలో ముఖ్యుడు నేతాజీ పాల్కర్‌ను సర్వ సైన్యాధిపత్యము నుండి తొలగించెను. దానిని అవమానముగా భావించిన నేతాజీ వెంటనే బీజపూరువారి కొలువులో చేరెను. మొగలులకు వ్యతిరేకముగా కుతుబ్ షా బీజపూరువారికి సహాయము చేయుచుండెను. ఈస్థితిలో శివాజీకూడ బీజపూరువారితో కలసినచో పరిస్థితి విషమించును కాన శివాజీని ఢిల్లీ కాహ్వానింపుమని ఔరంగజేబునకు జయసింహుడు మరల జాబు వ్రాసెను. దక్షిణాదిలోని మారుచున్న పరిస్థితిని చూచి, ఔరంగజేబు జయసింహునిద్వారా శివాజీని ఢిల్లీకి రమ్మని యాహ్వానించెను. రానుపోను వ్యయమును గూడ తానే భరించుట కంగీకరించెను. శివాజీ వెంటనే ఢిల్లీపోవుటకు సమ్మతించెను. జయసింహునకు బ్రహ్మానందమాయెను.

శివాజీ ఢిల్లీ వెళ్ళదలచిన వార్త స్వరాజ్యములో నందరిని కలవరపెట్టినది. ఔరంగజేబెట్టివాడో యందరికిని తెలియును. శివాజీ ఢిల్లీకి వెళ్ళినచో తిరిగి వచ్చుట యసంభవమేమోయని కూడ కొందరు భావించిరి. జిజియాబాయి మనము పరిపరివిధముల నూహించినది. శివాజీకి గూడ నిట్టి భావన కలుగలేదనికాదు. కాని స్వరాజ్య విస్తరణకు యది యొక దారిగా భావించి అందు కాతడు సంసిద్ధుడాయెను. అపాయముతో కూడిన పనులకు వెఱచినచో స్వాతంత్ర్య ఉద్యమమే జరుగదు కదా!

నాడు అఫజుల్‌ఖానును కలియునప్పుడు, పనాళగఢ నుండి పారిపోవునప్పుడు, షహిస్తఖాను శిబిరములో ప్రవేశించునపుడు తన జీవితమున కపాయమున్ననూ శంకింపక సాహసించినట్లే, నేడు ఢిల్లీకి వెళ్ళవలెనని శివాజీ నిశ్చయించుకొనెను. లోగడవలెనే తాను లేని సమయమున స్వరాజ్యమున నేపని యెట్లు జరుగవలెనో, తాను మరి తిరిగి రాలేకపోయినచో నేమేమి ఎట్లు చేయవలెనో శివాజీ ముందుగనే నిర్ణయించెను. అట్టి ఏర్పాట్లు సరిగా జరుగుచున్నవా లేవాయని తెలుసుకొనుటకు అకస్మాత్తుగా నా యా స్థలములకు పోయి పరీక్షించెను. అందరును తమ తమ పనులు సవ్యముగా నిర్వర్తించుచున్నారని నమ్మకము కుదిరెను. తన ముద్రికను తల్లియగు జిజియాబాయి కిచ్చెను. ప్రతాపరావును సర్వసైన్యాధిపతిగా జేసెను. మోరోపంతు పింగళే, నీళోసోనదేవ్ ముజుమ్‌దార్, ప్రతాపరావులు జిజియా మాత యాజ్ఞల ననుసరించి స్వరాజ్యమును సవ్యముగా నడిపించవలెనని నిర్ణయించెను. అప్పటికి తొమ్మిది సంవత్సరములు వయస్సు గల్గిన తన కుమారుడు శంభాజీకి రాచకీయములం దనుభవము శిక్షణ అవసరమని తలచి తనతోపాటు ఢిల్లీకి తీసికొనిపోవలెనని నిర్ణయించెను. తనతో రావలసినవారు, సాధనసామగ్రిని మార్గము ఇత్యాది వివరములనన్నిటినీ ముందుగ నిర్ణయించుకొని శివాజీ ప్రయాణమయ్యెను. ఈ ప్రయాణమునకు ఔరంగజేబు ఏర్పాట్లను చక్కగ జరిపించెను. ప్రయాణవ్యయము క్రింద పాదుషా తన దక్షిణ కోశాగారమునుండి లక్షహోన్నులను మంజూరు చేసెను. శివాజీ వెంటనుండి సౌకర్యములు చూచుటకై గాజీబేగ్‌ను నియమించెను. అంతేగాక త్రోవ

పొడవుననూ తన కుమారుడే వచ్చుచున్నట్లు భావించి అన్ని వ్యవస్థలు జరిపించవలెనని తాఖీదులనంపెను. జయసింహుడు తనవాడగు తేజసింహ కచ్‌వాహ్‌ను శివాజీ వెంట బంపుచూ ఢిల్లీలో శివాజీకి ఏ ప్రమాదము జరుగకుండ రక్షణనిచ్చుచూ అవసరమైన ఏర్పాట్లనన్నిటిని సక్రమముగా జరిపింపుమని తన కుమారుడగు రామసింహునకు జాబునంపెను. శక సంవత్సరము 1857 ఫాల్గుణశుద్ధ నవమినాడు (5-3-1666) శివాజీ ఢిల్లీకి బయలుదేరెను. బీజపూరు వారితో పరాజయము కలిగినందుకు బాధకల్గిననూ, ఢిల్లీకి శివాజీని పంపగలిగితిని గదా యని జయసింహుడు చాల సంతోషించెను. మార్గమధ్యమున శివాజీకి ఔరంగజేబు వద్దనుండి జాబువచ్చెను. అందు శివాజీ ఆగ్రాచేరి పాదుషాతో కలసినపిమ్మట, తిరిగి మహారాష్ట్రమునకు పోవుటకు అనుమతి నిచ్చుచున్నట్లు వ్రాయబడి యుండెను. అది చూచి శివాజీ కూడ సంతసించెను.

చంబల్ నదిని దాటి, శివాజీ యమునానదివైపు ప్రయాణము చేయుచుండెను. విశాలమై సస్యశ్యామలమైన ఆ భూభాగములను చూచునప్పుడు శివాజీ హృదయము పొంగినది. 'పవిత్రమైన ఈ భూమిని తల్లిగా భావించెడివారు హిందువులు. ఇదివారిదే. కాని నేడు దీనిని భోగభూమిగా భావించు తురకల యధీనములో ఈ భూమియున్నది. ఈ బానిసత్వమునుండి దేశమును స్వాతంత్రము చేయుటకై హిందువులు ఏల నాయుధములను ధరించ'రని యాతడు చింతించెను.

ఢిల్లీనుండి రామసింహుడు, మార్గమధ్యమున నుండగనే శివాజీకొక జాబు వ్రాయుచు, 12-5-1666 న ఆగ్రాలో

పాదుషా పుట్టినరోజు సందర్భమున దర్బారుజరుగునని తెలియ చేసెను. ఔరంగజేబు రామసింహునిచే నట్టిజాబు వ్రాయించెను. తన స్వరాజ్య విస్తరణకుగాను ఆనాటికి తానచట సుపస్థితుడై యుండుట అవసరమని శివాజీ యనుకొని త్వరగా పయనించి ఒకరోజు ముందుగనే ఆగ్రా కావల నాలుమైళ్ళ దూరమున విడిసి తనరాకనుగూర్చి రామసింహునకు, అతని ద్వారా ఔరంగజేబునకు కబురుపెట్టెను. ఆనాటి నుండియే శివాజీకి అవమానము లారంభమాయెను. ప్రముఖుడైన అతిథి వచ్చినపుడు పాదుషాకు ప్రతినిధిగా వజీరుగాని, ఆ స్థాయికి చెందిన ఉన్నతోద్యోగి గాని నగరము వెలికిపోయి స్వాగతము నిచ్చి, ఆ రాత్రికి అతిథికి అవసరమైన ఏర్పాట్లు సక్రమముగా ఉండునట్లు చేసి, మరుసటిరోజున ఊరేగింపుతో ఆ అతిథిని రాజధానికి తెచ్చి మంచిముహూర్తమున పాదుషా సన్నిధికి తీసికొనివెళ్లుట యాచారము. కాని శివాజీకి స్వాగతమిచ్చుటకు పాదుషా ప్రతినిధిగా నెవ్వరును రాలేదు. రెండున్నరవేల సైన్యమునకు అధిపతిగానున్న రామసింహుని సేవకుడు మున్షీ గిరధరలాల్ శివాజీకి స్వాగతమీయవచ్చెను. దానికి శివాజీ ఆశ్చర్యచకితుడయ్యెను. పిమ్మట మున్షీ గిరధరలాల్‌తో నాగ్రాకుపోయెను. ఆగ్రాలో మూలక్‌చంద్ సత్రములో శివాజీ బసకేర్పాటు చేయబడెను. మరుసటిరోజున శివాజీని దర్బారునకు తీసికొనివచ్చుటకున్నతాధికారి ఎవరును నియోగింపబడలేదు. రామసింహుడు, ఒకటిన్నరవేల సైన్యముపై నధికారియగు ముఖలీఖాను అందుకు నియోగింపబడిరి. శివాజీని దర్బారునకు తీసికొని వెళ్ళవలసిన సమయమునకు పాదుషా రామసింహునకు వేరొకపని నప్పగించెను. ఇది అంతయు తన

నవమానించుటకే యని శివాజీ గుర్తించెను. మార్గ మధ్యమున నుద్దేశపూర్వకముగా జరుపబడిన ఆలస్యముచేత, శివాజీ కోటను చేరుసరికి బహిరంగమైన దర్బారు ముగిసినది. ఈ దర్బారులో నుపస్థితుడగు నుద్దేశ్యముతోనే ఒకరోజు ముందుగా శివాజీ ఆగ్రాచేరెను. అదిసాధ్యం కానందుకు శివాజీ చాల బాధపడెను. ఔరంగజేబుయొక్క ఐశ్వర్యము చూడ లేక పోయితినని కాదు అతనిబాధ; ఆ దర్బారులోనే తాను దక్షిణాదికి సుబేదారుగానగుట, జింజిరాలోని జలదుర్గముపై నధికారియగుట మొదలగువానికి ప్రాతిపదికలు వేయవలెనని చేసిన యూహలు విఫలములై నందున శివాజీ చాల బాధ పడెను.

బహిరంగమైన దర్బారు ముగిసినదని విని రామ సింహుడు శివాజీని వెంటనిడుకొని ఆంతరంగికమైన దర్బారు నకు తీసికొని వెళ్లెను శివాజీ రాకను వినిన ఔరంగజేబు ఆతనిని లోనికి తెచ్చుటకై బక్షీ అసద్‌ఖాన్‌ను పంపెను. అసద్‌ఖాను వచ్చి శివాజీని లోనికి తీసుకొని వెళ్లెను. రెండు శుభాశుభ గ్రహముల యోగమువలె నున్నదా దర్బారు. శివాజీ లోనికి వచ్చుట ఔరంగజేబు చూచెను. కాని ఆతని ముఖమున ఎట్టి ఉత్సుకతగాని సంతోషముగాని, కోపము గాని వ్యక్తము కాలేదు. తా నాశించిన భవిష్యత్ ప్రయో జనమునకై శివాజీ తా నెన్నడు చేయని, చేయజాలని పని చేయుటకు సిద్ధపడెను. వెయ్యి మొహరీలు, రెండువేల నాణెములు నజరానాను, ఐదువేల నిస్సార్‌ను ఔరంగజేబు ముందుంచి మూడు పర్యాయములు వంగి సలాములుచేసెను. బాలకుడుగానే బీజపూరు సుల్తానుకు నమస్కారము చేయ

తిరస్కరించిన శివాజీ స్వరాజ్యముయొక్క భవిష్యత్ ప్రగతికై ఔరంగజేబునకు వందనము చేసెను. శంభాజీకూడ నట్లే నమస్కరించెను. పిమ్మట శివాజీ, శంభాజీలు పాదుషాకు పరిచయము చేయబడిరి. మర్యాదకైన పాదుషా వారితో పలుకలేదు తుదకు ముఖమునందు సంతోషమునైన వ్యక్తము చేయలేదు. వెంటనే శివాజీ, శంభాజీలు ఐదువేల సైన్యముపై నధికారుల వరుసలో నిలువబెట్టబడిరి. పిమ్మట దర్బారులోని ఇతర పనులు యథావిధిని కొనసాగుచుండెను.

దర్బారులోని సరదారులను వారివారి యోగ్యతల కనువుగా సన్మానించుట యారంభమయ్యెను. షహజాదా వజీర్ జాఫర్ ఖాన్‌తో నారంభమై, వరుసగా శివాజీకి ముందున్న జస్వంతసింహ రాథోర్ వరకు సన్మానము జరిగెను. జస్వంతసింహుడు దక్షిణమున శివాజీచే నోడింప బడినవాడు. తనకన్న ముందుగా నతనిని సన్మానించుట చూచి శివాజీ కోపోద్రిక్తుడాయెను. ఆ క్షణమున అగ్ని పర్వతము అతని ముఖమున విజృంభించి నట్లుండెను. అతడు వెంటనే బిగ్గరగా "రామసింహా! నా ముందు నిలబడిన యీతడెవ్వ" రని ప్రశ్నించెను. ఆ సింహగర్జన దర్బారులోని వారందరిని ఆశ్చర్యచకితులను చేసెను. పాదుషా సమక్షమున నేమాత్రము శబ్దము రారాదు. అంతటి నిశ్శబ్దమైన దర్బారులో శివాజీ గర్జన అందరికి స్పష్టముగా వినిపించినది. రామసింహుడు రెండున్నరవేల సైన్యాధిపతుల వరుసలో నిలుచుండెను. ఈ పిలుపును వినినవెంటనే ఆతడు శివాజీ వద్దకు వచ్చి "వీరు మహారాజా జస్వంతసింహులు" అని చెప్పెను. అది విని తన మాటలలో నగ్నిగోళములు బ్రద్దలగుచుండగా శివాజీ

"ఎన్నో పర్యాయములు మా వీర సైనికులకు వెన్ను చూపిన ఈ జస్వంతసింహుని కన్న క్రిందనా నా యధికారము! తొమ్మిది సంవత్సరముల బాలుడగు నా కుమారుడు ఐదువేల సైన్యమున కధికారి. నేను ఐదువేల సైన్యమున కధికారినా? ఇంతదూరము ఈ దర్బారునకు వచ్చినది ఐదువేల సైన్యముపై నధికారి యగుటకా" యని గద్దించి యడిగెను. శివాజీ చూపిన యీ ధైర్యమున కందరును ఆశ్చర్యపడిరి. శివాజీ చేతులలో నోడిపోయిన జస్వంతసింహునివంటి వారికి కోపము వచ్చినది. ఆ క్షణమున రామసింహుని స్థితి విచిత్రముగా నున్నది. ఒక ప్రక్క పాదుషా గౌరవమును, వేరొక ప్రక్క శివాజీ యభిమానమును నిలబెట్టుట కాతడు ప్రయత్నించుచుండెను. శివాజీ మాట్లాడుటను వినిన ఔరంగజేబు, "రామసింహా! శివాజీకి కోపము వచ్చినట్లున్నది. ఎందులకో తెలిసికొను" మని చెప్పెను. శివాజీ కోపము కారణరహిత మన్నట్లుగా ఔరంగజేబు తన యభిప్రాయమును వ్యక్తము చేసెను. జరిగిన దానికి "శివాజీ అసంతృప్తి చెందినాడ"ని రామసింహుడు చెప్పెను. వాస్తవమునకు శివాజీకి కలిగినది అసంతృప్తి గాదు. శివాజీ కోపముతో నున్నాడని ఔరంగజేబుతో చెప్పుటకు రామసింహునకు ధైర్యము చాలలేదు. ఒక మొగల్ పాదుషా దర్బారులో నొక హిందువునకు కోపము వచ్చుట సహింపరానిది. చిన్నతనమునుండి బానిసత్వమున కలవాటుపడిన రామసింహుడు ఆమాట ఔరంగజేబుతో చెప్పలేదు. అప్పుడు ఔరంగజేబు శివాజీని సింహాసనము దరికి తీసుకురమ్మని చెప్పెను. "పాదుషా ఉద్దేశ్యపూర్వకముగా నన్నవమానించినాడు. మీ సన్మానము నా కక్కర

లేదు. నేను మీ పాదుషాకు సేవకుడనుగాను. నేను దర్బారునకు రా నవసర మింకలేదు. నన్ను బందీచేసిననూ, చంపిననూ నా నిర్ణయ మిదియే'' యని శివాజీ బదులు పలికెను. అది వినిన పాదుషా రామసింహుని బిలిచి, 'శివాజీని నీ యింటికి తీసికొనిపోయి మెల్లగా నచ్చజెప్పు' మని చెప్పెను. రామసింహుడు శివాజీ, శంభాజీలను వెంటనిడుకొని తన యింటికి పోయెను.

దర్బారులో జరిగినదానికి రామసింహుడు దిగ్భ్రాంతుడై యింటికి వచ్చిన పిదప శివాజీకి నచ్చచెప్ప ప్రయత్నించెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఇట్టి భయంకర వ్యక్తియొక్క ప్రాణరక్షణ బాధ్యత తాను నిర్వహించగలనా యను భయమాతని మనమున ప్రవేశించెను. రామసింహుని గృహమునుండి శివాజీ శంభాజీలు తరువాత తమ నివాసమునకు వెళ్ళిరి.

రాజభవనమున దర్బారు ముగిసిన పిదప లోగడ శివాజీచే యుద్ధములలో నోడింపబడినవారు అతనిపై దుష్ప్రచారము చేయుచు దర్బారుపద్ధతులకు వ్యతిరేకముగా ప్రవర్తించి శివాజీ ఢిల్లీ సింహాసనము నవమానించెనని పాదుషాతో పలికిరి. పాదుషా యీ వ్యాఖ్యను వినియు విననట్లు లోనికిపోయెను. మనస్సున కలిగిన ఆలోచనల ప్రభావ మెన్నడును ఔరంగజేబు ముఖమున వ్యక్తమయ్యెడిది కాదు.

నివాసమునకు చేరిన శివాజీ జరిగినదంతయును సింహావలోకనము చేసెను. జయసింహుడు తనను మోసపుచ్చెనను

భావము శివాజీకి కలుగలేదు. కాని సమర్థుడు, అనుభవజ్ఞుడు నగు జయసింహుడు ఔరంగజేబు మనస్తత్వము నంచనా వేయుటలో పొరపాటుపడెనని మాత్రము భావించెను. దర్బారులో తన్నవమానింప దలచిన ఔరంగజేబునకు తాను సరియైన సమాధానమే చెప్పితినని శివాజీ తలచెను. పిమ్మట ఆగ్రానుండి మరల మహారాష్ట్రమునకు చేరుటెట్లను యాలోచన యాతనికి కలిగెను. ఈ ఆలోచనలలో దినమంతయు గడచెను. సాయంకాలమున రామసింహుని వ్యక్తియగు భల్లూషాహ్ వచ్చి నచ్చచెప్పుచూ పాదుషా కోపమునకు గురి కావద్దని హెచ్చరించెను. పరిస్థితి నవగాహన చేసుకొనిన శివాజీ మహారాజు "నేను రామసింహునితో బాటు శంభాజీని దర్బారునకు పంపెదను. నేను మాత్రము కొన్ని దినములు గడచిన పిమ్మట వత్తు"ననెను. ఆ మరునాడు రామసింహుడు "సుస్తీ చేసినందున ప్రస్తుతము శివాజీ దర్బారునకు వచ్చుట లే"దని పాదుషాకు తెలిపెను.

ACC NO 8297 894.81331 JAG 2325

తరువాత రెండు మూడు రోజులపాటు జస్వంతసింహా, జాఫర్ ఖాన్ వజీరు, జహానారాలు శివాజీకి శిక్ష విధించవలెనని పాదుషాతో చాలసార్లు నివేదించిరి. జస్వంతసింహుడు దర్బారులో శివాజీచే నవమానింపబడెను. జాఫర్ ఖాన్ వజీరు శివాజీచే నవమానింపబడిన షైస్తఖాను చెల్లెలికి భర్త. జహానారా బేగమునకు సూరత్ నగరమున పన్నులద్వారా వచ్చు నాదాయమును శివాజీ కొల్లగొట్టెను. ఈ ముగ్గురకు శివాజీ వలననష్టము కలిగినందున, అతనిపై వారికికోపముండెను వీరిమాటల నన్నిటిని వినిన తరువాత ఔరంగజేబు శివాజీ రాద్ అందాజ్ ఖాను అధీనములో నుండవలెనని ఆజ్ఞాపించెను.

అందాజ్ ఖాను ఆగ్రాకోటకు అధిపతి. తన కప్పగింపబడిన రాజకీయ ఖైదీలను నేర్పరితనముతో సంహరించుట కాతని కతడే సాటి యని ప్రజలందరకు తెలియును. ఔరంగజేబు ఫులాద్‌ఖాను అను కొత్వాలును పిలచి శివాజీని రాద్ అందాజ్ ఖాను కప్పగింపుమని చెప్పెను. ఈ విషయ మెట్లో రామసింహునకు తెలిసెను. అతడు వెంటనే బక్షీ అమీన్ ఖాను వద్దకు పోయి "శివాజీ ప్రాణమునకు ఎట్టి ప్రమాదము సంభవించదని మా తండ్రి యాతనికి హామీ నిచ్చెను. ఈ నగరములో నున్నంత కాలము శివాజీ క్షేమము బాధ్యత నామీద నున్నది. అందుచేత నన్ను చంపిన పిమ్మటనే శివాజీని చంపుట సాధ్యమగు" నని హెచ్చరించెను.

బక్షీ అమీన్ ఖానునకు పాదుషావద్ద కొంత పలుకుబడి గలదు. రామసింహుడు తనతో చెప్పిన విషయములను అతడు పాదుషాకు నివేదించెను. రామసింహున కేమైన ప్రమాదమైనచో, తన కొలువులో నున్న రాజపుత్రు లందరును ఆందోళన లేవదీయుదురేమో యనుకొనిన ఔరంగజేబు "రామసింహుడు శివాజీ విషయమున జమానత్‌గా తన మొత్తమాస్తిని వ్రాసి యిచ్చుటకు సిద్ధముగా నున్నాడా" యని పలికెను. రామసింహుడు అది తెలిసి తా నందుకు సిద్ధమే నని చెప్పెను. తానెక్కడికిని పారిపోనని శివాజీ మాట యిచ్చిన పిమ్మట రామసింహుడు తనయాస్తి నంతను వ్రాసి యిచ్చెను. వెంటనే పాదుషా రామసింహుని కాబూల్‌పై యుద్ధమునకు శివాజీని వెంటనిడుకొని వెళ్ళుమని యాజ్ఞాపించెను. ఐదారు రోజుల తర్వాత కాబూల్ పోవుటకు ముహూర్తము నిశ్చయింపబడెను. ఒకరోజున రామసింహుడు

దర్బారునుండి గృహమున కేగుచుండగా, రాద్ అందాజ్ ఖాను త్రోవలో నగుపడి తానుగూడ రామసింహునితో కాబూలు వెళ్ళవలయునని పాదుషా యాజ్ఞాపించినట్లు చెప్పెను. అది విని రామసింహుడు భయకంపితుడాయెను. 'ఈ అందాజ్ ఖానుడు తమతో వచ్చినచో మార్గమధ్యమున నెట్లో శివాజీని చంపి శివాజీ యుద్ధములో మరణించెనని ప్రకటించగలడు' అని ఖాను స్వభావము నెరిగిన రామసింహుడు నిజముగా నాందోళన చెందెను.

అచట గడిపిన కొద్ది రోజులలోనే శివాజీ ఆగ్రాపరిస్థితిని, తనకర్తవ్యమును చక్కగా నవగాహన చేసుకొనెను. పిమ్మట తన ప్రయత్నములు తాను ప్రారంభించెను. "రాజా జయసింహుడు శివాజీకి యిచ్చిన మాటకు వ్యతిరేకముగా, పాదుషా ప్రవర్తించె"నను వార్తను నగరమున ప్రచారము చేసెను. ఈ ప్రచారము నగరము నందంతటను వ్యాపించి పాదుషా చెవులబడెను. అది విని చికాకు పడిన ఔరంగజేబు, 'నీవేమేమి బోధించి శివాజీ నిక్కడకు పంపితివో తెలుపుడి' మని జయసింహునకు జాబు వ్రాసెను. జయసింహుని వద్దనుం" తిరుగుజాబు వచ్చుటకు కనీసము నెలరోజులైన పట్టును. అందుచేత నంతవరకూ రామసింహుని కాబూలు ప్రయాణము వాయిదా వేయవలసి వచ్చెను. శివాజీ కాబూలు ప్రయాణము తప్పించి, మహారాష్ట్ర ప్రయాణమునకు మార్గము నేర్పరచుకొనుటకు ప్రయత్నించుచుండెను. చాలమంది సరదారులకు, వజీరునకు గూడ శివాజీ అనేక నజరానాలను పంపెను. జాఫర్ ఖాను దగ్గరకు స్వయముగాపోయి, ఎట్లయిన తనను మహారాష్ట్రమునకు పంపుట కేర్పాట్లు చేయింపుమని కోరెను. జాఫర్

ఖాను శివాజీ కోరికను పాదుషాతో నివేదించెను. కాని ఏమియు ప్రయోజనము కలుగలేదు. ఐదారు రోజులు గడచినను పాదుషావద్దనుండి సమాధానము రానందున బక్షీ అమీన్‌ఖాను ద్వారా శివాజీ ఔరంగజేబునకు ఒక మనవి పంపుచూ, "పాదుషా నాకోటలను నాకు తిరిగి యిచ్చినచో రెండు కోట్ల రూప్యముల నిచ్చెదను. అందుకుగాను బీజపూరు పై దండె త్తుటకు నా కనుజ్ఞనీయవలె"నని అందులో వ్రాసెను.

ఈ మనవిని వినిన పాదుషా కోపించి, "శివాజీతో నింత వరకు మృదువుగా వ్యవహరించు చుండుటచే నాతడు హద్దులను మీరుచున్నాడు. ఇకనుంచి యాతడు ఎవరినీ కలియుటకు వీలులేదని మాయాజ్ఞగా నతనితో చెప్పు"డని పలికెను. వెంటనే పాదుషా కొత్వాలు ఫులాద్‌ఖానును పిలిచి శివాజీ నివాసముచుట్టును రక్షకులను కాపలా పెట్టి రాకపోకలు నిషేధించుమని యాజ్ఞాపించెను. శివాజీ యీ విధముగా తన నివాసములోనే ఖైదీగా నాయెను (29-5-1666).

తాను ఖైదు చేయబడినందుకు శివాజీ చాల కించపడెను. అది రామసింహునకుగూడ చాల బాధ కలిగించెను. శివాజీ ప్రాణములకు ప్రమాదము జరుగకుండుటకై ఫులాద్‌ఖాను సైనికులకు, శివాజీకి నడుమ తన మనుష్యుల నాత డేర్పరచెను. ఏమిది యని ఫులాద్‌ఖాను ప్రశ్నించగా 'శివాజీ నిమిత్తమై పాదుషా నావద్దనుంచి జమానత్ వ్రాయించెను. అట్టిచో శివాజీ యాత్మహత్య చేసికొనినచో నాపరిస్థితి ఏమగు'నని ఎదురు ప్రశ్న వేసెను. అది విని ఫులాద్‌ఖాను మారుమాటాడక అంగీకరించవలసి వచ్చెను.

శివాజీ ఖైదు చేయబడినాడని విని స్వరాజ్యములో జిజియాబాయి మొదలగు వారు విచారించిరి. ఏక్షణముననైన శివాజీ ప్రాణములకు ప్రమాదము జరుగవచ్చునని వారు తలంచుచుండిరి. జయసిహునకు కూడ ఔరంగజేబు చేసిన పని నచ్చలేదు. "శివాజీ తన రాజ్యముననన్ని ఏర్పాట్లను కట్టుదిట్టముగా చేసియే ఢిల్లీ వచ్చినాడు. ఇప్పుడాతనిని ఖైదు చేయుటవలన లాభము లేకపోగా చాల నష్టమున్నది. కాన ఆతనిని వెంటనే దక్షిణమునకు పంపుట శ్రేయస్కర"మని ఔరంగజేబునకు జాబు వ్రాసెను. ఆ జాబునకు పాదుషా సమాధానమే పంపలేదు.

తొలినాటి దుఃఖావేశము తగ్గిన తరువాత ఆ ఖైదు నుండి విడిపించుకొనుటకు శివాజీ ఒక పథకమును వేసెను. ముందు తన సైన్యమును దక్షిణాదికి పంపవలెనని శివాజీ నిశ్చయించెను. దానికై ఒక అర్జీని ఫులాద్ ఖానుద్వారా పాదుషాకు పంపెను. అది ఔరంగజేబున కంగీకారమే గాని, శివాజీ కోరిన యేపనినైనను చాల జాగ్రతగా నాలోచించి, సావధానతతో చేయవలయునని యెంచి నలుబది ఎనిమిది దినముల తరువాత శివాజీ సైన్యము మహారాష్ట్రమునకు పోవుట కనుజ్ఞ నిచ్చెను. శివాజీ పథకములోని రెండవ అంశము - రామసింహుని తనకై యిచ్చిన జమానతునుండి విడిపించుట. దానికొరకై శివాజీ 'రామసింహుని యింటిలో నుంచుటకన్న నన్ను వేరెక్కడైన నుంచగోరెద"నని పాదుషాకు జాబు వ్రాసెను. "రామసింహునిపై మాకు బాగానమ్మకమున్నది గాన నీవక్కడనే యుండవలె"నని పాదుషా దానికి సమాధానము పంపెను. అదిచూచి శివాజీ, నీజమానతును నీవుపసంహ

రించుకొమ్మని జామసింహునితో చెప్పెను. దానికాతడు నిరాకరించెను. తదనంతరము శివాజీ పాదుషాలమధ్య ననేక ఉత్తరప్రత్యుత్తరములు జరిగినవి.

"నేను సన్యాసము పుచ్చుకొనదలచితిని. కాన నన్ను కాశీకి పంపు"డని శివాజీ వ్రాయగా, "ఫకీరుగానయి అలహాబాదుకోటలో నుండు"మని పాదుషా వ్రాసెను. అలహాబాద్ దుర్గాధిపతి ఖైదీలను చంపుటలో ఘనతకెక్కినవాడు. "నాదగ్గరనున్న కోటల నన్నిటిని పాదుషావారికి యిచ్చివేసెదను. కాన నన్ను దక్షిణాదికి పంపు"డని శివాజీ వ్రాయగా "కోటలను మాస్వాధీనము చేయుచున్నట్లు నీవు కాగితమును వ్రాసియిచ్చిన మాకు చాలు" నని పాదుషా వ్రాసెను. ఈ ఉత్తరప్రత్యుత్తరములు పూర్తి అయిన తరువాత ఔరంగజేబు తనను వదలడనియు, అవకాశముచూచి చంపించగలడనియు శివాజీ పూర్తిగా విశ్వసించెను.

దక్షిణమున బీజపూరు గోల్కొండ రాజ్యములను తన సరదారులు జయించలేకుండుటచే తానే స్వయముగా దక్షిణాదికి పోవలయునని పాదుషా భావించెను. పాదుషా దక్షిణమునకువచ్చుట జయసింహున కిష్టములేదు. అందుచేత "లోగడ నేను శివాజీని దక్షిణమునకు పంపుడని వ్రాసికొంటిని. కాని నేడు యిచట పరిస్థితి చాల క్లిష్టముగానున్నది. కాన శివాజీని యిటకు పంపుటకన్న ఆగ్రాలోనుంచుటయే శ్రేయస్కరము. కాని శివాజీ ప్రాణములకుగాని, స్వాతంత్ర్యమునకుగాని అపాయమున్నట్లు యిచటనున్న అతని సరదారులకు తెలిసినచో, వారు బీజపూరువారితో చేతులు కలిపెదరు. అప్పుడు పరిస్థితి

మరింత క్లిష్టము కాగలదు" అని పాదుషాకు జాబు వ్రాసి వేరొకజాబును కుమారుడగు రామసింహునకు వ్రాసెను. దానిలో శివాజీకి తానొసంగిన జమానత్ నుండి విడిపించు కొనుటకుగాను పాదుషాతో బయలుదేరి దక్షిణమునకు రమ్మని వ్రాసెను. తండ్రిఆజ్ఞప్రకారము తనజమానత్ నువిడిపించుకొను టకై రామసింహుడు ప్రయత్నించెను. ప్రస్తుతము ఫులాద్ ఖాన్ స్వాధీనములోనున్నందున, రామసింహుని జమానత్ అక్కర లేదని పాదుషా రామసింహుని కోర్కెను మన్నించెను. రామసింహుని కోర్కె మన్నింపబడుటవిని రామసింహునికంటె శివాజీయే అధికముగా సంతోషించెను. రామసింహునకు మాట యిచ్చియున్నందున అంతవరకు శివాజీ ఆగ్రా వీడి పోవుటకు వీలులేకపోయినది. ఇప్పుడాతడెట్లు పారిపోయినను రామసింహునకు కష్టమేమియు కలుగదు. తన బాధ్యత తీరి పోయినను శివాజీప్రాణములను కాపాడు నుద్దేశ్యముతో రామ సింహుడు తనసేవకులను యథాపూర్వముగా శివాజీ బసలోనే యుంచెను. దక్షిణమున పరిస్థితి మరింత క్లిష్టముగా నున్నదని వ్రాయుటలో జయసింహుడు ఆశించిన ప్రయోజనము లభించి నది పరిస్థితి క్లిష్టముగానున్నదనిన, ఔరంగజేబు దక్షిణము నకు రాడని జయసింహుడు భావించినట్లే ఔరంగజేబు తాను దక్షిణమునకు వెళ్ళుటలేదని ప్రకటించెను.

శివాజీ మహారాజు వేసిన పథకము ప్రకారముగా పను లారంభ మయినవి. శివాజీని చంపుటకు పాదుషాకూడ ఒక పథకము వేసెను. తన సర్దారగు ఫిదాయి హుసేను నిర్మించు చున్న క్రొత్తయిల్లు పూర్తికాగానే శివాజీని ఆ యింటిలోనికి

మార్చి, రామసింహుని మనుష్యులను అందు రానీయకుండ, శివాజీని హతమార్చవలెనని పాదుషా భావించెను.

తన పథకమున కవసరమైన ధనమును శివాజీ రామసింహునిద్వారా సంపాదించెను. రామసింహుడు ఆగ్రాలో నరువదియారువేల రూప్యములు శివాజీ కీయగా, ఆమొత్తము రాజగఢనుండి జయసింహునకు తిరిగి ముట్టెను. పథకము ప్రకారము శివాజీకి ఆషాఢమాసమున సుస్తీచేసెను. అది రోజు రోజుకూ పెరుగుచుండెను. మందులు పనిచేయకుండెను. బ్రాహ్మణుల, సాధువుల ఫకీరుల యాశీర్వాదము పొందుటకై వారికి తీపి పదార్థములు పంపించుటకు నిర్ణయము జరిగెను. తీపి పదార్థములు చాలమందికి పంపవలయును గాన పెద్ద పెద్ద పెట్టెలు తయారు చేయబడెను. కావిడ కిరుప్రక్కల రెండు పెట్టెలు తగిలించుకొని, ఒకమనిషి తీపి పదార్థములను శివాజీవద్దకు తెచ్చెడివాడు. వానిని శివాజీ మరల అచటనుండి అందరకు పంపించెడివాడు. ఈపెట్టెలు వచ్చిపోవునప్పుడు, బయటనున్న రక్షకభటులు పరీక్షించెడివారు. ఈ రక్షకులకు, ఫులాద్ ఖానుకుగూడ చక్కని తీపిపదార్థములు తరుచు దొరుకుచుండెను. శివాజీ ఆరోగ్యమునకు వీరి ఆశీర్వాదముకూడ అవసరము కదా! ప్రతి వారము నిర్ణీత దినములలో నీపెట్టెలు వచ్చిపోవుచుండెడివి.

శివాజీవెంట ఆగ్రాకు కవీంద్ర పరమానంద్ అని ఒక పండితుడు వచ్చెను. ఆతనిని మహారాష్ట్రమునకు పంపుటకు కూడ అనుజ్ఞాపత్రము వచ్చినది. ఆతనిని గౌరవించు నెపమున ధనము, ముత్యములు, రెండు ఏనుగులు, రెండు గుఱ్ఱములు, వస్త్రాలంకారములు ఆయనకిచ్చి వానితోబాటు తన దగ్గఱ

నున్న సామానంతయు శివాజీ మహారాష్ట్రమునకు పంపించెను. సైన్యమంతయు మహారాష్ట్రమునకు పోయెను. శివాజీవద్ద కొద్దిసామాను, కొద్దిమంది మనుష్యులు మాత్రము మిగిలిరి.

శ్రావణమాసారంభమున శివాజీ ఆరోగ్యము కొంత బాగైనది. తీపిపదార్థపు పెట్టెల రాకపోకలు మామూలుగ సాగుచున్నవి. పుణ్యపురుషుల యాశీర్వచనములవలన కొంత లాభమున్నది. ఆపెట్టెలు లోనికి వచ్చిపోవునపుడు తొలి రోజులలో రక్షకులు పరిశీలించెడివారు. పెట్టెలలో నెప్పుడును తీపి పదార్థములే యుండుటచే వారికి తనిఖీచేయుట క్రమముగ విసుగనిపించినది. వారి తీపి పదార్థములు వారికి దక్కుచుండుటచే క్రమముగ పెట్టెలను చూచియు చూడకయే పోనిచ్చుచుండిరి.

అది కృష్ణాష్టమి ఆరోజుననే శ్రీకృష్ణుని కంసుని ఖైదు నుండి వెలికి తీసుకొని వెళ్ళుట జరిగినది. ఆరోజున శివాజీ యారోగ్యము మరియు నీరసించినది. పరిచర్యచేసెడివారి ముఖములపై గూడ విచారము వ్యక్తమగుచుండెను. నవమి, దశమి, ఏకాదశిలుగూడ నిక్లే గడచినవి. ద్వాదశినాడు తీపి పదార్థముల పెట్టెలు చాలవచ్చినవి. వానిలో రెండు పెట్టెలు ఖాళీగా నున్నవి. మధ్యాహ్న సమయమున మహారాజు తన చేతికి ఉన్న బంగారు కంకణములు హీరోజీ ఫర్జంద్ చేతులకు తొడిగెను. తరువాత హీరోజీ మహారాజు మంచముపై పవళించెను. దుప్పటిని తలపైనుంచి కప్పుకొని, కంకణమున్న చేతిని బయటకు కనపడునట్లుంచి, సరిగా మహారాజు నిద్రించెడి పద్ధతిలోనే హీరోజీ శయనించెను. మహారాజుకు వళ్లు

పట్టు మదారీ మెహతర్ పదహారు సంవత్సరముల వయస్సు గలవాడు. ఆతడు తల్పముపై పవళించిన కొత్త మహారాజు పాదములు పిసుకుట కారంభించెను. శివాజీ, శంభాజీలు ఖాళీగా నున్న రెండు పెట్టెలలో కూర్చుండిరి. పిమ్మట పెట్టెలన్నియు బయటకు వెళ్ళసాగెను. మొదటనున్న మూడు నాలుగు పెట్టెలను మాత్రము పరీక్షించి వానినుండి తమకు కావలసిన తీపి పదార్థములను రక్షకులు సంగ్రహించిరి. తదనంతరము వచ్చిన పెట్టెలను చూడకుండ వారు పంపివేసిరి. రక్షకులు మొదటి పెట్టెలను వెదకుట చూచి శివాజీ సేవకులు భయపడిరిగాని భగవదనుగ్రహమున భయము తీరినది. ఇతర పెట్టెలు వాని స్థానముల కవి పోయినవి. రెండుపెట్టెలు మాత్రము తమకై ప్రత్యేకముగా నిర్ణీతమైన స్థలమునకు పోయినవి. అచ్చట నిరాజీ పంత్, దత్తోపంత్ రాఘోమిత్ర మొదలగువారు పెట్టెల కొఱ కెదురు చూచుచుండిరి. శివాజీ, శంభాజీలు పెట్టెలలోనుండి వెలికివచ్చిరి. అందరి కొఱకు గుఱ్ఱములు సిద్ధముగనున్నవి. వాని నధిరోహించి మరుక్షణమున నందరును బయలుదేరిరి. కొన్ని దినములనుండి అనారోగ్యముగనున్న శివాజీకి గుఱ్ఱముపై వాయువేగమున పయనించగలశక్తి ఒక్కసారిగా లభించినది. మధ్యలో నెక్కడను ఆగకుండా వారు పయనించి మధుర చేరిరి. మధురలో మోరోపంత్ పింగళే యొక్క బావమరిది కృష్ణాజీపంత్ శ్రీమల్ యుండెను. అతనివద్ద శంభాజీ నుంచవలెనని తొలుతనే నిర్ణయమయ్యెను. కాన శంభాజీని యచ్చటనే యుంచి మిగిలినవారు సన్యాసి వేషములుదాల్చి అవసరమైన ధనము వెంటతీసికొని క్షణమైన వృథాపోనీయక దక్షిణమునకు బయలుదేరిరి.

ఆగ్రాలోని మహారాజు తల్పముపై హీరోజీ ఫర్జంద్ శయనించియుండెను. అతడు శివాజీ గూఢచారులలో నతి ముఖ్యుడు. శివాజీ వెళ్ళినరోజు సాయంత్రమువరకు రక్షకులు అనేకపర్యాయములు లోనికి తొంగిచూచి శివాజీ నిద్రించు చుండెననియే భావించిరి. సాయంత్రము కనుచీకటి పడిన పిమ్మట హీరోజీ తల్పమునుండి లేచి, దానిపై నెవరో నిద్రించుచున్నట్లు భావన కలుగురీతిగా దిండ్లను లోడీలను అమర్చి వానిపై దుప్పటి కప్పెను. తరువాత హీరోజీ, మదారీ మెహతర్ లు యిద్దరును బయటకువచ్చి "మహా రాజునకు శిరోవేదనము తీవ్రముగనున్నది. కాన లోనికి ఎవ రినీ వెళ్ళనీయవద్ద"ని రక్షకులతో చెప్పి మందులు తెచ్చుటకై పోవుచుంటిమనుచు, మెల్లగా నటనుండి వెడలిపోయిరి. ఆ రాత్రియంతయు ఖైదులోనున్న మహారాజు ప్రశాంతముగా నిద్రించెను. మరునాడు తెల్లవారు ఝామున నే పాదుషా పథకము ప్రకారము శివాజీని ఫిదాయి హుస్సేను క్రొత్త యింటిలోనికి మార్చవలసియున్నది. తాడిదన్నువానికి, తల దన్నువాడు న్నట్లు శివాజీ ముందురోజుననే తప్పించుకొని పోయెను. ఉదయమెంత ప్రొద్దెక్కినను శివాజీ నిద్ర లేవకుండుట, బసలో పూర్తి నిశ్శబ్దముండుట చూచిన సైనికులు పరుగున పోయి ఫులాద్ ఖానుతో చెప్పిరి. ఫులాద్ ఖాను వచ్చి మహా రాజును నిద్ర లేపుటకు లోనికిపోయి, దిండ్లనుమాత్రమే అచట చూచెను. అతడు చాల భయపడెను. ఈవార్త తొలుత రామసింహునకు, పిమ్మట ఫులాద్ ఖానుద్వారా పాదుషాకు తెలిసినది. రామసింహుడు సంతోషించెను. పాదుషా నెత్తి నోరు కొట్టుకొనుచు ఆగ్రానుండి వెలికిపోవు మార్గముల

నన్నిటిని మూయించి, నగరమంతటను శివాజీకొరకు గాలించు టకు ఫులాద్‌ఖానున కాజ్ఞయిచ్చెను "శివాజీ పారిపోయెను. అతడు ఏ వేషముననైన యుండవచ్చునుగాన, చౌకీనుండి పోవు ప్రతి వారిని జాగ్రత్తగా పరీక్షించి వదలవలె" నని ఆజ్ఞాపత్ర ములను గుఱ్ఱపు సవారీలపై దేశములోని చౌకీల కన్నిటికి పంపెను. ఈ వార్తను తీసుకొని పోయిన రౌతులకంటె ఎన్నిరెట్లో గంటల ముందుగా శివాజీ చౌకీలను దాటుచు, దక్షిణమునకు వెళ్ళిపోయెను.

ఈ విధముగా సన్యాసుల గుంపు రాజగఢకుచేరి రక్ష కులతో, తాము రాజమాతను చూడగోరుచున్నామని చెప్పిరి. తన కుమారుడు బందీ యయిననాటి నుండి జిజియామాత సన్యాసులను తన కుమారుని క్షేమమును గుఱించి అడుగుచు వుండెడిది. కావున వెంటనే వారికి అనుమతి లభించినది. సన్యాసులు భవనముపైకి పోయిరి. జిజియాబాయి సముఖము నకు చేరగనే శివాజీ 'అమ్మా'యని తల్లి పాదములపై బడెను. జిజియాబాయి సంభ్రమాశ్చర్యములతో శివాజీని లేవనెత్తి ఆలింగనము చేసికొనెను. క్షణములపై నీ వార్త కోటదాటి స్వరాజ్యమునందంతట వ్యాపించెను. అందరూ అపరిమితా నందము నందిరి. 'శంభాజీ చనిపోయెను, మిగిలినవారు త్వరలో వత్తురు'అని శివాజీ తల్లితో చెప్పెను. తరువాత కవీంద్ర పర మానంద్, హీరోజీ ఫర్జంద్, మదార్ మెహతర్‌లు వచ్చిరి. మధురలోని కృష్ణాజీ పంత్ త్రిమల్‌కు జాబు చేరిన తర్వాత కొంతకాలమునకు శంభాజీని తీసికొని ఆతడు వచ్చెను. అప్పుడు శంభాజీ చనిపోయినాడని శివాజీ ఏల అసత్యమాడెనో అంద రును గ్రహించగల్గిరి.

రఘునాథపంత్ కోరడే, త్రయంబక పంత్ డబీర్‌లు మాత్రము ఆగ్రాలో ఔరంగజేబు చేతులకు చిక్కిరి. ఔరంగజేబు ఆజ్ఞ ప్రకారము వారిపై అనేక అత్యాచారములు జరుగుచున్నట్లు శివాజీకి తెలిసెను. వారిని విడిపించుటకై శివాజీ యోచించుచుండెను. "మీ అనుమతిలేకయే ఆగ్రానుండి తిరిగి వచ్చినందులకు క్షమించగోరెదను. నేటికిని నేను మీ ఆజ్ఞకు బద్ధుడను' అని శివాజీ ఔరంగజేబునకొక లేఖ వ్రాసెను. దక్షిణ భారతమున తన సైన్యములు ఓడిపోవుచున్న స్థితిలో క్రొత్త శత్రువును కొనితెచ్చుకొనుట శ్రేయస్కరము కాదని ఔరంగజేబు భావించెను. ఫలితముగా శివాజీ, ఔరంగజేబుల మధ్య ఒక ఒప్పందము కుదిరెను. దాని ప్రకారము రఘునాథ పంత్ కోరడే, త్రయంబకపంత్ డబీర్‌లు శివాజీ రాజగఢ్ చేరిన తర్వాత పదునాలుగు నెలలకు విడుదలచేయబడిరి. ఈ విధముగా శివాజీ తన పరివారములో ఒక్కరును ప్రమాదమునకు గురికాకుండ ఆగ్రానుండి తిరిగివచ్చెను; ఔరంగజేబు ఎత్తుకు పైయెత్తు వేసి ఘన విజయమును సాధించెను.

* * *

# పట్టాభిషేకము

శివాజీ ఆగ్రా ఖైదునుండి తప్పించుకొని, రాజగఢ్ చేరిన వెంటనే, ఆ ప్రయత్నములో తనకు సహాయము చేసిన వారందరికి ఉచితరీతిని బహుమతులొసంగెను. ఖైదు జీవితము నందలి కష్టము, మార్గాయాసము శివాజీని, తదనంతరము నెలదినముల వరకు పడక దిగనీయలేదు.

స్వస్థుడయిన తరువాత శివాజీ తనరాజ్య పరిస్థితిని, శత్రురాజ్యముల స్థితిగతులను శ్రద్ధగా పరిశీలించెను. స్వరాజ్య స్థాపన నాటినుండి యేండ్లతరబడి యుద్ధములుజరుగుచున్నందు వలన ప్రజలు చాల కష్టములకు లోనయిరి. ఈ పరిస్థితిని చక్క దిద్ది స్వరాజ్యమును అన్ని విధములుగా సుదృఢ పఱచుట ఆవశ్యకమాయెను. యుద్ధ ప్రయత్నములు లేనిచో ప్రజలకు సౌకర్యములు కలుగ జేయుటకు సదవకాశము లభింపగలదు. దాని కొఱకు శత్రురాజులతో నొడంబడిక కుదుర్చుకొనుటకు శివాజీ యూహించెను. ఆగ్రాలో ఔరంగజేబు నిర్బంధమున రఘునాధ్ పంత్, త్రయంబక్ పంత్ లింకా కాలము గడుపు చుండిరి. వారిని విడుదల చేయించుటకూడ అవసరము. ఈ కారణములచే శివాజీ ఔరంగజేబునకు జాబువ్రాసెను, 'మీ అనుమతి లేకుండా ఆగ్రానుండి వచ్చినందులకు మీ సేవకుడు క్షంతవ్యుడు. నా కుమారుడగు శంభాజీని పాదుషావారి సైన్యములో కొలువుకు చేర్పించెదను. నా యధీనములోని కోటలు, యావదాస్తి మీ సేవకై అర్పింపబడినట్లే'యని శివాజీ వ్రాసిన జాబును ఔరంగజేబు చూచెను.

శివాజీయొక్క బుద్ధికుశలత పాదుషా బాగుగా నెఱుగును. ఇట్టిడుత్తరమువలన అతడు మోసపోఁజాలడు. శివాజీపై ఔరంగజేబుకు కోప, ద్వేషములు గలవు. శివాజీని నాశన మొనర్పవలెనని తనకు యెంతటికోరిక యున్నను అతనిని జయింపగలవాడెవ్వడు ప్రస్తుతము తనవద్ద లేడు. పైగా ఇరాన్ ప్రభువు హిందూదేశముపై దాడిచేయబోవుచున్నా డను వార్త యొకటి వచ్చెను. ఔరంగజేబు ఇవియన్నియు నాలోచించి శివాజీతో నొప్పందము చేసుకొనెను. ఒడంబడిక ననుసరించి రఘునాథపంత్, త్రియంబక పంత్‌లు జైలునుండి విడుదలయి రాజగఢ్ వచ్చిరి. శంభాజీ ఢిల్లీ కొలువులో చేరెను.

శంభాజీ ఢిల్లీవారిక్రింద సర్దారుగా జేరుటలో శివాజీ కొక ఉద్దేశ్యము గలదు. శంభాజీకి సైన్యపోషణ వ్యయము క్రింద స్వరాజ్యముయొక్క ఉత్తర సరిహద్దునకు ఆనియున్న ఔరంగాబాద్. బీరార్ వైపు కొంత జాగీరును ఔరంగజేబియ వలసియుండును. భవిష్యత్తున చేయు స్వరాజ్యవిస్తరణ యత్నములో ఆ జాగీరు నొకమెట్టుగా ఉపయోగించవచ్చునని శివాజీ భావించెను.

ఔరంగజేబుతో సంధి కుదిరిన పిదప తన పూర్తిసమయమును, ధ్యానమును శివాజీ స్వరాజ్యమును స్థిరపరచుటకు వెచ్చించెను. ఆయన చేసిన మొదట పని "భూమిశిస్తు" ఏర్పాటు చేయుట. భూమియొక్క వనరును బట్టి పండుపంటను బట్టి ఎంత పన్ను వేయవలెనను విషయమును శ్రద్ధగా పరిశీలించి నిర్ణయించుటకు గ్రామములోని దేశముఖ్, దేశపాండే.

పటేల్‌తో బాటు గ్రామములోని మరి నలుగురు పెద్దలతో కూడిన సంఘములను నియామకము జేసెను. ఈ పద్ధతివలన రైతులకు అన్యాయము జరుగకుండ, శిస్తులు వసూలగుటకు సౌకర్యము కలిగినది. రైతులు తమ భూముల స్థితిగతులను బట్టి పన్నులు నిర్ణయింపబడినందుకు సంతోషించిరి. ఈపన్నులను ప్రజలు ధనరూపములోగాని, ధాన్య రూపములోగాని చెల్లించుకొనవచ్చును. ఈ సౌకర్యము వలన రైతులు చాల లాభమునందిరి. ప్రభుత్వము వద్ద ధాన్యాగారము కూడ ఏర్పాటైనది.

స్వరాజ్య వ్యవస్థలో వతన్‌దారుల (గ్రామోద్యోగులు), ఈనామ్‌దారుల, జాగీర్దారుల నియామకము విషయమున శివాజీ కొత్త పద్ధతిని ప్రవేశపెట్టెను. నాటివరకు వంశపారంపర్య పద్ధతితో వచ్చిన ఈ 'అధికారులు' స్వరాజ్యమున కొక 'శాపము' గా నుండెడివారు. మహమ్మదీయ సుల్తానుల పాలనలో నివి ప్రారంభమయినవి.

శాసనాధికారులయిన పటేల్, కులకర్ణి, దేశ్‌ముఖ్, దేశపాండే, సర్ దేశ్‌ముఖ్, సబ్నిస్, ముజుమ్‌దార్ మొదలగు ఈ పదవులు వంశ పారంపర్యముగా నియమింపబడుటచే, తరచు యోగ్యతలేని వారధికారములోనికి వచ్చెడివారు. గృహ కలహములు జరిగెడివి. ప్రజలకు అన్యాయములు జరిగెడివి. ఈ పదవులన్నింటికి వేతనముల పద్ధతిపై ఉద్యోగులను నియమించుట సరియగు పద్ధతి యని శివాజీ మహారాజు యోచించి దానిని ప్రవేశపెట్టెను. స్వరాజ్యములో క్రొత్తగా జాగీరులను ఇచ్చుట మానివేసెను. అయినప్పటికిని కొన్ని

ప్రత్యేక పరిస్థితులలో కొన్ని జాగీరులు ఇవ్వవలసి వచ్చెను. క్రొత్తగా జాగీరులను ఇవ్వనందునను, ఉన్న జాగీర్దారుల విషయములో ననేక నియమములు ఏర్పరుచుటవలనను ప్రజలకు చాల సుఖము గలిగెను. కాని ఈ క్రొత్తపద్ధతులవలన నష్టపడిన కొద్దిమంది స్వార్థపరులు, "శివాజీ ధర్మ సంస్కృతులను నాశనము చేయుచున్నాడ" ని ప్రచారం చేయుచు, శివాజీకి వ్యతిరేకులయిరి. వ్యాపారస్థులు, గుత్తదారులు, దళారులు, వడ్డీవ్యాపారులు - వీరందరిపై శివాజీ నియమావళిని ఏర్పరచుటచేత ప్రజలలో అధికసంఖ్యాకులకు సుఖముకల్గెను. ప్రభుత్వ వ్యవస్థలోని చిన్న, పెద్ద అధికారులకు చక్కని క్రమశిక్షణ అలవరచుటచేత అధికారులలో లంచము తీసుకొను దురలవాటు తగ్గిపోయెను. సాధు, సంతుల పట్ల మహారాజుకు గౌరవము మెండు. అయినను వారు పరిపాలన విషయములలో జోక్యము కలిగించుకొనుటకు శివాజీ ఎన్నడును అవకాశ మీయలేదు.

ప్రజలందరికి న్యాయము లభింపజేయు ఉద్దేశ్యముతో ఉత్తమమైన, సులభమైన న్యాయవ్యవస్థను శివాజీ నిర్మించెను. సమాజ వ్యవస్థను రూపొందించుటలోగూడ మహారాజు మొదటినుండియు విప్లవాత్మకమైన మార్పులను తెచ్చెను.

ఇక సైన్యమును వేర్వేరు విభాగములుగజేసి, దాని కొక చక్కని వ్యవస్థ నేర్పరచెను. పదాతిదళము, అశ్విక దళము, నౌకాదళము, ఫిరంగిదళము అను నాలుగు విభాగములు స్వతంత్రములుగ పనిజేసెడివి. దుర్గ విభాగము గూడ స్వతంత్రముగ నుండెడివి. ప్రతి విభాగమునకు వేర్వేరు

అధికారులు వేరువేరు నియమములు ఉండెడివి. సాధారణముగ వర్షాకాలములో సైనికులందరును తమ తమ శిబిరములకు పోయెడివారు. మిగిలిన ఎనిమిది నెలలు యుద్ధము చేయుచుండెడివారు. యుద్ధములకు వెళ్ళునపుడు సైనికులు తమ వెంట తమ స్త్రీలను తీసుకొని వెళ్ళుటకు వీలుండెడిదికాదు. శత్రువులయొక్క స్త్రీలపై అత్యాచారములు సల్పుటకు, గోవులను బాధించుటకు అనుజ్ఞ యుండెడిది గాదు. చేసిన లూటీకి లెక్కలు పూర్తిగా జూపవలసి యుండెడిది. ఈ నియమములకు వ్యతిరేకముగ ప్రవర్తించువారికి కఠినశిక్షలుండెడివి. అన్ని వర్గముల ప్రజలకు వారి వారి యోగ్యతలను అనుసరించి సైన్యములో ప్రవేశముండెడిది. క్రమశిక్షణ కట్టుబాట్లు చక్కగా ఉండెడివి.

ఆ కాలములో దక్షిణాదిన మొగలు సుబేదారు ఔరంగజేబు కుమారుడైన 'మొఆజ్జం'. ఢిల్లీతో వ్యవహారములు శివాజీ ఈతని ద్వారానే జరుపవలసి యుండెను. తన తండ్రి ప్రవర్తనకు పూర్తి విరుద్ధముగ నీతడు శివాజీపట్ల చాలా ప్రేమతో వ్యవహరించెడివాడు. దీనికి రెండు కారణములున్నవి. యుద్ధ కోలాహలములతో కూడిన జీవితముకన్న శాంతియుత జీవితము అతనికి ఎక్కువ ఇష్టముగ యుండెడిది. ఇంతేగాక, 'ఢిల్లీశ్వరుడు మినహా హిందూదేశములో శివాజీ అంతటి శక్తిమంతుడా కాలమున ఇంకెవరును లేర'ని అతని నమ్మకము. తన తండ్రియగు ఔరంగజేబు అనంతరము తానే ఢిల్లీ సింహాసనముపై కూర్చుండవలెనని అతనికి గట్టికోరిక యుండెడిది. శివాజీ పట్ల స్నేహముగానున్నచో భవిష్యత్తులో

శివాజీ దీనిలో తన కుపయోగపడవచ్చునని ఆతడు అనుకొనెను. మొఅజ్జం యొక్క ఈ ప్రవర్తన నాటి శివాజీ ఆలోచనలకు అనుకూలముగ యుండెడిది. అందువలన మొగలులతో శివాజీయొక్క సంబంధములు కొంతకాలమువరకు సద్భావముతోను, శాంతియుతముగాను కొనసాగినవి. ఆ సమయమున శివాజీ మొగలాయిలతో కాక మిగిలిన శత్రువులతో యుద్ధము చేయవలసివచ్చెను. శివాజీ ఆగ్రానుండి రాజగఢ్ తిరిగివచ్చులోగా శివాజీ సరదారులలో నొకరైన రావుజీ సోమనాథ్ బీజపూరు వారి రాంగణా కోటను హస్తగతము జేసుకొనెను. దానిని తిరిగి స్వాధీనము జేసుకొనుటకై బీజపూర్ సుల్తాన్ తన సర్దారులగు బహలోల్‌ఖానును, శివాజీ సోదరుడైన ఏకోజీ రావును రాంగణా కోటపైకి పంపెను. అప్పుడే శివాజీ ఆగ్రా నుండి తిరిగివచ్చి రోగగ్రస్తుడాయెను. ఆదిల్‌షాహ తన తమ్ముని తనపైకి పంపించిన కారణము శివాజీ గ్రహించెను. అయినను స్వరాజ్యాన్ని స్వంత తమ్ముడే వ్యతిరేకించుట సహించలేక, శివాజీ అతనితో స్వయముగా యుద్ధముచేసి ఓడించి పంపించెను. గత్యంతరములేక ఆదిల్‌షాహ శివాజీతో 1666 సెప్టెంబరు మాసములో ఒప్పందము చేసికొనెను.

ఇట్లు మొగలులనుండి, బీజపూరు నుండి దాడులు ఆగిపోయిన సమయమున శివాజీ మహారాజు పోర్చుగీసు వారిపై దాడులు చేయించెను. వారినుండి కొంత ప్రదేశము హస్తగతమయినది; కాని శివాజీ వారిని పూర్తిగా ఓడించలేకపోయెను.

హిందూదేశమునంతనూ తన యధీనములోనికి తెచ్చుకొని, ఇస్లాం మతానుయాయిగా జేయవలెనని యౌరంగజేబు

వాంఛించుచుండెను. ఆ కోరిక త్వరలో సఫలమగు సూచనలు కనుపించుటలేదు. దక్షిణములో శివాజీ స్వతంత్ర హిందూ రాజ్యమును స్థాపించుకొనెను. అదే సమయములో అస్సాం ప్రాంతమున లాచిత్ బిడ్ఫుకన్ మొగలుల యొద్దనుండి గౌహతీని జయించెను (1667). వీరిద్దరిని అణచివేయుట ఔరంగజేబు కంత సులభముగా కనబడుటలేదు. అతని దృష్టి తన రాజ్యము లోని ప్రజలలో నధికసంఖ్యాకులైన హిందువుల మీదికి మళ్ళినది. అక్బరు ప్రవేశపెట్టిన సౌరమాన కాలగణనమును నిలిపివేసి, ఇస్లాం పద్ధతియగు చాంద్రమానమును ఔరంగజేబు ప్రారంభించెను. ప్రజలు హిందువులుగా జీవించుట యసంభవము చేయు నుద్దేశ్యముతో ననేక ఆజ్ఞలను అతడు జారీచేసెను. ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు, శిల్పకళానిపుణులు, వ్యవసాయదారులు మొదలగు నన్ని తరగతుల హిందూ ప్రజలను పీడించుట ప్రారంభమాయెను. అనేకమంది హిందువులు బలాత్కారముగా మతము మార్పించబడిరి. మొగలాయీ రాజ్యములో నూటికి ఎనుబదిమందియున్న హిందువు లీ అన్యాయములను, అత్యాచారముల నెట్లు సహించుచున్నారా యని శివాజీ ఆశ్చర్యపడెను. శత్రువులు చేయు అకృత్యములకు ప్రతిగా వారినిదూషించి యూరకుండు స్వభావము శివాజీకి లేదు ప్రతి హిందువు తన బంధుకోటిలోని వాడు. హిందువుల మీాద జరుగు నన్యాయములను, అత్యాచారములను ఆపివేసి, హిందువులను స్వతంత్రులుగా చేయవలెనను మహదాశయముతో స్వరాజ్యస్థాపన చేయుట శివాజీ యభిమతము.

హిందువులను బాధించుచూ ఔరంగజేబు చేయు నాజ్ఞలసంఖ్య రోజురోజుకు పెరుగుచుండెను. తన రాజ్యము

లోని హిందూ దేవాలయము లన్నిటిని విధ్వంసము చేయవలెనని ఔరంగజేబు ఆజ్ఞ యిచ్చెను (9-4-1669). ఆ ఆజ్ఞానుసారము ఔరంగజేబు యొక్క సైన్యము హిందూ మందిరములను కూలద్రోయుట, 'కాఫరు' లైన హిందువులను హత్య చేయుట, వారి మతమును బలాత్కారముగా మార్చుట మొదలగు అకృత్యములను జరిపెను. ఔరంగజేబు సైనికులు కాశీలో నున్న పవిత్రమైన విశ్వనాథుని మందిరమును విధ్వంసము జేసిరి. మధురలో యున్న శ్రీ కేశవదేవ మందిరమును, సౌరాష్ట్రములోని సోమనాథ దేవాలయమును కూడ కొల్లగొట్టిరి.

శివాజీని నాశనము జేయుట సాధ్యముకాక, అనేక బాధలకైన నాతనినిగురిచేయవలెనని ఔరంగజేబు తలంచెను. శివాజీని ఆగ్రా పిలిపించినప్పుడు ప్రయాణ వ్యయము కొరకొరక లక్ష రూపాయలను పాదుషా శివాజీ కిచ్చెను. నేడా సొమ్మును శంభాజీ యొక్క బీరారు జాగీరునుండి తిరిగి వసూలు చేయించెను. అతిథులకొరకు పెట్టిన ఖర్చును అతిథి జేబునుండి తీసుకొను "సభ్యత" ను ఔరంగజేబు ప్రదర్శించెను. ఇంతమాత్రముతో తృప్తి జెందలేదు. శంభాజీయొక్క సైన్యమును, జాగీరును చూచుటకు ప్రతాప్‌రావు గుజర్, నిరాజి ఆవజీ అనువారు ఔరంగాబాదులో యుండిరి. వారిని బందీజేసి ఆ జాగీరును జప్తు చేయవలెనని ఔరంగజేబు మొఅజ్జంకు రహస్యముగా ఆజ్ఞలను పంపెను. ఈ ఆజ్ఞాపత్రము చేరుటకు ఎనిమిది, పది రోజులు ముందుగనే మోఅజ్జంకు అందలి వివరములు తెలిసినవి. ఆయన ప్రతాపరావును,

నిరాజీని పిలిపించి, స్వసైన్యముగా పారిపొండని సూచించెను. వారిద్వురును తమవద్దగల 2,500 ల సైన్యముతో పారిపోయిరి. బీరార్‌లో యున్న జాగీరును రావుజీ సోమనాథ్ 2,500 ల సైన్యముతో పాలించుచుండెను. ఈ వార్త విని అతడు కూడ పారిపోయెను. రావుజీ సోమనాథుడు రిక్తహస్తములతో మహారాజువద్దకు వెళ్ళుట కిష్టములేక మొగలు రాజ్యములోని ప్రదేశములను లూటీజేసి ఆ సంపదను వెంటగొని స్వరాజ్యమునకు వచ్చెను. పాదుషావారి ఆజ్ఞాపత్రములు ఔరంగాబాదు చేరులోపున హిందూ సర్దారులు పారిపోయిరని మొఅజం ఔరంగజేబుకు తెలియజేసెను (11-12-1669).

అది విని క్రోధోద్రిక్తుడైన ఔరంగజేబు శివాజీపై దాడి సలుపుటకు యోచించు చుండెను. లోగడ జరిగిన ఒప్పందముల వలన శివాజీకి, సైన్యమునకు, ప్రజలకు కావలసినంత విశ్రాంతి లభించెను. సైనికుల గృహలక్ష్ములు పరాక్రమమును జూపుటకై యుద్ధమునకు బయలు దేరుడని భర్తలను పురికొల్పుచుండిరి. పురందర్ ఒప్పందము ననుసరించి ఇవ్వబడిన కోటలు మరల తమ పుట్టినింటికి రావలెనని ఉవ్విళ్ళూరు చుండెను. ఔరంగజేబు చేయుచున్న అన్యాయముల నెదిరించి తమ్ము రక్షింపవలెనని ప్రజలుకూడ మొర పెట్టుకొనుచుండిరి. ఔరంగజేబు దాడి ప్రారంభించుటకు ముందు తానే స్వయముగ 'నెదురు దెబ్బ' తీయవలె నను సంకల్పముతో మహారాజొక పథకమును తయారుచేసుకొనెను. దాని ప్రకారము స్వరాజ్య సేనలు శత్రువులపై దాడికి బయలు దేరెను (1670 జనవరి).

మొగలులపై జరుపు దాడులకు మొదటి మెట్టుగా సింహాగఢ్ కోటను ముట్టడించిరి. కొద్దిమందిని తీసుకొని శివాజీకి కుడిభుజమైన తానాజీ మాల్సురే సింహాగఢ కోటపై నొక రాత్రివేళ దాడిసలిపెను (4-2-1670). ఆ యుద్ధములో ఆ కోటకు అధిపతిగాయున్న ఉదయభానుడును, తానాజీయును పరస్పరము పోరుసల్పి మరణించిరి. అయినను తానాజీ తమ్ముడైన సూర్యాజీ తన సైనికులకు ధైర్యము జెప్పి, యుద్ధమును కొనసాగించి ఆ కోటను హస్తగత మొనర్చుకొనెను. ఆ విధముగా తానాజీవంటి యొక పురుష సింహమును బలిపెట్టి, సింహాగఢమును స్వాధీనము చేసుకొని, సింహనాదము చేసి శివాజీ సైన్యము ముందుకు సాగెను.

నిలోపంత్ ముజమ్‌దార్ పురందరకోటను, లోహాగఢ్, కోటను జయించెను (8-3-1670). ఆ సంవత్సరము వర్షాకాలములో గూడ స్వరాజ్యసైనికులు సెలవు తీసికొనలేదు. పోరాటములు జరుగుచుండెడివి. సూరత్ నగరము లూటీ చేయబడెను (5-10-1670). లూటీ చేయబడిన ధనముతో మహారాజు స్వయముగా బీరారులో వెళ్లుచుండగా, వణిదిండోరి వద్ద ఇఖ్‌లాన్‌ఖాన్, దావూద్‌ఖాను లను మొగలు సర్దారులిద్దరితో పెద్ద యుద్ధముజరిగెను. ఆ యుద్ధములో వారిద్దరు పూర్తిగా నోడింపబడిరి. అచ్చటనుండి మహారాజు బరహాణ్‌పూర్ వైపుగా వెళ్లెను. అక్కడ గల కారంజా యను సంపన్నమగు నగరమును లూటీజేసెను. తరువాత ముందుకువెళ్ళి సాల్‌హేర్ కోటను స్వాధీనము జేసుకొనెను (5-1-1681).

బీరారును, ఖాన్‌దేశ్ లోని మొగలుల ప్రదేశములను శివాజీ ఆక్రమించెనని తెలిసిన ఔరంగజేబు దిలేర్‌ఖానును

గుజరాత్ సుబేదారు బహాదూర్ ఖానును శివాజీ మీదకు పంపెను (9-1-1671). ఆజ్ఞ నందుకొనిన మరుక్షణమే దిలేర్ ఖాను ఖాన్‌దేశ్ వైపు బయలుదేరెను. అతని సైన్యములో ఛత్రసాల్ బుందేల్ అను వీరుడుకూడ యుండెను. లోగడ ఔరంగజేబుతో జరిగిన పోరాటములో ఛత్రసాల్ యొక్క తండ్రియైన చంపతరాయ్ 1661 లో చంపబడెను. అయినను ఛత్రసాల్ జీవనోపాధికై మొగలు కొలువున చేరెను. మొగలు సర్దారయిన జయసింగు శివాజీ మీద దాడి జేయుటకు వచ్చునప్పుడు ఛత్రసాలు డా సేనతో వచ్చెను. తదనంతరము శివాజీ ఆగ్రా పయనము, ఆగ్రాఖైదు నుండి పారిపోవుట, స్వరాజ్య విస్తరణము చేయుట మున్నగునవి చూచిన ఛత్రసాల్ యొక్క మనస్సులో స్వదేశ, స్వధర్మములకొఱకు పాటుపడవలెనను కోరిక పుట్టెను. దిలేర్ ఖాను వెంట ఖాన్‌దేశ్ వైపు వచ్చుచుండగా, వేటకు వెళ్ళు నెపముతో ఖాన్ వద్ద యనుజ్ఞపొంది ఛత్రసాలుడు సైన్యము నుండి తప్పించుకొని, శివాజీని చేరుకొనెను. ఛత్రసాల్ గురించి శివాజీకి మొదటినుండియు తెలియును. శివాజీ ఛత్రసాలునకు గొప్ప స్వాగతమిచ్చి, కొన్నిరోజులు తనవద్ద నుంచుకొనెను. దేశభక్తి గురించి యింతకు మునుపు ఛత్రసాలుని మనసున మెదిలిన భావములు శివాజీ సాన్నిహిత్యమున పవిత్రమైన సామ్రాజ్యపు వాతావరణములో బాగుగ గట్టిపడినవి. శివాజీ సైన్యములో తానొక సైనికుడుగ చేరి దేశసేవ చేతునని ఛత్రసాలుడనెను. 'ఢిల్లీ ఆధీనమునుండి నీ జన్మస్థలమైన బుందేల్‌ఖండ్ సంస్థానమును స్వతంత్రముగా జేసి స్వరాజ్యమును స్థాపించు'మని శివాజీ ఛత్రసాలునకు సలహానిచ్చెను.

ఈ సలహాను పాటించి, ఛత్రసాలుడు శివాజీనుండి స్ఫూర్తిని గ్రహించి, బుందేల్ ఖండ్ చేరి, మొగలులను తరిమికొట్టి హిందూరాజ్య స్థాపనము చేయగలనని ప్రతిజ్ఞనుఁజేసి బయలు దేరెను. అప్పటికి ఛత్రసాలున కిరువది సంవత్సరములు మాత్రమే !

ఔరంగజేబు బరహాణ్‌పూర్‌లో నున్న మహబత్ ఖానును కూడ శివాజీపై దాడి చేయమని ఆజ్ఞాపించెను. దాని ప్రకారము మహబత్ ఖాను ఖాన్‌దేశ్‌లో యున్న అహివంతి కోటను పట్టుకొనెను (1671 ఫిబ్రవరి). తదుపరి వర్షాకాలము గడచునంతవరకు నందరును మిన్నకుండిరి. దిలేర్‌ఖాను, బహదూర్ ఖానులు సూరత్‌లో యుండిరి. తరువాత అక్కడ నుండి వారిద్దరు బయలుదేరి సాల్హేర్‌గఢ్ కోటను ముట్టడించిరి. ఆ కోట చాలపెద్దదిగానూ, పటిష్ఠముగానూ ఉండెడిది. దాని రక్షణకై శివాజీ చక్కని వ్యవస్థను రచించెను. మొగలాయీలు పెద్దఎత్తున ముట్టడిని చేసిరి. కోటలో సైన్యమునకు ధన సామాగ్రికి కరువులేదు. అరువది వేల సైనికులతో ముట్టడి జరిగెను. ఇదే సమయమున ఇతర సైన్యములు కూడ శివాజీ యొక్క రాజ్యముపై దాడి సల్పెను. ప్రళయ కారకమగు విశాల సేనాసాగరమును పాదుషా శివాజీ రాజ్యముపైకి మళ్ళించెను. శివాజీ కూడ సమతల మైదానములో ముఖాముఖిని యుద్ధముచేసి ఔరంగజేబు సేనలను జయించ వలెనని నిర్ణయించెను. మోరోపంత్ పింగలే, ప్రతాపరావు గుజర్ లిద్దరు ఇరువైపుల నుండి దాడిచేసి 'సాల్హేర్' ను రక్షించుకొనవలెనని శివాజీ సూచించెను. అప్పుడు మహారాజు రోహిడా, లోహగఢ్ కోటలవద్ద విడిసియుండెను.

అప్పటివరకు శివాజీ ఎన్నడునూ ఇంత పెద్ద సైన్యముతో సమతల మైదానములో యుద్ధము చేయలేదు. ఈ భీషణ యుద్ధములో శివాజీయొక్క స్వరాజ్య సేనలకు పూర్తివిజయము లభించెను. అంతేగాక మొగలాయీల యొక్క భారీ సైన్యములనైననూ మైదానములో నెదిరించి సమరము సలిపి, విజయము సాధింపగలశక్తి హిందువులలో నిర్మాణమైనదని అపుడు ఋజువయినది (1672 ఫిబ్రవరి).

ఈ విజయము కారణముగ స్వరాజ్య సైనికులలో నాత్మవిశ్వాసము గట్టిపడెను. శివాజీ నిర్మించిన స్వరాజ్యము చాలశక్తివంతమైనదని చాలమంది గ్రహించిరి. భవిష్యత్తులో శివాజీపై దాడి చేయవలెననిన ముందు వెనుక లాలోచించుట అవసరమని శివాజీ శత్రువులు తెలిసికొనిరి. ఔరంగజేబు ఈ పరాజయమునకు స్తంభించిపోయెను. ఆతని క్రాగ్రహము తలమునకలయ్యెను. "యుద్ధములో ఓడిపోయి బ్రతుకుటకంటె మీరెందుకు చావలేద"ని నిందించుచు దిలేర్‌ఖాను, బహదూర్ ఖానులకాతడు లేఖలు వ్రాసెను. దీనికి జవాబుగ "ఆగ్రాఖైదునుండి శివాజీ ఏ విధముగ పారిపోగలెనను సంగతి మీరు కొద్దిగ ఆలోచించిన యెడల, శివాజీతో యుద్ధములో మేమేవిధమైన లోపము చేయలేదను విషయము మీకు బోధపడు"నని బహదూర్ ఖాను వ్రాసెను. బహదూర్‌ఖాన్ యొక్క మాతృస్తన్యములను ఔరంగజేబు సేవించియుండుట వలన అతనికింత సాహసము కలిగెను. లేఖలోని విషయములను గ్రహించుకొని ఔరంగజేబు బహదూర్ ఖాను నేమియు ననజాలకపోయెను. అతనికి "కోకలతాస్" అను బిరుదును ప్రదానము చేసెను.

బహదూర్ ఖాన్ లేఖను బట్టి ఎవరుగాని శివాజీని గెల్చుట అసంభవమని తేలినది. శివాజీ అనంతరము ఆంగ్లేయులు పరస్పరము వ్రాసుకున్న ఉత్తరములను పరిశీలించినచో వారిదృష్టిలోగాని, తదితర రాజుల సుల్తానులదృష్టిలోగాని శివాజీ యొక్క 'గుండా'గాని, "దోపిడీ దొంగ" గాని కాదనియు అతడు గొప్ప సేనాపతియనియు, రాజనీతిజ్ఞుడనియు వారు భావించిరని తెలియును. ఈ సమయములోనే శివాజీని, ఆయనగడించిన యశస్సును శ్లాఘించు సమర్థ రామదాసస్వామి వలన శివాజీకి ఒక లేఖ వ్రాసెను (2-4-1672). శివాజీ ద్వారా హిందువులలో నజేయమైనశక్తి నిర్మాణ మగుచున్నందుకు తన సంతోషమును వ్యక్తముచేయుచు రామదాసస్వామి శివాజీకివ్రాసిన లేఖలో శివాజీ యౌన్నత్యము, మహత్వము వ్యక్తమగుచున్నవి.

బీజపూర్ సుల్తానగు ఆలీ అదిల్‌షా యనంతరము సికందర్ ఆదిల్‌షా సింహాసన మెక్కెను. ఖావాన్‌ఖాను అను నతడు కొత్త వజీరుగా నియమితుడాయెను. ఈ ఖాను శివాజీని ద్వేషించు వ్యక్తి. స్వరాజ్య నిర్మాణపు మొదటి రోజులలో నీ ఖాను శివాజీ చేతులలో పరాజితుడయ్యెను. ఇటువంటి వాడు వజీరయినందు వలన, ఇకముందు బీజపూరు వారితో యుద్ధము చేయవలసి వచ్చునని యూహించి, శివాజీ మహారాజు బీజపూరు దర్బారులో యున్న బాబాజీ పంథ పుండే యను తనరాయబారిని పిలిపించెను. ఢిల్లీ, బీజపూర్‌ల వంటి రెండు శక్తివంతములైన రాజ్యములతో యుద్ధముచేసి గెలువగలనను విశ్వాసము, ధైర్యము, శక్తి సంపన్నత నాడు శివాజీకి గలవు.

శివాజీ మరల నొకసారి సామ్రాజ్య విస్తరణకు ప్రయత్నించ దలచెను. మొట్టమొదట బీజపూరు వారి ఫణ్‌హార్ కోటను జయించవలెనని నిర్ణయము జేసుకొనెను. కొండాజీ ఫర్‌జంద్ అను వీరుడు అరువదిమంది సైనికులను మాత్రము వెంటనిడుకొని రాత్రివేళ ఆ కోటను పట్టుకొనెను(6-3-1673). ఫణ్‌హార్‌కోట పోగానే, బీజపూరు సుల్తాన్, ఖవాస్‌ఖానును శివాజీ పైకి పంపెను. పెద్ద సైన్యముతో బయలుదేరిన ఖాన్ ఆరోహా కోట దగ్గర గల ఉమరా యను గ్రామములో సైనిక శిబిరము నిర్మించుకొనెను. శివాజీ ఆజ్ఞ మేరకు ప్రతాపరావు ఖాను మీదకు పోయి, ఆ శిబిరమునకు నీటిని సరఫరాజేయు ప్రదేశమును పట్టుకొనెను. అప్పుడు గత్యంతరము లేక "మరల నేను దాడిచేయను, ఈ పర్యాయమునకు నన్నుపోనిమ్మ"ని ఖాను ప్రతాపరావును వేడుకొనెను. ప్రతాపరావు జాలిపడి ఖానును వదిలెను. ఈ విషయము శివాజీకి తెలిసి 'ఇటువంటి ఒప్పందమున కేల యంగీకరించినావ'ని ప్రతాపరావును మందలించెను. దీని వలన ప్రతాపరావు చాల బాధజెందెను. ఆ సంవత్సరము విజయదశమి వెళ్లిన తరువాత మహారాజు దక్షిణ కొంకణము వైపుకు పోయి బంకాపూర్, ఖడ్‌గావ్ ప్రదేశములను తన ఏలుబడిలోనికి తెచ్చెను. 1674 ప్రారంభములో మహారాజు రాయగఢ్ చేరెను. స్వరాజ్య రాజధాని రాజగఢ్ నుండి రాయగఢ్‌కు మార్చబడెను.

ముప్పది సంవత్సరములకాలము శివాజీ, ఆతని యనుచరులు చూపిన పరాక్రమము, కర్తృత్వశక్తి, త్యాగశీలత, ధ్యేయనిష్ఠ, మహత్వాకాంక్ష హిందువులందరిలో ఒక నూతనోత్తేజమును నిర్మించినవి. అంతకుముందు ఈ దేశములో

హిందువుడనగా విదేశీయులైన సుల్తానులకు సర్వవిధముల సేవ జేయుటకు జన్మించిన ఒక కొరగాని బానిస జీవి యనెడి దుర్భరము, దుస్సహమునయిన భావనయుండెడిది. హిందువుల భాష, ధర్మము, స్త్రీలు, వారి మనుగడ – వేనికిని విలువ యే మాత్రము ఉండెడిదిగాదు. నేడీ స్థితి పూర్తిగా మారి, హిందువుల సార్వభౌమత్వము తిరిగి నెలకొన్నది; వైభవోపేతమైన స్వరాజ్యస్థాపన జరిగినది. సుల్తానులను వ్యతిరేకించుట "అన్నదాత"ను వ్యతిరేకించుటయని, పరమేశ్వరునికి ద్రోహము చేయుటయని విచిత్రభావములు దూరములయి, ఢిల్లీశ్వరునితో సహా సుల్తాను లందరిని ఎదిరించి హిందూరాజ్య స్థాపనలోనే పురుషార్థము గలదని యనుకొను యువకులు అనేకులు తయారయిరి. వీరి వలననే స్వరాజ్య స్థాపన జరిగినది; ఆ స్వరాజ్యమును సంరక్షించుటకు, విస్తరించుటకు తగినంత హిందూ శక్తి నిర్మాణమై యున్నదను విషయము ఋజువయినది. కాని శివాజీ ఒక సమ్రాట్ అను భావన యందరిలో కనుపించుటలేదు. శివాజీ సుల్తాన్ యొక్క సర్దారుకు పుత్రుడని మాత్రమే పలువురు భావించుచుండిరి. పాదుషాకు, అతని సర్దారులకు శివాజీ యనిన భీతియుండెడిది. వారు మనస్సులలో శివాజీ యొక్క సార్వభౌమత్వమును అంగీకరించెడివారు. అయినను శివాజీ యొక్క స్వరాజ్యమొక హిందూరాజ్యమనియు, శివాజీ యొక రాజనియు వారు విశ్వసించెడివారుగాదు. అతడు శక్తివంతుడైన ఒక సర్దారుయొక్క పుత్రుడని వారి భావము. సుల్తానువద్ద నుద్యోగము చేయు సర్దారులకు శివాజీపై నసూయ ఉండెడిది. వారితనిని 'స్వామిద్రోహి'యనియు, 'కృతఘ్నుడ'నియు పిలిచెడివారు.

శత్రువులకు, శత్రువుల పక్షమున నుండు హిందువులకు ఈవిధమయిన అభిప్రాయములుండెడివి. తదితరులగు హిందువుల మనస్సులలో కూడ నొక విధమైన సంభ్రమ ముండెడిది. శివాజీ సింహాసన మధిష్ఠించిన రాజు కాక పోవుట వలన వారికి శివాజీది 'రాజ్య'మనిపించెడిది కాదు. తమ భూములపట్టాలమీద శివాజీ యొక్క ముద్రకు బదులు పాదుషా యొక్క రాజముద్ర యుండవలెననియు, అప్పుడే వారికి భద్రత యనియు వారు తలంచు చుండిరి. శివాజీ ధర్మాత్ముడనియు, అతని పాలనలో నన్న సుఖము, న్యాయము వేరెక్కడను లేవనియు వారికి తెలిసినను అతడు 'నిజమైనరాజు' కాడను నభిప్రాయము వారిలో నుండెడిది. వారి మదిలో-అసలు రాజు ఎవరో, రాజభక్తి నెవరిపట్ల చూపవలెనో, రాజద్రోహ మనగా ఏదియో తెలియనేరని యొక విచిత్రస్థితి ఆనా డేర్పడినది. అది సంక్రమణకాలము. స్వరాజ్యము శాశ్వతముగ నిలబడునను నమ్మకమింకను ప్రజలకు పూర్తిగ కుదుర లేదు.

దీనికి గురించి అనేకవిధములుగ శివాజీ ఆలోచనలు చేసెను. తాను కేవలము శక్తి వంతుడు, విప్లవ కారుడు వయిన ఒక సర్దారుయొక్క పుత్రుడనని తన శత్రువులలోయున్న భావము తనవారి మనస్సులలో యున్న శంకలు తొలగిపోవలసిన యవసరము గలదని శివాజీకి అనిపించెను. స్వరాజ్యముయొక్క చిహ్నము యెడల అన్యరాజ్యములలో గౌరవము, స్వరాజ్యములో దానిపై నమ్మకము నిర్మాణము కావలయును. తనను అందరు 'రాజు'గా గుర్తించవలెను అను వ్యక్తిగత ప్రతిష్ఠకై కోరిక శివాజీ మనస్సులో నుండెడిది కాదు. స్వరాజ్య మనగా సకలసౌభాగ్య సంపన్నమై, ప్రజలకు రక్షణ నొసంగుచు, మంచి

సంస్కారములతో, సౌశీల్యముతో మహాత్వాకాంక్షతో వ్యవహరించు 'అష్టాంగప్రబల' యగు రాజ్యలక్ష్మి యొక్క 'సంసారము'గ తనవారికి పరాయి వారికి కూడ సాక్షాత్కార మగుట అవసరము. స్వరాజ్యము బుద్బుదప్రాయము, అస్థిరము కాకూడదు. అది పాడ్యమి నాటి చంద్రరేఖవలె దినదినాభివృద్ధిగాంచుచు విశ్వవంద్యమై, సూర్య చంద్రులు ప్రకాశించునంతకాలము నిలబడునను విశ్వాసము నిర్మాణము కావలయును. ఇది సాధించుట ఎట్లని శివాజీ రాత్రింబవళ్ళు యోచించసాగెను.

హిందువులు స్వరాజ్యముయొక్క విలువను అసలు గుర్తించకపోలేదు. వివేకవంతులయిన స్వజనులకు శివాజీ యోగ్యత చక్కగ నర్థమయ్యెను. ఔరంగజేబు పాలనలో పీడితులైన హిందువులు శివాజీని గౌరవభావముతో చూచెడివారు. మహారాజు పరాక్రమమునకు ఆయన చేసిన కార్యములకు ముగ్ధుడై హిందీభాషలో మహాకవియైన భూషణుడు- ఔరంగజేబుయొక్క రాజ్యమును విడచి దక్షిణాదికి వచ్చి- శివాజీపై 'శివరాజ భూషణము'ను మనోహరమైన కావ్యమును రచించెను. అలంకార శాస్త్రములో అది యొక అసామాన్యమైన గ్రంథము. అటులనే మహారాజుయొక్క యశోగంధము వలన మోహితుడై తంజావూరు నివాసియగు జయరామ మహాకవి మహారాజును స్వయముగ దర్శించెను. ఆయనకు పన్నెండు భాషలపై నాధికారికమైన పాండిత్యము గలదు. వివిధ భాషలలో ఆయన శివ చరిత్రమును రచించెను. సమర్థ రామదాసస్వామి వంటి విరక్తులైన మహాయోగులు, తత్వజ్ఞులయిన మహర్షులు శివాజీని 'యశ్వంత', 'కీర్తిమంత', 'పుణ్య

వంత', 'నీతివంత'యని పొగడుచు, ఆయన చేసిన లోకోత్తర కార్యమును సాదరముగ ప్రశంసించి ఆనందించెడివారు. మహారాజు 'యుగప్రవక్త' యను గౌరవపదమునకు అర్హుడని యోగులు, సాధు పుంగవులు నయిన మహానుభావుల మనస్సులలో సద్భావ మేర్పడినది. కాని శివాజీ పాలనలోని సామాన్య ప్రజలలోను, శత్రువుల మనస్సులోను ఇది హిందువులయొక్క సర్వతంత్ర స్వతంత్ర రాజ్యమను భావము మాత్రమే కొఱతిగా నుండెడిది. అది తీరుట ఎట్లు?

దీని కొక విద్వాంసుడు మార్గము కనిపెట్టెను. విశ్వేశ్వరభట్టు, దివాకరభట్టు, గాగాభట్టు వారి నామధేయములు. ఈయన మహా పండితుడు. కాశీ క్షేత్రములో అగ్రపూజల నందెడి ప్రముఖుడు. వీరి కుటుంబములో అందరు చాల తరములనుండి వేదాధ్యయన, అధ్యాపన పరులై ముముక్షువులకు జ్ఞానోపదేశము చేయుచుండెడివారు. వీరు అనేక గ్రంథములను రచించిరి. గాగాభట్టునకు మీమాంస, ధర్మశాస్త్ర విషయములలో ప్రత్యేకించి పాండిత్య ముండెడిది. ఆయన స్వయముగ పెక్కు గ్రంథములు వ్రాసెను. సమస్త భారతావనిలో ఆనాడీ కుటుంబమునకు మంచి గౌరవ ముండెడిది. కాశీవాసి యగు ఈ మహా పండితుడు శివాజీని గురించి అనేక విషయములు వినియుండెను. శివాజీని గురించి దేశ మంతటను 'ఒడలు పులకరింప జేసెడి' కథలు విన వచ్చెడివి. యవనులైన ముగ్గురు, నలుగురు ప్రభువులతో పోరాడి విజయము పొందగలిగిన ఈ వ్యక్తిలో యేదో ప్రత్యేకత యుండి తీరునని అందరును అభిప్రాయ పడెడివారు.

ఆయన శౌర్య విక్రమములు, శత్రువులను గెల్చుటకు ఆయన వేసిన యెత్తుగడలు, ప్రదర్శించిన యుక్తి అద్భుతము. ఆగ్రా జైలునుండి ఆయన పారిపోవుట అందరికి ఆశ్చర్యమును కల్గించినది. అలౌకికములు అసామాన్యములు నయిన ఇట్టి బుద్ధి శౌర్యములు కలిగియున్న శివాజీ మహారాజు ధర్మ సంస్థాపన కొరకై హైందవ స్వరాజ్యమును నిర్మించుచున్నా డని, ఆయన ప్రాచీన చక్రవర్తుల శ్రేణిలో గణించదగిన వారని - ఇత్యాదిగా ఆయన కీర్తి ప్రతిష్ఠలు హిందూదేశపు నలుచెరగుల ప్రాకినవి మహమ్మద్ సుశ్రుతి వంటి శత్రు పక్షములోని కవులుగూడ, శివాజీ ఉదాత్తమైన శీలసంపద కలిగినవాడని వర్ణించిరి. గాగాభట్టు పండితులు శివాజీని గురించి ఈ విషయము లన్నియు వినియుండిరి. శివాజీ యొనరించిన పనుల కాయన చాలా సంతసపడిరి. సమస్త భారతావని యవనుల పాదాక్రాంతమై స్వధర్మ సంస్కృతులు మృతప్రాయమై యున్న వేళలో స్వకర్తృత్వము వలన నూతన యుగమును, క్రొత్త శకమును నిర్మించిన ఈ పురుషోత్తముడు మహావిష్ణువుయొక్క అంశీభూతుడై యుండవలెను. అన్ని దిశలను స్వాభిమాన శూన్యతయొక్క అంధకారము విస్తరించి యున్నప్పుడు, యవనప్రభువు లందరి నెదిర్చి, పోరాడి, విజయము సాధించిన ఈ మహారాజు సామాన్యుడు కాజాల డను నమ్మకము గాగా భట్టునకు బాగుగ బలపడినది. ఔరంగజేబు పాలనలో హిందువులపై జరుగుచున్న అత్యా చారములు విని, ప్రత్యక్షముగా కాశీ క్షేత్రములోని విశ్వనాథ మందిర విధ్వంసము మొదలైన అకృత్యములను చూచి, అనుభవించిన తర్వాత శివాజీ యొక్క యోగ్యత గాగాభట్టు

నకు చక్కగా విశదమైనది. ఇటువంటి పురుషోత్తము నొక్క సారి దర్శించవలె నను తీవ్ర ఆకాంక్షతో పండిత గాగాభట్టు కాశీనుండి బయలుదేరి ఒకానొక దినమున నాశిక్ నగరము నకు చేరెను.

మహారాజున కీవార్త తెలిసినది. ఇంతటి పెద్దపండితుడు తనను స్వయముగ కలిసి కొనుటకై వచ్చుచున్నందున ఆయనకు స్వాగత సత్కారము లొసంగుటకై మహారాజు తన పురోహితుని నాశిక్ నగరమునకు పంపెను. ఆ పురోహితుడు గాగాభట్టును వెంటబెట్టుకొని రాయగఢ్ చేరెను. శివాజీ గాగాభట్టునకు గౌరవ పురస్సరముగ ఘనమైన స్వాగతమిచ్చి, ఆయన విడిదికి తగుఏర్పాట్లుజేసెను. శివాజీయొక్క తేజస్వితె. లోకసంగ్రహము, న్యాయ నిర్వహణము, ధర్మపరాయణత, సంతతోద్యోగము, సావధాన ప్రవృత్తి, ఉపభోగ నివృత్తి, శాంత, గంభీర నిగర్వ ప్రవర్తనము, సర్వాంకష బుద్ధి చాతుర్యము, ఆయన నౌకాదళము, సైన్యసంపద, కోటలు, సమృద్ధమైయున్న కోశాగారము, సంతుష్టులైన ప్రజలు - ఇవి యన్నియుచూచిన గాగాభట్టునకు శివాజీని గురించి ఆనందము, ఆయన యెడల గౌరవము ఇనుమడించెను. వేరొక విశేష మేమన-ఒకనాటి శూన్యములోనుండి నేటికి నిర్మితమైన ఈ రాజ్యము యొక్క వైభవము అపూర్వము. ధర్మప్రతిష్ఠాపన, స్వప్రజలను పుత్రవాత్సల్యముతో పాలించుట, సాధు, సంత్ లకు రక్షణ. స్వదేశమును పారతంత్ర్యమునుండి విముక్తము జేయుట 'సర్వేపి సుఖినస్సంతు' యనెడి పరిస్థితిని కలుగ జేయుట-ఇవి నాటి హిందూరాజ్యమునకు పరిచాయకములు.

ఇటువంటి మహత్కార్యములను శ్రీరాముడు చేసెను; శ్రీకృష్ణు డొనరించెను. వారి అడుగు జాడలను ఈ మహానుభావుడు గూడ అనుసరించుచుండెను. శివాజీ యొక్క ఈ చరిత్రాత్మక మగు ప్రాధాన్యమును గాగాభట్టు బాగుగ అర్థముచేసికొనెను. ఆయన మనస్సులో ఒక విశిష్టమైన ఆలోచన కలిగినది. ఇటువంటి మహారాజునకు సింహాసనములేదు; రాజ్యాభిషేకము జరుగలేదు. ఛత్ర, సింహాసనములు లేనిచో రాజ్యమునకు పూర్ణత్వము రాదు. శివాజీ రాజ్యాభిషిక్తుడైనగాని, ఈయన చేసిన యుగప్రవర్తక కార్యముయొక్క మహత్త్వము సుస్థిరముగాదు; జగద్విదితముగాదు. ప్రపంచములోని అన్యుల కంటె స్వరాజ్యములోని ప్రజల కిది అవగతము కావలసిన అవసర మెక్కువగ నున్నది. అందుచే గాగాభట్టు తన మనస్సులోని ఆలోచనలు ప్రభువుకు నివేదించెను. తన రాజ్యాభిషేకము వలన, స్వరాజ్యమునకు స్థైర్యము చేకూర గలదని తెలిసికొనిన మహారాజు అందుల కంగీకరించెను. స్వరాజ్యములోని పెద్దలందరిని పిలిపించి గాగాభట్టీ సంగతి చెప్పెను. వారందరికి ఇది నచ్చినది. రాజ్యాభిషేకము జరుపవలె నని నిర్ణయమైనది.

స్వరాజ్యము నందంతటను ఈ శుభవార్త ప్రాకిపోయి నది. అందరును ఆనందపడిరి. రాజ్యాభిషేక ప్రయత్నములు ప్రారంభమైనవి. రాజధాని యగు రాయగఢలో రాజసభా మందిర నిర్మాణము ప్రారంభమైనది. రాజ్యాభిషేకమునకు కావలసిన వస్తు సంబారములు సేకరింపబడుచున్నవి. ఒక వంక ఈ ప్రయత్నములు జరుగుచున్నను, మహారాజుయొక్క

ధ్యానము మాత్రము స్వరాజ్య సంరక్షణ, స్వరాజ్య విస్తరణ ములపైననే లగ్నమై యుండెను.

బీజపూరు సర్దారు బహలోల్ ఖాన్ లోగడ హిందూ రాజ్యముపై నిక దాడి చేయనని మాట నిచ్చి ప్రతాపరావు గుజర్ చేత విముక్తు డయ్యెను. ఆ ఖాన్ మరల 'కర్వీర' వైపు దాడి చేయ మొదలిడెను. ఈ కృతఘ్నునికి మంచి గుణపాఠము నేర్పవలె ననియు, ఇతనిని క్షమించి వదలిన పొరబాటు సరిదిద్దబడవలె ననియు ఉద్దేశించి శివాజీ మహారాజు ప్రతాపరావుకు "బహలోల్ ఖానును సర్వ విధముల నాశనము చేయవలసినది; లేనియెడల నీ మొగము నాకు చూపవద్ద"ని జాబు వ్రాసెను. ఈ జాబు చూచిన ప్రతాపరావుకు అపరిమితమగు మనోవేదన కలిగినది. అప్పు డతడు "గఢహింగ్లజ్" యొద్ద యుండెను. ఆయనకు రాజ్యాభిషేక వార్తగూడ చేరినది. రాజ్యాభిషేకము జరుగు లోపుగ బహలోల్ ఖాన్ను నశింపజేయని పక్షమున, తన మొగమును రాజ్యాభిషేక సమయమున శివాజీకి చూపలే నను నిర్ణయము నకు వచ్చెను. లోగడ తా నొనరించిన పొరపాటునకు పశ్చాత్తాప పడెను. కృతఘ్నుడైన బహలోల్ ఖాను నే విధముగ నంతము చేయవలెనా యను ఒక్క ఆలోచనయే ఆతని మనస్సును వేధించుచుండెను. మాఘ బహుళ చతుర్దశి, శివరాత్రి రోజున (24-2-1674) ప్రతాపరావు కేవలము ఆర్గురు అనుచరులతో తన శిబిరము నుండి కొంత దూరము విహారముగా నేగెను. అక్కడకు సమీపములో యున్న 'నేసరి' కనుమ నుండి బహలోల్ ఖాన్ ససైన్యము వెళ్ళిపోవు చున్నట్లు వార్త అప్పుడే యతనికి తెలిసెను. ఈ వార్త

విన్న వెంటనే తా నొక సేనాపతి ననియును, తన సేన కొంత దూరములో గల శిబిరములో విడిసి యున్నదనియును మఱచి వెంటనున్న ఆర్గురు సైనికులతో ప్రతాపరావు ఒక్కసారి బహలోల్ ఖాన్ మీదకు పోయి విఱుచుకపడెను. బహలోల్ ఖాన్ సైన్యము వేల సంఖ్యలో ఉన్నది. ఆ ఏడుగురు యోధులు కొద్ది క్షణములలో వీరమరణము నందిరి. శిబిరములో నున్న సహ సేనాపతి ఆనందరావున కీవార్త తెలిసెను. సైన్యసమేతుడై పోయి బహలోల్ ఖాను నెదిరించి పూర్తిగ ఓడించెను. మహారాజునకు ఈ వర్తమానము తెలిసెను. తాను వ్రాసిన కటువయిన జాబువలన ప్రతాపరావు దుఃఖావేశముతో నీ దుస్సాహసము చేసె నని శివాజీ చాలా చింతిల్లెను. ఆటు పిమ్మట మాసము రోజులలోగా శివాజీ రాణులలో ఒకరైన కాశీబాయి స్వర్గస్థురాలైనది. దేశము కొరకు ఆజీవన వ్రతము స్వీకరించిన వారికి దుఃఖించుటకు కూడ ఎక్కువ సమయము లభింపదుగదా !

రాజ్యాభిషేక ముహూర్తము దైవజ్ఞులచే నిర్ణయింపబడినది. స్వస్తిశ్రీ శాలివాహనశక 1596, ఆనందనామ సంవత్సరము, జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి శనివారము సూర్యోదయాత్పూర్వము మూడు గడియలకు సుముహూర్తము (దీ 6-6-1674). ఆ వేళ ఉషఃకాలమున మహారాజు సింహాసన మధిష్ఠించును.

'మనరాజు మన సైన్యము, మన నావికా బలము, మన ధ్వజము, మన మంత్రిమండలి, మనభూమి, మనగాలి, మననీరు, మన ఆకాశము – ఇవన్నియును మనవియే. మనము

స్వేచ్ఛా జీవులము. ఇకపై మన మెవరికిని బానిసలముగాము. సర్వతంత్ర స్వతంతులము'- ఈ భావములు, స్వారాజ్య మంత టను, అందరిలోను ఆ క్షణమున మెదిలెను. అమితోత్సాహ ముతో నందరు కార్యోన్ముఖులైరి.

ఆ రోజున, ఆ శుభ ముహూర్తమున మహారాజు సప్త సింధు జలములతో అభిషిక్తుడాయెను. "గంగేచ, యమునే చైవ గోదావరి, సరస్వతీ, నర్మదా, సింధు, కావేరీ.... ...." తన నభిషేకించిన ఆ నదులన్నియు ఆనాడు స్వారాజ్యసీమలో లేవు. సంస్కృత భాష బాగుగ నభ్యసించిన మహారాజా మంత్రమును అర్థముచేసికొని తన మనస్సులో ఆ క్షణమున తానా నదులన్నింటిని స్వారాజ్యములోనికి తీసుకొనివచ్చెదనని ప్రమాణముచేసి యుండవచ్చును. రాజ్యాభిషేకము పిమ్మట రాజ్యారోహణము జరిగినది. ఆంగ్లేయుల తరఫున రాయబారగు హెన్రీ ఆక్సెండన్ అనునాతడు వచ్చియుండెను. అతడు విన మ్రుడై మహారాజుకు ప్రణామమునాచరించి 1600 రూప్యములు కానుకగా సమర్పించెను. తరువాత ఊరేగింపుగనేగి శివాజీ మహారాజు దేవదర్శనము చేసెను. అనంతరము మహారాజు మాతృదేవి వద్దకువెళ్ళి నమస్కరించి ఆమెచెంత ఆసీనులయిరి. ఆ క్షణమున జిజియామాతకు కలిగిన సంతోషము వర్ణనా తీతము!

అజరామరమైన హిందూజాతికి అనంత కాలము నుండియు పతాకగా, హైందవీ భావనకు మూలభూతములైన త్యాగసేవా భావములకు ప్రతీకగా, జడమైయున్న సర్వం సహా చక్రమనకు నిత్యనూతన చైతన్యమొసంగు అరుణ కాంతితో

జగతిని పావిత్ర్యమునకు గీటురాయియగు యజ్ఞవేదికలోని పావనాగ్ని వర్ణాంకితమైన స్వర్ణగైరికధ్వజము నాటినుండి మరల తన పురావైభవమును సంతరించుకొనెను. విశ్వవంద్యమై వియత్తలమున యనంతకాలమునుండి విరాజిల్లుచున్న నా ధ్వజమును దర్శించునపుడు హిందూధర్మ, సంస్కృతుల రక్షణకు ప్రాణములను దారవోసిన మహాపురుష పరంపర, వారి యాదర్శపూర్ణ జీవనములు నాటినుండి మరల ప్రతిహైందవ మనోఫలకమున మెదలుచు ప్రతి వ్యక్తిని కర్తవ్య పరాయణునిగా నొనర్పసాగెను. స్వాభిమానము జాగృతమయిన హిందూ హృదయములలో స్వజాతి మాన బిందువులైన గోవు, స్త్రీ, దేవళము యిత్యాది వానియందు ఆదరణ, వాని కొరకై ఆత్మార్పణ మొనర్పజాలిన సంసిద్ధత ప్రస్ఫుటములు గాజొచ్చినవి.

రాజ్యాభిషేక సమారంభము అన్ని విధముల సక్రమముగ జరిగి సుసంపన్నమైనది. ఈ కార్యక్రమము యొక్క ఆశయము వైభవ ప్రదర్శనము, విందులు, వినోదములు, మనోరంజన కార్యక్రమములు జరుపుకొనుట కాదు. దాని వెనుక నొక ఉదాత్తమయిన, చరిత్రాత్మకమైన ఆలోచన గలదు. ఈ ఉత్సవమువలన హిందూజాతి బానిసజాతియను భావముపోయి హిందూజాతి శత్రులను నిర్జింపజేసి స్వతంత్రులుగా జీవింపగల శక్తిసంపన్నమైన జాతియను నమ్మకము అందరిలో కలిగినది. ఈ సామ్రాజ్య దినోత్సవము హిందూ సార్వభౌమత్వమును, స్వత్వమును, స్వాభిమానమును వ్యక్తము చేయుటకు జరుపబడినది. ఈ ఆశయము సర్వదా గుర్తుండవలెనను యుద్దేశ్యముతో మహారాజు అప్పటినుండి 'రాజ్యాభిషేక

శకము' నారంభించెను. శివాజీ మహారాజు తన పేరుతో శక ప్రారంభము చేయలేదు. కాని రాజ్యాభిషేకము పేరుతో ప్రారంభించెను. అష్టప్రధానులకు గల పారసీక నామములు మార్చబడి, సంస్కృత నామము లివ్వబడెను. ప్రభుత్వ యంత్రాంగములో కూడ పారశీకము బదులు సంస్కృత భాష ఉపయోగించవలె ననెడు నిర్ణయముతో "రాజ్య వ్యవహార కోశము" తయారు చేయించబడెను. సంజ్ఞలలో మార్పు వచ్చిన సంవేదనలలో కూడ మార్పురాగలదు గదా!

రాజ్యాభిషేకానంతరము దానములు, పారితోషికములు ఒసంగబడెను. నర్సింహాభట్టను ఒక బ్రాహ్మణ పండితుడు దక్షిణను నిరాకరించి, కొన్ని గ్రామములను జాగీరుగా కోరెను. స్వరాజ్య ప్రయోజనముల దృష్ట్యా ఇటువంటి జాగీరులు ఇచ్చుట శివాజీ కిష్టము లేదు. ఈ విప్రుని మనస్సులో స్వరాజ్య శ్రేయస్సు కంటె స్వార్థచింతనయే అధికముగా నున్నది. ఇట్టి భావనకు విరుద్ధముగ వేరొక ఉదాహరణ మానా డక్కడ లభించినది. ఆగ్రా ఖైదునుండి శివాజీ పారిపోయిన తదుపరి హీరోజీ ఫర్ చంద్ తోపాటు ఆఖైదులో మృత్యు ముఖమున నిలుచుటకు సిద్ధపడిన సేవకుడు 'మదారీ మెహతర్'ను 'నీ కేమి కావలయు' నని యడుగగా నాతడు 'నాకీ సింహాసనమును ప్రతి నిత్యము పరిశుభ్రపఱచు వర మి' మ్మని అడిగెను. దేశభక్తి గంథపఠనముపైన, పాండిత్యము పైన ఆధారపడి యుండదుగదా!

స్వరాజ్యములో నప్పటికి శక్తి వచ్చియున్నది. ఆత్మ విశ్వాసముకూడ కలిగినది. కొద్ది రోజులు గడచిన తరువాత మహారాజు సూరత్ నగరాధికారికి "గత మూడు సంవత్సరముల పన్ను క్రింద రు. 9 లక్షలు వెంటనే చెల్లించవలసినది, లేనిచో దాడి చేయవలసి వచ్చు" నని వర్తమానమును పంపెను. మహారాజు ఈ విధముగ మొగలులను కవ్వించుట ప్రారంభించెను.

ఒకనాడు మొగలు సుబేదారయిన బహదూర్ ఖాన్ సైన్యసమేతుడై తన శిబిరమును పెడ్‌గావ్‌లో ప్రతిష్ఠించెను. 2000 మంది స్వరాజ్య సైనికు లతనిని వంచించి ససైన్యముగా నతని శిబిరమునుండి చాల దూరము తీసికొనివెళ్ళిరి. అప్పుడు వేరొక స్థలములో దాగియున్న మరియొక ఐదువేల మంది స్వరాజ్య సైనికులు శత్రు శిబిరమును పూర్తిగ లూటీ చేసిరి. ఈ సంఘటన జూలై మాసములో జరిగెను. లూటీ ధనము ఒక కోటి రూపాయల వరకున్నది. రాజ్యాభిషేకము కొరకయిన వ్యయము ఈ విధముగ మరల కూడుకొనినది. తర్వాత మహారాజు బహదూర్‌ఖాన్‌తో ఒప్పందమున కుపక్రమించెను దీనితో బహదూర్ ఖాన్‌తో పోరాట మాగి, సావకాశము లభించెను. ఈ అవకాశములో మహారాజు బీజపూరువారి 'ఫోండా' కోటను, 'కడవాడ' (కార్వార్) ప్రాంతములను జయించెను. అప్పటికి బహదూర్ ఖాన్, శివాజీతో నొప్పందము కుదుర్చుకొనుటకు, ఢిల్లీ పాదుషానుండి అంగీకారము తెప్పించుకొనెను. కాని మహారాజు 'మీతో ఒప్పందము నా కవసరము లే' దని కబురు పంపెను. బహదూర్ ఖాను

డీ విధముగ మోసపడుట జూచి ఔరంగజేబు అతనికి మారుగ శివాజీపైకి మహమ్మద్ కులీఖాన్‌ను పంపించ దలచెను. మహమ్మద్ కులీఖాన్ లోగడ శివాజీ సేనాపతియైన నేతాజీ పాల్కర్ అను పేరుగల హిందువు – బలవంతముగా మహమ్మదీయ మతములో చేర్చబడినవాడు. ఈతడు మతము మార్పిడి కిష్టములేక ఒక పర్యాయము ఔరంగజేబు వద్దనుండి పారిపోవుటకు ప్రయత్నించి విఫలుడాయెను. ఈకారణముల వలన ఔరంగజేబుకు ఇతనిపై పూర్తి విశ్వాసము కుదురలేదు. కనుక దిలేర్ ఖాన్ అను ప్రముఖ సేనాపతిని, అతని వెంట నేతాజీ పాల్కర్‌ను శివాజీపైకి పంపెను. నేతాజీ ఇస్లాము మతమున చేర్చబడి తొమ్మిది సంవత్సరములు గడచినవి. అయినను అతడు మొగలాయీ సైన్యమునుండి పారిపోయి శివాజీ మహారాజు వద్దకు వచ్చెను. మహారా జతనిని మరల హిందూమతములోనికి చేర్చుకొనెను (19–6–1676).

ఈ సమయములోనే శివాజీ తమ్ముడైన ఏకోజీరావు దగ్గఱ కొలువు మానుకొని, రఘునాధపంత్ శివాజీ దగ్గఱకు వచ్చెను. బీజపూరు వారి యధీనములోని కర్నాటక ప్రదేశ విషయము లన్నియు ఈతనికి బాగుగా తెలియును. అతని వలన వలసిన విషయముల నన్నిటిని శివాజీ సేకరించెను. గొల్కొండ ప్రభువగు కుతుబ్ షాహీ దర్బారులో శివాజీ రాయబారిగా ప్రహ్లాద నిరాజీ పనిచేయుచుండెను. కుతుబ్ షాహీయొక్క ప్రధాని మాదన్న మంత్రితో ప్రహ్లాద నిరాజీ సంప్రదించి మహారాజు, కుతుబ్ షాహీలు గొల్కొండ కోటలో కలసికొని ఒప్పందము చేసుకొనవలెనని నిర్ణయిం

చెను. ఈ రెండు కార్యములు దృష్టిలోయుంచుకొని మహారాజు విజయదశమి పర్వదినమున దక్షిణ దిగ్విజయమునకు బయలు దేరెను (6-10-1676). మహారాజొక 'సింహాసనాధిష్టిత' ఛత్రపతిగా కుతుబ్‌షాహిని కలిసెను (5-2-1677). దక్షిణాత్యులందరు యేకమై ఉత్తరదిశలోనున్న మొగలులను, విదేశీ పఠానులను ఓడించవలెనని నిర్ణయమైనది. కుతుబ్ షాహీ, బీజపూరు దర్బారులో పఠానుల ప్రాముఖ్యమును బాగుగ తగ్గించవలెనని కూడ వీరు నిర్ణయించిరి. పిమ్మట శివాజీ కర్నాటకములోని ఎక్కువ భాగమును స్వాధీన పఱచుకొని రాయగఢ్ తిరిగివచ్చెను (1678 జూన్).

శంభాజీయొక్క తల్లి అతని చిన్నతనములోగతించినది. సవతితల్లియు, రాజారాం యొక్క స్వంత తల్లియునగు సోయరాబాయి శంభాజీని ద్వేషించెడిది. శివాజీ మాతృదేవి జిజియాబాయి శంభాజీని ప్రేమించెడిది. ఆమె రాజ్యాభిషేకము తర్వాత కొన్ని దినములకే పరమపదించెను. గృహములోని ఈవిషాదకర వాతావరణమును సహించలేక ఏమియు తోచక శంభాజీ మొగల్ సర్దారు దిలేర్ ఖానును చేరి అతనితో కలిసెను (15-12-1678). అందుకు మహారాజు చాల దుఃఖించెను. దిలేర్‌ఖాను మాత్రము సంతోషించెను. కొన్నేండ్లుగా ఖాన్ శివాజీని ఓడించలేకపోయెను. ఇప్పుడు శంభాజీ అతనితో కలియుటవలన స్వరాజ్యములో భేదముల నేర్పరచి శివాజీని ఓడించుటకు అవకాశము కలదని ఖాన్ ఊహించెను. శంభాజీని వెంటనిడుకొని ఖాన్ భూపలగఢ్ కోట మీదదాడిచేసెను. యజమానియగు శంభాజీని ముందుచూచి కోటకు అధిపతియైన

ఫిరంగోజీ నరసాళా కోటను ఖాళీచేసి శంభాజీకి స్వాధీనము చేసెను. శివాజీ కీవిషయము తెలిసి ఫిరంగోజీపై ఆగ్రహ పడెను. శంభాజీ యిక నుండి స్వరాజ్యమునకు శత్రువనికూడా తెలియజేసెను. శంభాజీతో స్వరాజ్యములోని వారెవ్వరును సహకరించరాదని శివాజీ స్వరాజ్యమంతటికిని ఉత్తరువులు పంపెను. దిలేర్ ఖాను హిందువులపై అత్యాచారములు చేయు చుండెను. ఈ అత్యాచారములను చూసి ఉపేక్షించి ఊరుకొనుట శంభాజీకి చాలకష్టముగా నుండెడిది. శంభాజీ అట్లు చేయవలదని ఖానుకు సూచించెను. కాని ఖాన్ అతనిమాటను లెక్కజేయలేదు. ఔరంగజేబు హిందువులపై చేయు అన్యాయములు కూడ పెరుగుచునే యుండెను. పాదుషా "శంభాజీని ఖైదుజేసి ఢిల్లీకి పంప"మని దిలేరు ఖానుకు వ్రాసెను. ఈ విషయము ముందుగ శంభాజీకి తెలిసెను. శంభాజీ మొగలుల వద్దనుండి పారిపోయి స్వరాజ్యములోని పన్హాళ్ గఢ్‌కు తిరిగి చేరెను (4-2-1679). దానితో మహారాజును పీడించుచున్న ఒక బాధ తొలగినది.

ఏబది వర్షములు నిర్విరామముగ కృషి సల్పుటవలన శివాజీ యొక్క దేహము బాగుగ నలసిపోయెను. తాను లేని యెడల స్వరాజ్య మే విధముగ నడుచునో పరీక్షించుటకు శివాజీకి తా నాగ్రాలో నున్నప్పుడు అవకాశము కలిగినది. దక్షిణ యాత్రకు వెళ్ళినప్పుడు 1½ సంవత్సరములవరకు శివాజీ రాజ్యములో లేకున్నను స్వరాజ్యము సవ్యముగ పని చేయునను

విశ్వాసము శివాజీకి కల్గినది. ప్రతాపరావు గుజర్ యొక్క కుమార్తెతో తన రెండవ కుమారుడగు రాజారాంకు శివాజీ వివాహము చేసెను (15-3-1680). తరువాత కొద్దిరోజులకే శివాజీకి ఆరోగ్యము చెడిపోయెను. చెడిన ఆరోగ్యము కుదుట పడలేదు. చైత్ర శుక్ల పౌర్ణమి హనుమజ్జయంతి రోజున శివాజీ మహారాజు దివంగతులైరి (3-4-1680).

ACC NO. 629
894.81331
JAG
Ch. 2:25

